

డిసెంబర్, 2009

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక:11 పేజీలు: 64 వెల: రూ. 20/-



వన వ్త ంమ బవించిన యేసు ఌ


సిఎల్‌పి నే గా ఎ న
ముఖ మం శ్రీ ొణిజేటిరోశయ

స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 11

డిసెంబర్, 2009

ఎడిటర్

**ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**డి. రామకృష్ణ,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఏ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**మహమ్మద్ తకీయుద్దీన్**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ ఇ.వి. స్వర్ణలత**

**ఎన్. విజయ కుమార్**

**బి. నరేంద్రనాథ్ రావు**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
మాస్టర్ మల్టీమీడియా, హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్

రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail ID : Phanikumar@ap.gov.in

# విషయ సూచిక

సంపాదకీయం ..... 2
వై.యస్.ఆర్. అభయహస్తం ప్రారంభం ..... 3
వాతావరణంలో పెనుమార్పులు ..... 5
గ్లోబల్ వార్మింగ్ - భారతదేశ అజెండా ..... 9
శిక్షణారంగంలో ఈ-విద్య విప్లవం ..... 13
'ఈ-విద్య' కంటెంట్ అభివృద్ధిలో 12 దశలు ..... 16
పీఠికా పాటవం ..... 19
మన గ్రామం-మన ఆరోగ్యం, భద్రత, సౌకర్యం ..... 21
మానవీయత మూర్తీభవించిన యేసుక్రీస్తు ..... 25
తొలినాటి భారత్ క్రికెట్‌లో ఆంధ్రా ఆణిముత్యాలు ..... 29
అలరించిన బాలల చలన చిత్రోత్సవం ..... 32
మరిన్ని పనులకు 'ఉపాధిహామీ' ..... 38
రైతు నేస్తం - మన వ్యవసాయ విశ్వవిద్యాలయం ..... 39
గుర్తించని త్యాగానికి గుడ్‌బై (కథ) ..... 41
ఆంధ్రుల పాలిటి అన్నదాత ..... 48
ఎడ్లదానం (హాస వికాసం) ..... 50
పల్లెలకు కళ 'మల్లన్న పండుగ' ..... 53
మహనీయుల చతురోక్తులు ..... 56
కరువు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా
రూ. 4771.46 కోట్లు విడుదల ..... 57
ఆసక్తి, స్ఫూర్తి కలిగించిన ఆదర్శ పంచాయితీల సందర్శన ..... 58
వార్తల్లో 'అపార్డ్' ..... 63

## సంపాదకీయం..

# బాలల చలన చిత్రోత్సవం కనువిప్పు కావాలి

నవంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వారం రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవం పెద్దలనూ, పిల్లలను ఒకేలా అలరించింది. 1995 నుంచి అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవానికి హైదరాబాద్ శాశ్వత వేదికగా మారింది. అప్పటినుంచి ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ చలనచిత్రోత్సవం ఒక మలయ మారుతంలా వచ్చి మన మనస్సులను ఉర్రూతలూగిస్తూనే ఉంది.

ఈ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించిన అనేక చిత్రాలు పిల్లలూ, పెద్దలూ అనే భేదం లేకుండా ప్రేక్షకుల మనసును ఎంత దోచుకున్నాయో వర్ణించలేము. చిత్రం చూశాక కూడా చిత్రాల్లోని సన్నివేశాలు ప్రేక్షకులను వెంటాడుతూ ఉన్నాయి. చక్కని వినోదం పంచటంతో పాటు అమూల్యమైన విలువలు అందించిన చిత్రాలు; తోటి మనుషులు, సమాజం, జంతువులు, పర్యావరణం పట్ల ప్రేమ కలిగిఉండాలని హృదయానికి హత్తుకునే సన్నివేశాలతో రూపొందించిన చిత్రాలు ఎన్నో ఉన్నాయి.

చలన చిత్రోత్సవంలో ప్రదర్శించే చిత్రాలు తప్ప, మనకు విడిగా బాలల చిత్రాలు చూసే అవకాశం లభించటం లేదు. ఇప్పుడు వస్తున్న సినిమాల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. కేవలం లాభార్జన ధ్యేయంతో, సమాజం పట్ల ఎటువంటి బాధ్యత, ప్రేమ లేకుండా నిర్మిస్తున్న చిత్రాల వల్ల పిల్లలకు, యువతకు, పెద్దలకు, మొత్తంగా సమాజానికి హానే జరుగుతోంది. ఆరోగ్యకరమైన వినోదాన్ని అందించే స్థాయి వాటికి ఎటూ లేదు. ఈ చిత్రాలు సమాజంపై చెడు ప్రభావం కలుగజేస్తున్నాయనేది ఒక చేదు నిజం.

చలన చిత్రోత్సవంలో ప్రదర్శించిన చిత్రాలు మనను అంతగా ఆకట్టుకుని, అలరించినప్పుడు, అటువంటి చిత్రాలు ఎందుకు తీయటం లేదు? రెండేళ్ల కొకసారి తప్ప, మధ్యలో అటువంటి ఆణిముత్యాలను చూసే భాగ్యం మనకు ఎందుకు కలగటం లేదు? చలన చిత్ర నిర్మాతలు, దర్శకులు దీనిపై ఆలోచించవలసిన అవసరం ఉంది.

చలన చిత్రం అనేది బాలలు, యువత మనస్సులపై అత్యధిక ప్రభావం చూపే ఒక శక్తివంతమైన మాధ్యమం. బాలలు, యువతకు మనం ఏం చూపిస్తున్నామన్న అంశంపై వారి ప్రవర్తన ఆధారపడి ఉంటుంది. రేపటి పౌరులుగా మారే బాలల కోసం మంచి చిత్రాలు నిర్మించాల్సిన అవసరం ఉంది. బాలలు చెడు మార్గం పట్టకుండా, సన్మార్గంలో నడిచేలా మంచి చిత్రాలు దోహదం చేస్తాయి. సమాజంలో జీవించే హక్కు, చదువుకునే హక్కు మాదిరిగానే మంచి వినోదం పొందే హక్కు కూడా బాలలకు ఉంది. దాన్ని మనం, ముఖ్యంగా చలనచిత్ర నిర్మాతలు, దర్శకులు గౌరవించవలసి ఉంది. వ్యాపార చిత్రాల పోటీని తట్టుకుని బాలల చిత్రాలు మార్కెట్‌లో నిలబడేలా చేసే మార్గాలు ఆలోచించవలసి ఉంది. మంచి బాలల చిత్రాలు విడుదలయినప్పుడు పిల్లలు వాటిని చూసే అలవాటును తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెంపొందించాల్సి ఉంది. అప్పుడు అవి విజయవంతమై, మరిన్ని మంచి చిత్రాల నిర్మాణానికి దోహదపడగలవు.

హైదరాబాద్‌లో ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుగుతున్న అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం మనకు కనువిప్పు కలిగించి, అటువంటి పరిణామానికి తెర తీయగలదని ఆశిద్దాం.





# 'వై.యస్.ఆర్. అభయ హస్తం' ప్రారంభం

**తెలుగింటి ఆడపడుచులు వృద్ధాప్యంలో సైతం సగర్వంగా జీవించాలని దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి కన్న కలలు నిజమయ్యాయి. వృద్ధాప్యంలో ప్రతి మహిళకు నెలనెలా పింఛన్లు అందించేందుకు ఆయన ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'అభయ హస్తం' పథకం అమల్లోకి వచ్చింది. దీంతో ఈ పథకంలో చేరే మహిళలు 60 సంవత్సరాలు దాటిన తర్వాత నెలనెలా 2,300 రూపాయల వరకు ఫించన్లు పొందే అవకాశం కలిగింది.**

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ముఖ్యమంత్రి శ్రీ కె.రోశయ్య నవంబర్ 1న మహిళలకు బాండ్లు పంపిణీ చేసి ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల బహిరంగ సభలో శ్రీ రోశయ్య మాట్లాడుతూ, వై.యస్. పరిపాలన, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వాన్ని గుర్తు చేశారు. భారతదేశంలోనే వై.యస్. గొప్ప ముఖ్యమంత్రి అని ప్రశంసించారు. ప్రజా సంక్షేమం విషయంలో ఆయనకు మరెవరూ సాటిరారని కొనియాడారు. ఆయన అమల్లోకి తెచ్చిన పథకాలు, కార్యక్రమాలను కొనసాగించడమే తమ కర్తవ్యమని ప్రకటించారు.

## బతుక్కి భరోసా కల్పించే ఒక బృహత్తర పథకం

తెలుగింటి మహిళలకు జీవన మలి సంధ్యలో భరోసా కల్పించే బృహత్తర పథకం అభయహస్తం. వృద్ధాప్యంలోని ఏ మహిళా ఇతరుల పై ఆధారపడకుండా స్వాభిమానంతో, సగౌరవంగా జీవనం సాగించాలనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వై.యస్. దీనికి రూపకల్పన చేశారు. మహిళా సాధికారత కోసం నిత్యం తపించిన ఆయన కలల ప్రాజెక్టు ఇది. స్వయం సహాయక బృందాల్లోని మహిళలు రోజుకు ఒక్క రూపాయి చొప్పున చెల్లిస్తే, ప్రభుత్వం కూడా అంతే మొత్తంలో జమ చేస్తుంది.

- స్వయం సహాయక సంఘాల్లో ఒక ఏడాది నుంచి సభ్యురాలిగా ఉన్న 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళా ఈ పథకానికి అర్హురాలే.
- పొదుపు చేసిన మహిళల్లో 60 ఏళ్లు నిండిన ప్రతి వారికి ప్రతి నెల ఒకటో తేదీన కనీసం 500 రూపాయలు పింఛను వస్తుంది. పొదుపు చేసే మొత్తాన్ని బట్టి ఇది గరిష్టంగా రూ.2300 వరకు ఉంటుంది.
- 18 నుంచి 59 ఏళ్ల వరకు ఉన్న వారికి జీవిత బీమా సౌకర్యం ఉంటుంది.



- గ్రామీణ, పట్టణ మహిళలకు ఆసరాగా నిలిచే ఈ పథకానికి గత ఏడాది డిసెంబర్ 12న అంకురార్పణ జరిగింది. ఈ ఏడాది జనవరి 21న అప్పటి ముఖ్యమంత్రి వై.యస్. దీనిపై అధికారిక ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి శ్రీ రోశయ్య బాండ్ల పంపిణీకి నవంబర్ 2న శ్రీకారం చుట్టారు. దీంతో డిసెంబర్ నుంచి 4.5 లక్షల వృద్ధ మహిళలకు రూ. 500 చొప్పున పింఛను అందనుంది.

ఈ బహిరంగ సభలో ముఖ్యమంత్రి శ్రీ రోశయ్యతోపాటు కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి, మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, వట్టి వసంతకుమార్, ఎమ్మెల్యేలు రాజిరెడ్డి, కె.లక్ష్మారెడ్డి, కె.ఎస్.రత్నం, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


'అభయహస్తం' బహిరంగ సభలో ముఖ్యమంత్రి శ్రీ రోశయ్య మాట్లాడుతూ, "వై.యస్.ఆర్ 1978లో పులివెందులలో పోటీ చేసినప్పటి నుంచి నాకు తెలుసు. ఆ ఎన్నికల్లో బ్రహ్మానందరెడ్డితో పాటు నేను కూడా ప్రచారం చేశా. తర్వాత చేవెళ్ల పాదయాత్ర ప్రారంభంలో కూడా పాల్గొని ప్రసంగించా, వై.యస్. బుర్ర ఒక ప్రయోగశాలలాంటిది. ఎప్పుడూ ప్రజలకు ఏదో చేయాలని తపన పడేవారు. పేదవారికి మేలు జరిగే పథకాలు గురించి నాతో చర్చించే వారు. నాకు మాత్రం భయమేసేది. ఇన్ని నిధులు ఎక్కడి నుంచి వస్తాయని నేనంటే... ఎలాగైనా వస్తాయన్నా, ఫర్వాలేదనే వారు.

ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, స్కాలర్‌షిప్‌లు, రెండు రూపాయలకు కిలో బియ్యం వంటి పథకాలను అమలు చేసి ప్రజలకు ఎంతో మేలు చేశారు. దేవుడికి కూడా నచ్చాడేమో... త్వరగా తీసుకెళ్లాడు. ఆయన భౌతికంగా లేకపోయినా... ఆత్మ ఇక్కడే ఉంది. ఆయన పథకాలను కొనసాగించడమే నా కర్తవ్యం. అందుకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తాను. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం ఆర్థికంగా కష్టమని మేధావులు చెప్పారు. వ్యయం ఎక్కువైతే నీరు లేని ప్రాంతాలు అలాగే ఉండిపోవాలా? అని వై.యస్. ప్రశ్నించారు. అందుకే ప్రజల నుంచి వెలకట్టలేని అభిమానాన్ని కూడకట్టుకున్నారు. 'వై.యస్.ఆర్ అభయహస్తం' వల్ల 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతీ మహిళా పింఛన్ పొందడానికి వీలవుతుంది. 18వ ఏట ఈ పథకంలో చేరే మహిళకు 60 ఏళ్లు నిండిన తర్వాత 2,300 రూపాయల ఫించను అందుతుంది. తెలుగింటి చెల్లెళ్లకు అన్నగా ఆయన అందించిన వరమిది" అని వివరించారు.



## వై.యస్.కు సాటిలేరు : జైపాల్ రెడ్డి

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ, భారతదేశ చరిత్రలో వై.యస్.కు మరొకరు సాటిరారని చెప్పారు. సంక్షేమ రంగాల్లో ఆయనను మించిన ముఖ్యమంత్రి లేరని ప్రశంసించారు. సోనియాగాంధీ చొరవ వల్ల స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కలుగనుందని చెప్పారు. రాష్ట్ర హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, చెప్పకుండా వస్తానన్న వై.యస్ ఎవరికీ చెప్పకుండానే వెళ్లిపోయారని బాధను వ్యక్తం చేశారు. ఈ లోకంలో సూర్యచంద్రులు ఉన్నంత కాలం మహిళల గుండెల్లో వై.యస్.ఉంటారని చెప్పారు.




ప్రతి కార్యక్రమాన్ని చేపట్టే చేవెళ్ల ప్రాంతంతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ఏఐసిసి కార్యదర్శి, ఎమ్మెల్సీ పి. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, వై.యస్‌కు భారత రత్న ఇవ్వాలని, పోస్టల్ స్టాంపులను విడుదల చేయాలని కోరారు. అనంతరం మహిళలకు 'వై.యస్.ఆర్. అభయహస్తం' పథకానికి సంబంధించిన బాండ్లను, ఫించను చెక్‌లను శ్రీ రోశయ్య మహిళలకు అందజేశారు.

*– ఆర్.కె.*



# వాతావరణంలో పెనుమార్పులు

నూట పది కోట్ల ప్రజలకు ఆశ్రయమిస్తూ, ఉత్తరాన హిమాలయ పర్వతాలు, మిగిలిన అన్ని దిక్కుల సముద్రపు జలాలు చుట్టుముట్టి ఉన్న భారతావని కూడా వాతావరణంలో వచ్చే మార్పుల ప్రభావానికి గురయ్యే దేశాల్లో ఉంది.

భారతదేశానికి భౌగోళికంగా కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులు ఉన్నాయి, హిమాలయ పర్వతాలకే పరిమితమైన పర్యావరణ వ్యవస్థలు, ఇండస్, గంగా నదీతీర మైదానాలు, దక్కను పీఠభూమి మొదలైనవి మన దేశంలో ప్రత్యేకమైన వ్యవస్థలుగా చెప్పుకోవచ్చు. వాతావరణంలో వస్తున్న మార్పులు అంటే, మనకు ముందుగా ఎదురయ్యేది పెరుగుతున్న ఉష్ణోగ్రతలే. ఈ మార్పువల్ల వరదలు, వేడిగాలులు, తుఫానులు మరింతగా పెరుగుతాయి. సముద్రనీటి మట్టాలు పెరుగుతాయి. వ్యవసాయ ఉత్పత్తులు అనూహ్యంగా ఉంటాయి.

## కోపెన్ హేగన్ సమావేశంలో ఏం జరుగుతుంది?

### వాతావరణ మార్పులు

గ్రీన్‌హౌస్ ప్రభావం అనేది భూగ్రహానికి సంబంధించిన సహజ సిద్ధమైన ప్రక్రియ. దీని వల్లనే భూగ్రహం 30 సెంటీగ్రేడ్ల మేరకు ఉష్ణోగ్రత పెరిగి మానవులు, జంతువులు, వృక్షాలు జీవించడానికి అనువుగా ఉంది. ఈ గ్రీన్‌హౌస్ ప్రభావం లేకపోతే మానవ మనుగడ సాధ్యమయ్యేది కాదు!

నీటి ఆవిరి, కార్బన్ డయాక్సైడ్, మిథేన్, నైట్రస్ ఆక్సైడ్, ఓజోన్ మొదలైన గ్రీన్‌హౌస్ వాయువుల వల్ల ఈ ప్రక్రియ ఏర్పడుతోంది.



సూర్యుడి నుంచి వచ్చే ఉష్ణోగ్రతను ఈ గ్రీన్‌హౌస్ వాయువులు భూ వాతావరణంలోకి పంపిస్తున్నాయి.

గ్రీన్‌హౌస్ ప్రభావం చాలా సహజసిద్ధమైనది కాగా మానవ నాగరికత, ప్రత్యేకించి అభివృద్ధి చెందిన దేశాలు గత 200 సంవత్సరాలలో ఈ గ్రీన్‌హౌస్ ప్రభావాన్ని బాగా పెంచివేశాయి. వేగంగా జరిగిన పారిశ్రామికాభివృద్ధి వల్ల వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువులు ఉండవలసిన దాని కంటే ఎక్కువ కేంద్రీకృతమయ్యాయి. భూ వినియోగంలో వచ్చిన మార్పులు, అడవుల నరికివేత మొదలైన వాటి వల్ల ఈ పరిస్థితి మరింత తీవ్రమైంది. అడవులనేవి భూమికి ఊపిరితిత్తుల వంటివి. ఇవి కార్బన్‌డై యాక్సైడ్‌ను పీల్చుకుని



కోపెన్ హేగన్



వాతావరణంలో వేడిని తగ్గిస్తాయి.

ఈ సమస్య తీవ్రమైనదే, కాని అర్థం చేసుకోవటం తేలికైన పనే. వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువులు పెరిగేకొలదీ, ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. పెరిగిన ఉష్ణోగ్రత మన భూగ్రహంపై వివిధ రకాలుగా ప్రభావం చూపుతుంది. ఫలితంగా వాతావరణం పలు మార్పులకు గురవుతుంది. అందువల్ల, గ్రీన్‌హౌస్ వాయువులను అదుపు చేసి, వాటిని తగ్గించడానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## భారతదేశంలో రుతుపవనాలపై ప్రభావం ఎట్లా పడుతుంది?

ప్రతి 100 సంవత్సరాలకు మన దేశ ఉపరితల ఉష్ణోగ్రతలు 0.4 డిగ్రీల సెల్సియస్ వంతున పెరుగుతున్నాయని అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. ప్రత్యేకించి వర్షాకాలం తరువాత, శీతాకాలం సమయంలో ఇది జరుగుతుంది. 2050 సంత్సరాల నాటికి శీతాకాల, వేసవికాల సగటు ఉష్ణోగ్రతలు 3.2, 2.2 డిగ్రీల సెల్సియస్ వంతున పెరుగుతాయని అంచనా.

విపరీతంగా పెరిగే ఉష్ణోగ్రతలు, వేడిగాలుల వల్ల రుతుపవనాల ద్వారా వచ్చే వర్షాలపై ప్రభావం పడుతుంది. దేశంలోని మొత్తం వార్షిక వర్షపాతంలో 70 శాతం రుతుపవనాల వల్ల వచ్చే వర్షమే ఉంటుంది. వ్యవసాయానికి, నీటి అవసరాలకు ఈ వర్షమే ఆధారం. వర్షాకాలంలో, శీతాకాలంలో వచ్చే వర్షాలు రానున్న రోజుల్లో తగ్గుతాయని ఒక అంచనా.

అధిక ఉష్ణోగ్రత వల్ల హిమాలయాల్లోని మంచు త్వరగా కరిగిపోతుంది. మంచు కరిగే కాలంలోనే రుతుపవనాలు రావటం కనుక జరిగితే హిమాలయాల ప్రాంతంలో వరదల బీభత్సం తప్పదు.

వాతావరణంలో కలిగే మార్పుల వల్ల కొన్ని ప్రాంతాలు అధిక వర్షపాతానికి కురవగా, కొన్ని ప్రాంతాలు అనావృష్టికి లోనవుతాయి. దేశ వాయువ్య ప్రాంతంలోని పంజాబ్, రాజస్థాన్, దక్షిణాన తమిళనాడు రాష్ట్రాలలో వేసవి రుతుపవనాల కారణంగా వచ్చే వర్షపాతం తగ్గుతుందని అంచనా. ఈ రాష్ట్రాలను వదిలిపెడితే, దేశంలోని ఇతర రాష్ట్రాలన్నిటిలో వేసవి రుతుపవనాల వర్షపాతం 20 శాతం వరకూ పెరుగుతుందని అంచనా. మధ్యప్రదేశ్‌లో వర్షపు దినాల సంఖ్య తగ్గవచ్చు. అయితే, వర్షపు తీవ్రత దేశంలోని అధిక ప్రాంతాలలో పెరుగుతుందని అంచనా. ప్రత్యేకించి ఈశాన్య రాష్ట్రాలలో, ఉత్తరాది రాష్ట్రాలలో అధిక ఉష్ణోగ్రత ప్రభావం మరింత ఎక్కువగా ఉండవచ్చు. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతల అత్యధిక, అత్యల్ప ధోరణులు పెరుగుతాయని కూడా వివిధ పరిశోధనలు తెలియజేస్తున్నాయి.

## వ్యవసాయంపై ప్రభావం

ఉష్ణోగ్రతలో అత్యధిక, అత్యల్ప ధోరణులు, వర్షపాతంలో ఒడిదుడుకులు వ్యవసాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. మన దేశ జనాభాలో అధిక శాతం మందికి జీవనోపాధి వ్యవసాయమే. సహజ వనరుల ఆధారంపై నడిచే ఆర్థికవ్యవస్థ లోని ప్రజలు వాతావరణ మార్పుల వల్ల ఎంతగా ఇబ్బందులు పడతారో ఊహించుకోవచ్చు.

అధిక ఉష్ణోగ్రత పంటల కాలవ్యవధిని బాగా తగ్గించి వేస్తుందని,



ఉష్ణోగ్రతలో పెరుగుదల, తేమ శాతంలో మార్పు వల్ల మనుషుల ఆరోగ్యానికి ఎనలేని ముప్పు ఎదురవుతోంది. అధిక ఉష్ణోగ్రత వల్ల ఒత్తిడికి లోనవటం, తదితర దుష్పరిణామాలు ఏర్పడి రోగ నిరోధక వ్యవస్థను దెబ్బతీస్తాయి. పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల మలేరియా వంటి వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది.

## భారతదేశ వైఖరి

ఒక వైపు వాతావరణ మార్పుల వల్ల కలిగే తీవ్రమైన దుష్పరిణామాలను, వర్ధమాన దేశంగా తన స్థితిని అర్థం చేసుకుంటూనే, తన అభివృద్ధి అవసరాలు, తప్పనిసరి చర్యలు, పరిమితులకు అనుగుణమైన వైఖరితో డెన్మార్క్‌లోని కోపెన్‌హేగన్‌లో వాతావరణ మార్పులపై డిసెంబర్ 7న ప్రారంభమయ్యే 15వ అంతర్జాతీయ సమావేశానికి భారతదేశం హాజరవుతోంది. 'కాలుష్యకారకులే భరించాలి' సూత్రంపై ఆధారపడిన తన వైఖరినే కొనసాగించాలని భారతదేశ ప్రభుత్వం కోరుకుంటున్నది.

2012 లో క్యోటో ప్రోటోకాల్ కాలపరిమితి ముగుస్తుంది. ఆ తరువాత కాలానికి వాతావరణ మార్పులను ఏ విధంగా నిర్దేశించాలనే అజెండాతో అంతర్జాతీయ సమాజం సమావేశమవుతోంది. ఈ సమావేశంలో చర్చలు జరిపి తీసుకోబోయే నిర్ణయాలు వాతావరణ మార్పులపై నూతన అంతర్జాతీయ ఒప్పందానికి నాంది పలుకుతాయని, లేదా క్యోటో ప్రోటోకాల్ ఒప్పందానికి కొనసాగింపు ఒప్పందంగా ఉండగలవని భారతదేశం భావించటం లేదు. క్యోటో ప్రోటోకాల్ పరిధిలోనే అభివృద్ధి చెందిన దేశాలు గ్రీన్‌హౌస్ వాయువులను తగ్గించుకోవాలంటూ తాజా పరిమితులను మాత్రం ఈ సమావేశంలో విధించే అవకాశం ఉందని భారతదేశం భావిస్తోంది. వాతావరణ మార్పుల లక్ష్యాలపై ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి దోహదపడే ఒక కార్యాచరణ ప్రణాళికను కూడా ఈ సమావేశం రూపొందించవచ్చు.

తద్వారా పంటల దిగుబడి తగ్గుతుందని నిపుణులు చెప్తున్నారు. ఆహార పంటలపై ఇటువంటి ప్రభావం కనుక పడితే, మన ఆహార భద్రత ప్రశ్నార్థకమే కాగలదు. భూమికోత, క్రిమికీటకాలు, కలుపు మొక్కల పెరుగుదలకు వాతావరణ మార్పులు దోహదపడతాయి. వీటివల్ల వ్యవసాయం దెబ్బతినటం ఖాయం.

బంగాళాఖాతంలోనూ, వెలుపల 10 సంవత్సరాల పాటు జరిగిన ఒక అధ్యయనం కొన్ని ముఖ్యమైన అంశాలను బయటపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా సగటున సముద్ర జలాల ఎత్తు ఏడాదికి 2మి.మీ పెరుగుతుండగా, సుందర్‌బన్స్ డెల్టాలోని మడ అడవుల వద్ద 3.14 మి.మీ పెరిగింది. ఈ పల్లపు ప్రాంతంలో దాదాపు 40 లక్షల మంది జీవిస్తున్నారు. ఇక్కడ సముద్రజలాల ఎత్తు ఇట్లా పెరగటంతో వీరి మనుగడే ప్రమాదంలో పడింది.

అదే విధంగా భారతదేశ కోస్తా తీరం వెంబడి దశాబ్దానికి ఒక సెం.మీ. వంతున సముద్ర నీటిమట్టం పెరుగుతున్నట్లు నమోదైంది. సముద్రానికి సమీపంలోని నగరాలు, ఇతర ప్రాంతాల్లోని ప్రజానీకానికి ఈ రూపేణా ముప్పు ఎదురవుతోంది. గంగ, బ్రహ్మపుత్ర, ఇండస్ వంటి ప్రధానమైన నదుల డెల్టా ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో ప్రజలు నివశిస్తున్నారు. నదీ వనరులపై ఆధారపడి వీరు మనుగడ సాగిస్తున్నారు. సముద్ర జల మట్టాల పెరుగుదల, ఉప్పునీరు చొచ్చుకుని రావటం, భూభాగం నష్టపోవటం వంటి పరిణామాల వల్ల ఈ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతారు.



వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్ తప్పనిసరిగా అన్ని దేశాలు అమలు చేయాల్సిన చట్టబద్ధమైన సాధనమనే వైఖరిని పునరుద్ఘాటించాలనే యోచనతో భారతదేశం ఉంది. ఇందులోని సూత్రాలు, లక్ష్యాలు భారతదేశ లక్ష్యాలకు పూర్తిగా అనుగుణంగా ఉన్నాయి. భవిష్యత్తులో భారతదేశం ఈ అంశంపై చేపట్టే కార్యకలాపాలను ఇది నిర్దేశిస్తుంది. 2012లో క్యోటోప్రోటోకాల్ కాలపరిమితి ముగియదని, 2012 తరువాతి కాలానికి గ్రీన్‌హౌస్ వాయువుల తగ్గింపు విషయంలో వర్ధమానదేశాలు హామీలు ఇవ్వాలనే దిశలో ఏ పరిణామాలు జరగవని భారతదేశం బలంగా విశ్వసిస్తోంది.



వర్ధమాన దేశాల్లో సుస్థిర అభివృద్ధి సాధనకు ఆర్థిక వనరులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయడంలో అభివృద్ధి చెందిన దేశాలకు ఉన్న బాధ్యతలకు ఎటువంటి షరతులను అనుసంధానం చేయరాదని భారతదేశం తరపున చర్చల్లో పాల్గొంటున్నవారు పునరుద్ఘాటిస్తున్నారు. పైగా, గ్రీన్‌హౌస్ వాయువులను తగ్గించడానికి అంతర్జాతీయంగా పారిశ్రామిక రంగాల కంతటికీ వర్తించే ఎటువంటి నిబంధనలు ఉండరాదని వీరు అంటున్నారు.

వాతావరణ మార్పులపై మన ప్రధానమంత్రికి ప్రత్యేక అధికారిగా ఉన్న శ్రీ శ్యామ్‌శరణ్ ఇలా అంటున్నారు- " సుస్థిర అభివృద్ధిని సాధించడానికి దేశీయంగా మనం ఎటువంటి చర్యలు తీసుకున్నప్పటికీ, ప్రస్తుతం అమల్లో ఉన్న అంతర్జాతీయ నిబంధనల ప్రకారం గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను తగ్గించటానికి ఇప్పుడు కాని, 2012 తదనంతర కాలంలో కాని మనం ఖచ్చితంగా కట్టుబడవలసిన చట్టపరమైన బాధ్యత ఏదీ భారతదేశానికి లేదని స్పష్టంగా అర్థం చేసుకోవాల్సి ఉంది"

మరో వైపున చూస్తే, గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలలో అన్ని దేశాల కంటే ముందు ఉన్న అమెరికా మాత్రం ఇప్పటికీ క్యోటోప్రోటోకాల్‌కు అంగీకారం తెలుపలేదు. చైనా వంటి ప్రధాన వర్ధమాన దేశాలను అందులో చేర్చనిదే, గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలకు సంబంధించి ఖచ్చితమైన చట్టపరమైన హామీలను తాను ఇవ్వననటూ అమెరికా మళ్లీ తన పాత వైఖరినే తీసుకుంది. తన ఆర్థిక వ్యవస్థపై ఉద్యోగాలపై ప్రభావం చూపించే ఏ "హామీ" ఇవ్వటానికైనా అమెరికా తిరస్కరిస్తోంది.

గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలకు సంబంధించి క్యోటోప్రోటోకాల్‌లో అనెక్సర్-1 లో ఉన్న అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాల వైఖరి వల్ల వాతావరణ మార్పులపై జరిగే అంతర్జాతీయ ఒప్పందాలు నీరుకారిపోతున్నాయి. అయితే ఈ దేశాలతో పాటు ఇదే అనెక్సర్ -1లో ఉన్న యూరోపియన్ యూనియన్ వైఖరి ఎంతో మెరుగ్గా ఉంది. ఇతర అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు, ఏం చేస్తున్నాయన్న దానితో సంబంధం లేకుండా, గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలపై పెద్దపెద్ద లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి.

గ్రీన్‌హౌస్ వాయువుల విడుదల పైనే కాదు, అభివృద్ధి చెందిన . దేశాలు మరెంతో చేయవలసిఉంది. కార్బన్ వాయువుల విడుదలను తగ్గించగలిగే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునేందుకు తక్కువ ఆదాయం కలిగిన దేశాలకు ఈ అభివృద్ధి చెందిన దేశాలు ఆర్థిక సహాయం చేయవలసిఉంది. అడవుల నరికివేతను తగ్గించుకోవటానికి నష్టపరిహారం ఇవ్వాలి. పెరుగుతున్న సముద్రనీటి మట్టాలు, ఇతర వాతావరణ వైపరీత్యాల ముప్పును ఎదుర్కొంటున్న అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన చర్యలు తీసుకోవటానికి నిధులు సమకూర్చాలి. ఇవన్నీ పెద్ద కోరికల జాబితానే.



అభివృద్ధి చెందిన దేశాలు, చెందుతున్న దేశాల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలను గమనిస్తే, కోపెన్‌హేగన్‌లో ఖచ్చితమైన ఒప్పందాలు కుదురుతాయనే నమ్మకం కలగదు. అయితే, తీవ్రమైన వాదోపవాదాలు, సంప్రదింపులకు మాత్రం కోపెన్‌హేగన్ సమావేశం వేదిక కానున్నదని, మానవజాతి మనుగడకోసం సరైన దారిలో నడిచేలా దారిలో లేని దేశాలపై ఈ సంప్రదింపులు ఒత్తిడి తేగలవని నిపుణులు విశ్వసిస్తున్నారు.

– కె. వెంకటేశ్వర్లు

(అనువాదం : వై.సరోజ)

# గ్లోబల్ వార్మింగ్ - భారతదేశ అజెండా

భూమి ఉపరితలంపై శీతోష్ణస్థితి మార్పు వల్ల పర్యావరణానికి, తద్వారా జీవజాల మనుడగకు ఏర్పడబోయే ముప్పు ప్రభావాన్ని ఎదుర్కోవటం ఎలా అన్న విషయంపై ఇటీవలి కాలంలో జాతీయ, అంతర్జాతీయ వేదికలలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. శీతోష్ణస్థితి అనేది ఒక ప్రాంతానికి సంబంధించిన కొన్ని సంవత్సరాల సగటు ఉష్ణోగ్రత, వాయుపీడనం, పవనాలు, వర్షపాతం మొదలైన వాతావరణాంశాలను సూచిస్తుంది. మానవుని జీవనాధార సరళులు, ఆహార్యం, రూపురేఖలు మొదలైన ఎన్నో అంశాలకు, శీతోష్ణస్థితికి విడదీయరాని సంబంధం ఉందన్న విషయం మనకు తెలిసినదే. గత శతాబ్ది కాలంగా శీతోష్ణస్థితిలో చోటు చేసుకొంటున్న మార్పులు భూమిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ప్రపంచ దేశాలు అభివృద్ధి సాధించే ప్రక్రియలో పర్యావరణాన్ని పణంగా పెట్టి పారిశ్రామికీకరణను ప్రోత్సహించటంతో వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువుల పరిమాణం పెరిగి గత శతాబ్ది కాలంలో భూ ఉపరితల ఉష్ణోగ్రతలలో తీవ్రమైన మార్పులు సంభవించాయి. ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న శీతోష్ణస్థితి మార్పును ఎదుర్కొనేందుకు, ప్రజలను సంసిద్ధపరిచేందుకు ఐక్యరాజ్యసమితి 2009వ సంవత్సరాన్ని అంతర్జాతీయ శీతోష్ణస్థితి మార్పు సంవత్సరంగా ప్రకటించింది.

పెరుగుతున్న మానవ కార్యకలాపాల వల్ల ప్రపంచంలో ఏ మూలనయినా సంభవించే వాతావరణ మార్పు భూగోళంపై మరో ప్రాంతంలో అనూహ్యంగా విపరీత పరిణామాలకు దారితీయవచ్చు. పెద్దమొత్తంలో వాతావరణంలోకి విడుదల అవుతున్న కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, క్లోరోఫ్లోరో కార్బన్, నైట్రస్ ఆక్సైడ్, వంటి గ్రీన్ హౌస్ వాయువులు భూఉపరితలంపై ఉష్ణోగ్రతలు అంటే గ్లోబల్ వార్మింగ్ పెరగటానికి ప్రధాన కారణంగా గుర్తించటం జరిగింది.

## గ్రీన్ హౌస్ వాయువులు అంటే ఏవి?

భూమండలాన్ని ఆవరించి ఉన్న వాతావరణంలో ప్రధానంగా నత్రజని (78.08%), ప్రాణవాయువు (20.95%), ఆర్గాన్ (0.93%), కార్బన్ డై ఆక్సైడ్ (0.038%) తదితర వాయువులను కల్గి ఉంటుంది. వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, హైడ్రో ఫ్లోరో కార్బన్‌లు, పెర్ ఫ్లోరో కార్బన్‌లు, సల్ఫర్ హెక్సా ఫ్లోరైడ్ వంటి వాయువులను గ్రీన్ హౌస్ వాయువులంటారు. ఈ వాయువులు వాతావరణంలో ముఖ్యమైన పాత్రను నిర్వర్తిస్తాయి. సాధారణంగా సూర్యుని నుండి వెలువడిన కాంతి కిరణాలు భూమిపైపడి పరారుణ కాంతి కిరణాల రూపంలో పరావర్తనం చెందుతాయి. పరారుణ కాంతి కిరణాలను వాతావరణంలోని కార్బన్‌డైఆక్సైడ్ వాయువు గ్రహిస్తుంది. ఫలితంగా వాతావరణం వెచ్చగా మారి జీవుల మనుగడకు అవసరమయిన ఉష్ణోగ్రతను కల్గిస్తుంది. వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువుల పరిమాణంలో కార్బన్ డై ఆక్సైడ్ పరిమాణం గడిచిన 100 సం.లో గణనీయంగా పెరుగుతున్నట్లు పలు శాస్త్ర పరిశోధనల వల్ల తెలుస్తోంది. కార్బన్ డై ఆక్సైడ్ వాయువు మానవ శ్వాస క్రియలోనేగాక, కట్టెపుల్లలను, బొగ్గును మండించటం వల్ల, పెట్రోలు, డీజిలు వంటి శిలాజ ఇంధన వనరులను మండించటం వల్ల కూడా జనిస్తుంది. పెరుగుతున్న నగరీకరణ వల్ల వాహన కాలుష్యం పెరగటం, పారిశ్రామికీకరణ, విద్యుదీకరణ తదితర మానవజనిత కారణాలవల్ల వాతావరణంలోకి కార్బన్ డై ఆక్సైడ్ వాయువు అధిక మొత్తంలో విడుదల అవుతోంది. వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల పరిమాణం గణనీయంగా పెరగటంతో, ఈ వాయువులు గ్రహించే వేడి కూడ పెరిగి భూఉపరితల ఉష్ణోగ్రతలలో పెరుగుదల వస్తోంది. దీనినే మనం గ్లోబల్ వార్మింగ్ అని అంటున్నాము.

## క్యోటో ప్రోటోకాల్

శీతోష్ణస్థితి మార్పుపై తీసుకొనవలసిన చర్యల గూర్చి మొట్టమొదటిసారిగా 1992లో జరిగిన ఐక్యరాజ్యసమితి మహాసభలో ఒక తీర్మానం చేసారు. దీనిని యునైటెడ్ నేషన్సు ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్‌గా వ్యవహరిస్తారు. ఈ ఫ్రేమ్‌వర్క్ క్రింద ప్రపంచదేశాలను అభివృద్ధి చెందినవి గాను, వర్ధమాన దేశాలుగాను వర్గీకరించారు. అభివృద్ధి చెందిన దేశాలు వాతావరణంలోకి విడుదల అయ్యే గ్రీన్‌హౌస్ వాయువుల పరిమాణాన్ని 1990 స్థాయికి తగ్గించాలని ఈ తీర్మానం నిర్దేశిస్తున్నప్పటికీ, అభివృద్ధి చెందిన దేశాలు లక్ష్య పెట్టలేదు. దీనితో మరల గ్లోబల్ వార్మింగుకు కారణమైన గ్రీన్‌హౌస్ వాయువుల విడుదల నియంత్రించాలన్న ప్రధాన లక్ష్యంతో 1997 నవంబరు-డిసెంబరు నెలల్లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జపాన్‌లోని క్యోటోలో సర్వసభ్య సమావేశం జరిగింది. 160 సభ్య దేశాలు పాల్గొన్న ఈ సమావేశంలో శీతోష్ణస్థితి మార్పును ఎదుర్కొనేందుకు తీసుకొనవలసిన వ్యూహాలను గూర్చి విస్తృతంగా చర్చించి, సభ్యదేశాలు ఒక ప్రోటోకాల్‌ను తయారుచేశాయి. దీనినే క్యోటో ప్రోటోకాల్‌గా వ్యవహరిస్తారు.

## క్యోటో ప్రోటోకాల్

1. రోజురోజుకి తీవ్రమవుతున్న భూతాపాన్ని నియంత్రించేందుకు 1997లో ప్రపంచదేశాల మధ్య క్యోటోప్రోటోకాల్ కుదిరింది. ఈ ఒప్పందం 2005 ఫిబ్రవరి 15 నుండి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందాన్ని 2008-2012 మధ్య కాలంలో అమలుపరచాలి.
2. 2012 కల్లా గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను 1990 నాటి స్థాయిలో 5.2 శాతానికి తగ్గించాలన్నది క్యోటో ప్రోటోకాల్ లక్ష్యం.
3. ఈ ఒప్పందాన్ని సభ్యదేశాలు తమంతట తామే అమలుపరచాలి. అందుకు ఏవిధమయిన యంత్రాంగం లేదు.
4. ఈ ఒప్పందంలోని అభివృద్ధి చెందిన (Annexure-I) దేశాలు

గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను నియంత్రించాల్సి ఉంటుంది.

5. 2012 వరకు చైనా, భారత్‌లకు ఈ ఒప్పందం నుండి ఉన్న మినహాయింపును కారణంగా చూపుతూ అమెరికా ఈ ఒప్పందం నుంచి వైదొలిగింది.

6. ప్రపంచ జనాభాలో కేవలం నాలుగు శాతం ఉన్న అమెరికా 25 శాతం మేరకు గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తోంది. 2012 తర్వాత అనుసరించాల్సిన వ్యూహాలపై ఇప్పటికి అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు.

7. 2012 తర్వాత అనుసరించాల్సిన ఒప్పందం రూపకల్పనకు చివరి చర్చలు ఈ ఏడాది డిసెంబర్ 7 నుంచి 18 వరకు డెన్మార్క్‌లోని కోపెన్‌హేగన్‌లో జరుగనున్నాయి.

8. ప్రపంచ ఉద్గారాల్లో అత్యధిక శాతం వెలువరిస్తోన్న అమెరికా వంటి దేశాలు గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించుకోకుంటే.. ఒప్పంద లక్ష్యాలను సాధించడం కష్టం.

9. కేవలం చెట్ల పెంపకం, అటవీకరణపై మాత్రమే దృష్టి పెట్టకుండా ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధి, వాడకం, క్లీన్ టెక్నాలజీ అభివృద్ధి, సుస్థిర వ్యవసాయం, జీవ వైవిధ్య పరిరక్షణ, అర్థవంతమైన ప్రభుత్వ విధానాల ద్వారా మాత్రమే భూతాపాన్ని నియంత్రించగలం.

క్యోటో ప్రోటోకాల్‌కు కట్టుబడి పనిచేయాల్సిన అవసరం లేకపోయినా మన దేశం తనవంతు కృషిచేస్తోంది. ప్రోటోకాల్ ప్రకారం క్లీన్ డవలప్‌మెంట్ మెకానిజం క్రింద పెట్టుబడుల ప్రోత్సాహానికి ఉద్దేశించిన ప్రాజెక్టులు అధికంగా మనదేశంలోనే ఉన్నాయి. వర్ధమాన దేశాలలో పర్యావరణ అనుకూలమైన సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తున్నందుకు గాను ఈ ప్రాజెక్టులు లభిస్తాయి. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను తగ్గించటం ద్వారా వర్ధమాన దేశాలలోని ప్రాజెక్టులు కార్బన్ క్రెడిట్లను పొందే అవకాశం లభిస్తుంది.

## శీతోష్ణస్థితి మార్పుపై అధ్యయనం కోసం అంతర్ ప్రభుత్వ ప్యానల్ (ఐ.పి.సి.సి) నివేదిక

**ఐ.పి.సి.సి నివేదిక**

ఐక్యరాజ్యసమితి చెందిన United Nations Framework Convention on Climate Change (UNFCCC) లో భాగంగా ఏర్పాటైన IPCC గ్లోబల్ వార్మింగ్‌ను పూర్తిగా అధ్యయనం చేసింది. సుమారు 2500కు పైగా శాస్త్రవేత్తలున్న IPCCకు భారతీయుడైన రాజేంద్రకుమార్ పచౌరీ చైర్మన్‌గా వ్యవహరించారు. 2007 ఫిబ్రవరిలో IPCC తన నాల్గవ అసెస్‌మెంట్ నివేదికను విడుదల చేసింది. అందులోని ముఖ్యాంశాలు.

1. గత 50 ఏళ్ళలో దశాబ్దానికి $1^0C$ చొప్పున ఉష్ణోగ్రతలు పెరిగాయి. రానున్న 30 ఏళ్ళలో దశాబ్దానికి $2^0C$ చొప్పున సగటు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

2. 2100 కల్లా సగటు భూ ఉష్ణోగ్రతలు $1.8^0C$ నుంచి పెరిగే అవకాశం ఉంది. ఇటువంటి పెరుగుదల దక్షిణ ఆసియాలో తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది.

3. భూతాపానికి ప్రధాన కారణం $CH_2$, $CH_4$, $N_2O$, PFC, HFC, $SF_6$లు.

4. భూ ఉష్ణోగ్రతలు $2^0$-$3^0$-C పెరిగితే 20-30 శాతం జీవవైవిధ్య నష్టం జరుగుతుంది.

5. హిమాలయాల్లోని హిమ నదులు, హిమ పర్వతాలు వేగంగా కరిగి 2035 కల్లా పూర్తిగా అదృశ్యమయ్యే ప్రమాదం ఉంది.

6. 2040 కల్లా భూమి ఉష్ణోగ్రతలు $1.2^0C$ లకు పైగా పెరిగితే వ్యవసాయ దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉంటుంది.

7. 2100 కల్లా ప్రపంచ వ్యవసాయ దిగుబడి 25% తగ్గనుంది.

8. 2020 కల్లా 25 కోట్ల మంది ప్రజలు నీటి కొరతను ఎదుర్కోనున్నారు.

9. బంగ్లాదేశ్ 1,000 చ.కి.మీ విస్తీర్ణంలో వ్యవసాయ భూముల్ని కోల్పోనుంది.


10. 2030 కల్లా సముద్రమట్టం 30-80 సెం.మీ. పెరిగి, తీరప్రాంతాలు, అనేక దీవులు మునిగిపోతాయి.


11. 1850 తర్వాత గుర్తించిన 10 అత్యంత వేడి సంవత్సరాలు 1990 తర్వాత నమోదైనవే. 1998 అధిక వేడి సంవత్సరంగా నమోదైంది. అత్యంత వేడి దశాబ్దం 1990-2000.

## గ్లోబల్ వార్మింగ్ వల్ల ఏర్పడే దుష్పరిణామాలు

గ్లోబల్ వార్మింగ్ వల్ల ఏర్పడే దుష్పరిణామాలలో హిమానీనదాలు కరిగిపోవటం, ధృవ ప్రాంతాలలో మంచు కరిగి సముద్ర మట్టం పెరగటం, తీర ప్రాంతాలు కోతకు గురవటం, పచ్చని ప్రదేశాలు ఎడారులుగా మారటం, అతివృష్టి లేదా అనావృష్టి పరిస్థితులు ఏర్పడటం, తుపానులు, కరువు కాటకాలు సంభవించటం వంటివి ముఖ్యమైనవి. జీవ వైవిధ్యానికి ముప్పు వాటిల్లుతుంది. ఉష్ణోగ్రతలు పెరగటం వల్ల భూపరితలంపై నీరు త్వరగా ఆవిరైపోతుంది. నీటి ఎద్దడి తలెత్తవచ్చు.

ఉష్ణోగ్రతలు పెరగటం వల్ల కొన్ని రకాల వ్యాధికారక క్రిములు మనగల్గటానికి అనుకూల పరిస్థితులేర్పడి అంటువ్యాధులు ప్రబలి ప్రజారోగ్యంపై విషమ ప్రభావాన్ని చూపుతాయి. శ్వాససంబంధమైన వ్యాధులు, ఉష్ణ మండలపు వ్యాధులు అంటే మలేరియా, అమీబియాసిస్ మొదలైన వ్యాధులు సంక్రమిస్తాయి. అతినీల లోహిత






కిరణాల ప్రభావం వల్ల చర్మ సంబంధమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నది.

గ్లోబల్ వార్మింగ్ వల్ల వ్యవసాయ పంటలపై కూడా ప్రతికూల ప్రభావం పడి పంటల ఉత్పాదకత తగ్గిపోవటానికి ఆస్కారం ఉన్నది. దీనివల్ల ఆహార భద్రత సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నది. భారతదేశం ప్రధానంగా వ్యవసాయాధార దేశం. 2001 జనాభా లెక్కల ప్రకారం 57 శాతం శ్రామికులు ప్రాథమికరంగంలోనే తమ జీవనోపాధులను పొందుతున్నారు. దేశంలో అధికశాతం భూమిలో వర్షాధారంపైనే పంటలు పండిస్తున్నారు. వర్షపాతం సరళులలో ఏమాత్రం మార్పు వచ్చి సకాలంలో వర్షాలు పడకపోయినా ఆ ప్రభావం వ్యవసాయ పంటలపై, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధిపై చూపుతుంది.

సముద్ర మట్టం పెరుగుదల వల్ల సముద్ర తీరప్రాంతాలలోని భూగర్భ జలవనరులు కలుషితమై ఉప్పునీటిగా మారిపోతాయి. ఇప్పటికే జనాభా అవసరాల దృష్ట్యా, భూగర్భజలాలను విచక్షణా రహితంగా తోడి వేయటం వల్ల గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని సముద్ర తీర ప్రాంతాలలోని భూగర్భ జలవనరులలోకి సముద్రపు నీరు చొచ్చుకొని రావటంతో నిరుపయోగంగా మారాయి. సముద్రమట్టం పెరుగుదల వల్ల తీరప్రాంతంలోని భూగర్భంలోని రాతిపొరలలో కొద్దోగొప్పో మిగిలిన మంచినీరు కూడా ఉప్పు నీరుగా మారిపోయే ప్రమాదం ఉన్నది.

శీతోష్ణస్థితి మార్పుతో పశ్చిమ హిమాలయ పర్వతాలలోని హిమానీనదులు కరగటం వల్ల గంగానదీ డెల్టా ప్రాంతంలోకి వచ్చే నీటి పరిమాణం పెరుగుతుంది. లోతట్టు ప్రాంతాలలో నివశించే జనాభా తరచుగా వరదల తాకిడికి గురవటమే కాక జీవనోపాధులలో స్థిరత్వాన్ని కోల్పోతారు. అంతేగాక పశ్చిమ బెంగాల్‌లోని సుందరబన్‌లోని మడ అడవులలో పెరిగే వృక్ష జాతుల విస్తృతిపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. కేవలం తక్కువ లవణీయత గల నీటిలో మాత్రమే మనగలిగే వృక్షజాతులు మాత్రమే సుందరబన్‌లో పెరిగే అవకాశం ఉంటుంది.

## శీతోష్ణస్థితి మార్పును ఎదుర్కోవటం ఎలా?

శీతోష్ణస్థితి మార్పు ఏ ఒక్క దేశానికో పరిమితమైన సమస్య కాదు. వాతావరణ మార్పుల వల్ల సంభవించే ప్రతికూల ఫలితాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ప్రపంచ దేశాలన్నీ సంఘటితంగా కృషి చేయాలి. అందుకే సహస్రాబ్ది లక్ష్యాలలో 7వ లక్ష్యం ద్వారా సుస్థిర పర్యావరణ సాధనకు నడుంబిగించాలని 191 ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు ఒప్పందం చేసుకొన్నాయి. దీనిలో భాగంగా పర్యావరణ క్షీణతకు ముఖ్యంగా గ్లోబల్ వార్మింగ్‌కు కారకాలైన కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారం, ఓజోన్ పొరకు నష్టం కలుగచేస్తున్న క్లోరో ఫ్లూరో కార్బన్‌ను విడుదల, శిలాజ ఇంధన వినియోగం, ఘన ఇంధన వనరుల వినియోగించే జనాభా శాతం తదితర అంశాలపై సూచికలను రూపొందించి దేశాల వారీగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తరుచుగా సమీక్షిస్తూ తగిన చర్యలు తీసుకొనటానికి ఐక్యరాజ్యసమితి కృషి చేస్తోంది. 1997 క్యోటో ప్రోటోకాల్ ప్రకారం 2012 నాటికి అభివృద్ధి చెందిన దేశాలు ఈ వాయువుల విడుదలను 1990ల నాటి స్థాయికి అంటే 5.2 శాతానికి తగ్గించాలనేది లక్ష్యంగా నిర్ధారించారు. అమెరికా 2020 నాటికి గ్రీన్ హౌస్ వాయువుల విడుదలను 1990 స్థాయికి తీసుకొని రావాలనుకుంటోంది. యూరోపియన్ యూనియన్ 2020 నాటికి గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను 20 శాతం, యునైటెడ్ కింగ్‌డమ్ 26 శాతం, స్వీడన్ 35 శాతం తగ్గించుకోవటానికి ప్రణాళికలను సిద్ధం చేసుకున్నాయి.

వాతావరణ మార్పును ఎదుర్కోవటానికి చతుర్ముఖ వ్యూహంగా 1) మార్పుకు సర్దుకు పోవటం, 2) వాతావరణ మార్పు ప్రభావాన్ని తగ్గించటం 3) తగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని కనుగొనటం 4) శీతోష్ణస్థితి పై ప్రభావం తగ్గించే పరిశ్రమలకు, ఇతర ప్రయత్నాలకు ఆర్థిక సహాయం చేయటం అన్న అంశాలను ప్రపంచ దేశాలు అమలు పరుస్తున్నాయి.

## భారతదేశం ఏం చర్యలు తీసుకుంటోంది?


భారతదేశం ప్రపంచంలో 4వ అతిపెద్ద వ్యవస్థే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేసే దేశాలలో 5వ స్థానాన్ని ఆక్రమిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సాలీనా సగటున 4 టన్నులు తలసరి గ్రీన్‌హౌస్ వాయువులు విడుదల అవుతుండగా, మనదేశంలో విడుదల అయ్యే తలసరి గ్రీన్‌హౌస్ వాయువులు సాలీనా 1.3 టన్నులు మాత్రమే. ఇదే అభివృద్ధి చెందిన అమెరికా, యూరోప్ దేశాలలో సగటున సాలీనా 12 టన్నులు విడుదల అవుతున్నాయి. భారతదేశంలో గ్రీన్ హౌస్ వాయువులు అధిక పరిమాణంలో వెలువడుతున్నప్పటికీ, అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుంటే తలసరి గ్రీన్‌హౌస్ వాయువుల విడుదల చాల తక్కువ. అందుకే అంతర్జాతీయ వేదికలలో భారతదేశం గ్రీన్ హౌస్ వాయువుల పరిమాణాన్ని కాకుండా తలసరి విడుదలను ప్రాతిపదికగా తీసుకొని లక్ష్యాలను నిర్ధారిస్తే, భారతదేశం లాంటి అభివృద్ధి చెందిన దేశాలకు లాభదాయకంగా ఉంటుందని గట్టిగా వాదిస్తోంది. 2004 సం॥లో వేయబడిన అంచనాల ప్రకారం మనదేశంలో విడుదల అయ్యే గ్రీన్‌హౌస్ వాయువులు ప్రధానంగా విద్యుత్తు రంగంలో 40%, వ్యవసాయ రంగంలో 23%, పారిశ్రామిక రంగంలో 15%, గృహ సంబంధమైన రంగంలో 9%, వ్యర్థ పదార్థాల ద్వారా 7%, రవాణారంగంలో 6%, భూవినియోగం మేర జనిస్తున్నాయి.

ఇంచుమించు 7500 కి.మీ సముద్ర తీరప్రాంతం కల్గిన భారతదేశంలో తీరప్రాంతంలో 15 శాతం జనాభా నివశిస్తున్నారు. భారత

భూభాగంలో 12 శాతం తరచుగా వరదలకు, 16 శాతం కరువు కాటకాలకు, 3 శాతం కొండచరియలు విరిగిపడి విపత్తులు సంభవించే (ల్యాండ్ స్లైడ్) ప్రాంతంగాను ఉన్నది. వాతావరణంలో ఏ కొద్ది పాటి మార్పులకైన ముందుగా సముద్ర తీరప్రాంతాలు ముందుగా ప్రభావితం అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

వాతావరణ మార్పు ప్రభావం కేవలం ఏ ఒక్క రంగానికో పరిమితమైనది కాదు. దీని ప్రభావం ఒక గొలుసు చర్య వలె ఆర్థికరంగం మొదలుకొని వ్యవసాయం, పరిశ్రమలు, పర్యావరణం, ప్రజల జీవనోపాధులు తదితర రంగాలపై పడుతుంది. అందుకే ఈ సమస్యపై విస్తృతమైన అవగాహన కలుగచేయటానికి భారత ప్రభుత్వం దేశం నలుమూలలా పర్యావరణ సమాచార వ్యవస్థలను ఏర్పరచి పాలకులకు, పరిశోధకులకు, శాస్త్రవేత్తలకు, సామాన్య ప్రజలకు, విద్యార్థులకు కీలకమైన సమాచారాన్ని అందచేయటానికి సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఇంటర్‌నెట్ ఆధార సేవలను అందచేస్తోంది. అనేక విధాన నిర్ణయాలలో, పథకాలలో వాతావరణ మార్పును దృష్టిలో ఉంచుకొని పలు నియమ నిబంధనలు రూపొందించి ఈ ప్రభావాన్ని ప్రజలపై పడకుండా చేయటానికి కృషి చేస్తోంది. పాఠశాల, కళాశాల స్థాయిలలో కూడా పర్యావరణ విద్యను పాఠ్యాంశంగా చేసి విద్యార్థులను చైతన్యవంతం చేస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న వాతావరణ మార్పుల వల్ల మన దేశంపై పడనున్న ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు, అందుబాటులో నున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని శక్తి వనరులను, సహజ వనరులను అభిలషనీయమైన రీతిలో వినియోగించుకొని సుస్థిర అభివృద్ధిని సాధించటానికి ప్రభుత్వం వాతావరణ మార్పుపై ఒక జాతీయ కార్యాచరణ ప్రణాళికను జూన్ 2008లో ప్రకటించింది. దేశంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో బొగ్గు నుండి ఉత్పత్తి చేసే విద్యుత్తు మూడింట రెండు వంతులు ఉంది. విద్యుత్ ఉత్పాదనలో బొగ్గును మండించటం వల్ల టన్నుల కొద్దీ బొగ్గుపులుసు వాయువు వాతావరణంలోకి విడుదల అవుతుంది. భారతప్రభుత్వ నూతన ఇంధన విధానం ప్రకారం సాంప్రదాయేతర ఇంధన వనరులనుండి అంటే సౌరశక్తి, పవనశక్తి నుండి విద్యుత్తును ఉత్పత్తి చేసే కంపెనీలకు ప్రత్యేక రాయితీలను అందచేస్తూ, క్లీన్ డవలప్‌మెంట్ మెకానిజంను ప్రోత్సహించటం, వివిధ విద్యుత్ పంపిణీ కంపెనీలు సరఫరా చేసే విద్యుత్తులో నిర్ణీత మొత్తంలో సాంప్రదాయేతర ఇంధన వనరుల నుండి ఉత్పత్తి చేసిన విద్యుత్తును తప్పనిసరిగా పంపిణీ చేయాలన్న నిబంధనలను రూపొందించటం వంటివి ఉన్నాయి. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ద్వారా తక్కువ విద్యుత్తును వినియోగించే విద్యుత్తు ఉపకరణాలను ప్రోత్సహించటం వంటి చర్యలను ఇప్పటికే భారత ప్రభుత్వం చేపట్టింది. శిలాజ ఇంధన వనరుల వినియోగాన్ని తగ్గించే క్రమంలో భారత ప్రభుత్వం ఇప్పటికే ఢిల్లీ, ముంబాయి వంటి మెట్రోనగరాలలో పెట్రోలు, డీజిల్ స్థానంలో సి.ఎన్.జి/ ఎల్.పి.జి లతో నడిచే వాహనాలను తప్పని సరిచేసింది. సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించటంతో పాటు, జాయింట్ ఫారెస్టు మేనేజ్‌మెంట్, సహజ వనరుల సంరక్షణకు ఉద్దేశించి వాటర్‌షెడ్ అభివృద్ధి పథకం, ప్రజల జీవనోపాధులకు భద్రత కల్పించే ఉపాధిహామీ




పథకం, పంటల బీమా పథకం వంటి పథకాలను కూడా కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పర్యావరణ పరిరక్షణకు గాను పలు చట్టాల ద్వారా ఈ మేరకు చర్యలు తీసుకొంటున్నాయి.


వాతావరణ మార్పుపై ప్రభుత్వం ప్రకటించిన జాతీయ కార్యచరణ ప్రణాళిక ప్రకారం వాతావరణ మార్పును ఎదుర్కొనేందుకు ఈ క్రింది స్థాయి మిషన్‌లు ఏర్పాటు అయ్యాయి.

1. జాతీయ సౌర మిషన్
2. జాతీయ శక్తివనరుల సామర్థ పెంపు మిషన్
3. జాతీయ సుస్థిర ఆవాసాల మిషన్
4. జాతీయ జల మిషన్
5. సుస్థిరమైన హిమాలయ పర్యావరణ వ్యవస్థ సాధన మిషన్
6. హరిత దేశంగా అవతరించేందుకు కృషి కొరకు ప్రత్యేక మిషన్
7. సుస్థిర వ్యవసాయ మిషన్
8. వాతావరణ మార్పును ఎదుర్కొనేందుకు వ్యూహాలను రూపొందించే మిషన్

ఐతే ఈ 8 మిషన్‌ల కార్యకలాపాలు ఇప్పుడిప్పుడే ప్రారంభం అవుతున్నాయి. పైన పేరొన్న 8వ మిషన్ ప్రధానంగా సుస్థిర అభివృద్ధి కూడిన ఆర్థికవృద్ధిని సాధించటానికి పర్యావరణమిత్ర ప్రణాళికలను రూపొందించేందుకు ఇప్పటికే వ్యూహ పత్రాన్ని విడుదల చేసింది. రాబోయే కాలంలో మిగిలిన మిషన్లు కూడా ఆయా మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో విషయ నిపుణులైన మేధావి వర్గంతో, ఇతర మంత్రిత్వ శాఖల ప్రతినిధులతో కలిసి విధాన పత్రాలను రూపొందించి 11వ, 12వ పంచవర్ష ప్రణాళికల కాలంలో అవసరమయిన చర్యలను చేపట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఇప్పటికే అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ వంటి దేశాలకు, భారతదేశం లాంటి వర్థమాన దేశాలకు ఒకే రకమయిన నిబంధనలు వర్తింపచేయటం ఆమోదయోగ్యం కాదనే తనవాదనను వినిపించటానికి సమాయత్తమవుతున్న భారతదేశ ప్రయత్నాలు డిసెంబరు 2009లో కోపెన్‌హేగన్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి సదస్సులో ఫలించాలని ఆశిద్దాం.

*డా. వి. శివశంకర ప్రసాద్*
జూనియర్ ఫ్యాకల్టీ, అపార్డ్

# శిక్షణా రంగంలో 'ఈ-విద్య' విప్లవం



**'ఈ-విద్య' (E- Learning) అంటే ఏమిటి?**

విద్య, శిక్షణా రంగాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ప్రభావశీలంగా వినియోగించడాన్నే 'ఈ-విద్య' అంటారు.

అధ్యయనం, సెమినార్లు, స్వయం శిక్షణతో ప్రతివ్యక్తీ పురోగమిస్తాడు.

అటువంటి వారికి వేగంగా, చౌకగా, ఉత్తమమైన పరిష్కారాన్ని 'ఈ-విద్య' ఇస్తుంది.

విస్తృత పరిధిలో ఎన్నో రకాల బోధనా పద్ధతులను 'ఈ-విద్య' అందిస్తుంది.

అనేక రకాల బోధనా పద్ధతులను ఉపయోగించి విద్యను నేర్చుకోవడాన్నే 'మిశ్రమ విద్య' అంటారు. దీంట్లో ప్రాథమికంగా రెండు బోధనా పద్ధతులు కలిసి ఉన్నాయి. అవి - 1) అసమకాలిక విద్య 2) సమకాలిక విద్య. సమకాలిక విద్యలో విద్యార్థులు, లెక్చరర్ ఒకే సమయంలో ఒకే చోట ఉంటారు. లేదా వారు భౌతికంగా వేరువేరు ప్రదేశాలలో ఉండి సమకాలిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఒక తరగతిలో ఉన్న మాదిరిగా పరస్పరం చర్చించుకొంటారు.

అసమకాలిక విద్యలో ఒక్కో విద్యార్థి ఒక్కో సమయాన్ని ఎంచుకొంటాడు. సమాచారాన్ని ఎంత వేగంగా స్వీకరించాలన్నది అతడే నిర్ణయించుకొంటాడు. వాస్తవిక సమయంలో అతడు చర్చలో పాల్గొనడు. కానీ పుస్తకాలు, ఆడియో/ వీడియో లేక ఇతర ఎలక్ట్రానిక్ శిక్షణ ద్వారా పాఠాలు నేర్చుకొంటాడు.

ప్రామాణిక శిక్షణా పద్ధతి ఎన్నో యుగాలుగా అమల్లో ఉంది. ఈ పద్ధతిలో బోధకులు ఉంటారు. అయితే వీరు అన్నిచోట్ల లభించరు. అందుకని ఈ సమస్యకు 'ఈ-విద్య' పరిష్కారం. ప్రామాణిక పద్ధతుల్లో ఉండే అనేక లోపాలకు 'ఈ-విద్య' పరిష్కారం చూపుతుంది. అంతేకాకుండా, ఉన్నతస్థాయిలో క్లిష్టమైన శిక్షణకు కూడా ఇదే అనుకూలమైంది.

ఉదాహరణకు, కొన్ని సందర్భాలలో విద్యార్థులు, బోధకుడు వ్యక్తిగతంగా ఒకే చోట ఉండటం వీలుకాదు. అటువంటపుడు 'ఈ-విద్యే' శరణ్యం. ప్రామాణిక శిక్షణలో విద్యార్థుల ఎదుటే లెక్చరర్ ఉంటాడు. ఎన్నో ప్రశ్నలను అడిగి అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చు. కష్టమైన అంశాలపై మరింత దృష్టి పెట్టవచ్చు. కావాలంటే శిక్షణా కాలాన్ని తగ్గించుకోనూవచ్చు లేదా పెంచుకోనూవచ్చు.

ఈ-మెయిల్, వీడియో కాన్ఫరెన్స్ వంటి కొత్తరకాల కమ్యూనికేషన్ సాధనాలను 'ఈ-విద్య' అమల్లోకి తెస్తున్నది. వీటివల్ల విద్యార్థులకు లెక్చరర్ అందుబాటులో ఉంటాడు. విజ్ఞానాన్ని సులభంగా, వేగంగా తను విద్యార్థులకు పంచేందుకు లెక్చరర్లకు'ఈ-విద్య' శక్తివంతమైన సాధనాలనిస్తుంది. లెక్చరర్ల అనుభవాలు, నైపుణ్యం అవసరం ఉన్న వారికి అవి సత్వరం చేరతాయి.

'ఈ-విద్య'కు విషయం (కంటెంట్), మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, డెవలప్‌మెంట్ టూల్స్, LCMS (లెర్నింగ్ కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్), వాటి మధ్య సంబంధాలు అనేవి ముఖ్య అంశాలు.

**విషయం**

- బోధనా విషయాలు, స్వయం ప్రేరకంగాను, విద్యార్థిని లక్ష్యదిశగా నడిపించేవి గాను, ఆచరణాత్మకంగాను, అనుభవాల ఆధారంగాను ఉండాలి.
- కంట్రోళ్లు, ఛోదనం (నావిగేషన్) సులభంగా ఉపయోగించేలా ఉండాలి.
- విద్యా లక్ష్యాలు నిర్దుష్టంగా, పరిమాణాత్మకంగా ఉండాలి.
- విద్యా విషయాలు తర్క బద్ధంగా ఉండాలి. ప్రాక్టికల్ ఉదాహరణలు, కేస్ స్టడీస్, కృత్రిమ వాతావరణంలో సృష్టించడం (సిమ్యులేషన్), గ్రాఫిక్స్ ద్వారా వివరించేలా బోధనా వ్యూహం ఉండాలి.
- వివిధ బోధనా వ్యూహాలను అనుసంధానం చేయాలి.
- మూల్యాంకనం ప్రగతిని ఖాయం చేయాలి.
- పాఠ్యాంశాల స్వరూప స్వభావాలు, విద్యార్థుల నేపథ్యం (వారి విద్యాస్థాయి, కంప్యూటర్లతో వున్న అనుభవం), నేర్పాల్సిన పాఠాలు (థియరీ, ప్రాక్టికల్స్) వంటి వివిధ ప్రమాణాల ఆధారంగా ఉండాలి.

**నేర్చుకునే యాజమాన్య పద్ధతి లేదా LMS (లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం)**

ప్రధాన కర్తవ్యం వివిధ అంశాలను సంఘటిత పర్చడం, లెర్నింగ్ మేనేజ్‌మెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించడం. వివిధ సంస్థలు రూపొందించిన LMS విధుల్లో అనేక వ్యత్యాసాలు ఉంటాయి. ఎలక్ట్రానిక్ ప్రారంభకోర్సుల నుంచి ఉన్నత స్థాయి కోర్సుల వరకు శిక్షణా నిర్వహణ అంతా సక్రమంగా జరిగేలా చూడాలి.

**ఉత్తమ LMS లక్షణాలు**

- అసమకాలిక (Asynchronous) ఎలక్ట్రానిక్ కోర్సులు పరోక్ష (virtual) తరగతి గదుల నుంచి సాంప్రదాయక తరగతుల వరకు అన్ని రకాల విద్యకు అనుకూలంగా ఉండాలి.
- అన్ని శిక్షణా పద్ధతులను అంటే ఎలక్ట్రానిక్ కోర్సులు, పరోక్ష తరగతి గదులు / వీడియో కాన్ఫరెన్స్‌లు, తరగతి గది బోధనలు, ఎక్స్‌టర్నల్ కోర్సులు వంటి వాటితో పాటు రిజిస్ట్రేషన్ పద్ధతులు, మానవవనరులు, ఆర్థిక వనరులకు సంబంధించిన వ్యవహారాలపై ఒక సమగ్ర జాబితా రూపొందించబడి ఉండాలి.
- సంస్థ స్వరూప స్వభావాలు, దాని పటిమా సామర్థ్యాలు, వ్యక్తిగత నైపుణ్యాలకు ఒక రూపాన్ని ఇవ్వాలి.
- శిక్షణా కార్యకలాపాలన్నీ అందుబాటులో ఉండాలి. ఒక్కో యూజర్ కార్యకలాపాలన్నింటినీ పర్యవేక్షిస్తూ ఉండాలి. అన్ని రకాల బోధనా కార్యకలాపాలపై విడిగాను, సంయుక్తంగా నివేదికలు తయారు చేస్తూ ఉండాలి.
- విద్యార్థులు, లెక్చరర్లు, మేనేజర్ల మధ్య విస్తృతస్థాయిలో సమకాలిక,

## గ్రామ వికాసం - దూర విద్యా బోధన (మన టి.వి. (సాప్ నెట్) ఛానెల్-3)

| తేదీ/లో | అభ్యర్థులు | ప్రసార సమయం | కార్యక్రమం |
|---|---|---|---|
| 03-12-09 | యం.పి.డి.ఒ.లు | 11.00-11.20 | గ్రామీణ నీటి సరఫరా |
| | | 11.20-11.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 11.40-12.00 | అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం |
| | | 12.00-12.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 12.20- 12.40 | విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యం |
| 10-12-09<br>17-12-09<br>24-12-09<br>31-12-09<br>07-01-10 | గ్రామ పంచాయితీ కార్యదర్శులు | 12.40-01.00 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 1.00-1.20 | కేంద్ర ప్రభుత్వ పథకాలు |
| | | 1.20-1.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 3.00-4.30 | లైవ్ ఇంటరాక్షన్ - మన TV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |

అసమకాలిక సమాచార వ్యవస్థలు ఉండాలి. తద్వారా సమాచారం, విజ్ఞానాన్ని పరస్పరం పంచుకోవడం, మార్పిడి చేసుకోవడం వీలవుతుంది.

- మొత్తం విద్యాప్రక్రియను యాంత్రీకరించాలి. ఇతర విధానాలతో కలిసి పనిచేయగల సామర్థ్యాన్ని కలిగించాలి.
- సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలు గల పద్ధతులు, పైన పేర్కొన్న లక్షణాలు అన్నీ ఉన్న సిస్టమ్స్ తయారీ సంస్థలు చాలానే ఉన్నాయి. వాటిలో పేరు మోసిన కొన్ని సంస్థలు రూపొందించిన సిస్టమ్స్ వివరాలు: సమ్‌టోటల్ సిస్టమ్స్ రూపొందించిన Total LMS, సబ సంస్థ రూపొందించిన Saba Learning, ప్లాటూ సిస్టమ్స్ వారి Plateau 4 LMS, IBM సంస్థనుండి Lotus LMS, ఓపెన్ సోర్స్‌లో Modle LMS,Silicon LMS మొదలైనవి ఉన్నాయి.

### అభివృద్ధి పనిముట్లు

బోధనా విషయాలను రూపొందించడం, వాటిని సంఘటిత పరచడానికి ఈ టూల్స్‌ను ఉపయోగిస్తారు. ఈ టూల్స్‌లో ('అసెంబ్లర్స్') జోడింపులు ప్రాథమికమైనవి. వీటి సహాయంతో అంతకు ముందు తయారుచేసిన తెరల (స్క్రీన్స్)ను, పాఠ్యాంశాలను ఒక చోటకు చేరుస్తారు. ఉన్నత వృత్తి ప్రమాణాలతో రూపొందించిన టూల్స్‌తో యానిమేషన్, 3D మోడలింగ్, కోర్సు డిజైన్‌లోని అన్నిదశలు, వాటి అనుబంధ విషయాలన్నింటినీ సంఘటితం చేస్తారు. ఉన్నత శ్రేణి కోర్సులను అనేక టూల్స్ కలయికతో రూపొందిస్తారు. మల్టీ మీడియా భాగాలను ప్రత్యేకమైన ప్రోగ్రామింగ్ సాఫ్ట్‌వేర్ ద్వారా తయారుచేస్తారు. ఇమేజ్‌లు, యానిమేషన్, వీడియో, ఆడియోలను రూపొందించడం లేదా ఉన్న వాటికి మార్పులూ చేర్పులు చేస్తారు. అనంతరం వాటన్నిటినీ ఒక చోట చేర్చి 'ఈ-విద్య' కోసం ఎంపిక చేసిన డెవలప్‌మెంట్ టూల్ ద్వారా సిస్టంను రూపొందిస్తారు. దానిలో వివిధ దశలు ఈ విధంగా ఉంటాయి.

- ఫార్మాట్ చేసిన పాఠ్యం, బొమ్మను కలిపి ఒక్కో తెర(స్క్రీన్)ను మొదట తయారుచేస్తారు.
- దానికి అనుబంధంగా మల్టీమీడియా అంశాలను ఒక్కోదాన్ని తెలిసిన ఫార్మాట్‌లోకి మార్చి చేరుస్తారు. అటువంటి వాటి చుట్టూ ఉండే ఇతర భాగాలతో ఎలా ప్రతిస్పందించాలో ముందుగానే ప్రోగ్రామింగ్ చేస్తారు.
- ఈ భాగాలన్నీ 'ఈ-విద్య' బోధనా వ్యూహాలను బలపరిచేవిగా ఉండాలి.
- పరీక్ష, ప్రశ్నలు, వాడకందారు పునశ్చరణం కోసం ఇతర అంశాలను పొందు పరచాలి.
- వాడకందారు చర్యలకు, మార్పులకు అనుగుణంగా ప్రతి స్పందించేందుకు కార్యక్రమరచన చేయడానికి ఉపయోగించే పరికరాలు అన్నీ ఉండాలి.
- కొత్త కోర్సులను రూపొందించడానికి LMS లో 'ఈ-విద్య' ప్రమాణాలను అమలు చేయడానికి వీలుగా ఉండాలి.

బహుళ ప్రాచుర్యం పొందిన డెవలప్‌మెంట్ టూల్స్‌లో సమ్‌టోటల్ సిస్టమ్స్ రూపొందించిన Tool Book ii, మాక్రోమీడియా రూపొందించిన Authurware మరియు కొంటిస్ సంస్థ నుండి వెలువడిన i Publisher ముఖ్యమైనవి.

### LCMS

ఎలక్ట్రానిక్ కోర్సులను అభివృద్ధి పరిచే సిస్టమ్స్‌ను వర్ణించడానికి LCMS (లెర్నింగ్ కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం) పదాన్ని వాడతారు. కంటెంట్‌ను రూపొందించడం, దాన్ని నిర్వహించడంలో అనేక దశలు ఉంటాయి. అనేక మంది నిపుణులు, ప్రోగామర్స్ సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తారు. ఉత్తమమైన LCMS లో ఈ అంశాలుంటాయి.

- కోర్స్‌ను సాంకేతికంగా రూపొందించడానికి సంబంధించిన అన్ని విధులను కలిపి 'డెవలప్‌మెంట్ టూల్స్' అన్న పదాలతో పిలుస్తారు.
- కంటెంట్‌ను రూపొందించడం, దాని మేనేజ్‌మెంట్‌లో అనేకమంది

నిపుణుల సంయుక్త కృషి ఉంటుంది.

- కంటెంట్ సోర్స్‌ను తిరిగి వినియోగించడం, షేరింగ్, వెర్షనింగ్, కంటెంట్ సోర్స్‌ల భద్రత వంటి విషయాల నిర్వహణ ముఖ్యమైనవి.
- కంటెంట్ రూపకల్పన, దాన్ని కావాల్సినంత పరిమాణంలో పాఠ్యాంశంగా రూపొందించడం.

ప్రపంచ వ్యాప్తంగా ఉత్తమ సాంకేతిక ప్రమాణాలతో సిస్టమ్స్‌ను రూపొందించే సంస్థలు పైన పేర్కొన్న విధులన్నింటినీ నెరవేరుస్తాయి. ఆయా సంస్థలు రూపొందించిన సిస్టమ్స్ వివరాలు : సమ్‌టోటల్ సిస్టమ్స్ రూపొందించిన Total CMS, సబ వారి Saba content Management, ప్లాటూ సిస్టమ్స్ తయారు చేసిన Plateau Team Authoring / Content Management ప్రధానమైనవి.

## కంటెంట్, LMS, LCMS ల మధ్య సంబంధాలు

కంటెంట్‌ను ఎప్పుడూ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో వేరుగా ఉంచాలి. వాటి మధ్య పరస్పర చర్యలు (interaction) 'ఈ-విద్య' ప్రమాణాలైన AICC లేదా Scorm ఆధారంగా మాత్రమే జరగాలి. కోర్సులు నిర్వహించేటప్పుడు LMS కోర్సుతో ఎటువంటి సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోకూడదు. 'ఈ-విద్య' ప్రమాణాలతో రూపొందించబడిన కంటెంట్, డేటా, ఇంటర్‌ఫేస్‌లను వాడకూడదు. ఈ నియమాలకు కట్టుబడి ఉంటేనే, ఎంపిక చేసుకొన్న ప్రమాణాలకు అనుగుణంగా థర్డ్‌పార్టీ సప్లైచేసిన కంటెంట్‌ను అందించగలుగుతారు. అలాగైతేనే, మీ కంటెంట్ ఎంపిక చేసుకొన్న ప్రమాణాలలో ఏ LMS లోనైనా పనిచేస్తుందన్న గ్యారంటీ ఉంటుంది.

LMS,LCMS రెండూ వేరు వేరు స్వతంత్ర వ్యవస్థలు. వాటి మధ్య ఉన్న సంబంధమల్లా Scorm ప్రయాణం మాత్రమే. ఈ ప్రమాణం ప్రకారం, కంటెంట్ విద్యాంశాలను నిర్వచిస్తుంది. LMS దానితో కలిసి పనిచేస్తుంది. వినియోగదారులు LMS, LCMS లను వేర్వేరు సంస్థల నుంచి కొనుగోలు చేసినప్పటికీ, అవి నమ్మకంగా కలిసి పనిచేస్తాయి. చాలామంది తయారీదారులు LMS ను LCMS ను కలిపి సప్లైచేస్తారు. అటువంటి సిస్టమ్స్,Scorm ప్రమాణాలను మించి ఒక దానితో మరొకటి సంఘటితంగా పనిచేస్తాయి. వేరువేరు తయారీదార్ల దగ్గర LMS,LCMS సిస్టంలను కొన్న వాటికంటే ఎక్కువ లాభదాయకంగా ఉంటాయి.

## 'ఈ-విద్య' ప్రమాణాలు

AICC, Scorm లు రెండూ వేర్వేరు ప్రమాణాలు. ఇటీవల కాలంలో Scorm ఎక్కువ ప్రాచుర్యం పొందింది. అందులోAICC కంటే ఎక్కువ లాభాలున్నాయి. ముఖ్యంగా అనుసరణీయత (Adaptability), కమ్యూనికేషన్ కంటెంట్‌ను తిరిగి వినియోగించడం వంటి అదనపు లాభాలున్నాయి.

యూజర్ల దృష్టిలో, ఏ LMS లోనైనా, ఏ కంటెంట్‌నైనా ప్రవేశపెట్టవచ్చునని ప్రమాణాలు చెబుతున్నాయి. దీనర్థం, LMS కంటెంట్ స్వరూపాన్ని అర్థం చేసుకోవాలి. ఆ కంటెంట్ LMS తో పరస్పరం సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకొనే సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. యూజర్ల కోరిక పైన LMS సదస్సు కంటెంట్‌ను యాక్టివేట్ చేసి తిరిగి వారికే అందించేలా ఉండాలి. అలా తిరిగి అందించేటప్పుడు స్టడీ చేసిన సమయం, స్టూడెంట్ రిజల్ట్సు, స్టూడెంట్ పూర్తి చేసిన కార్యకలాపాలు వంటి సమాచారాన్ని కూడా ఇవ్వాలి.

అయితే, ఒక డెవలప్‌మెంట్ సిస్టం రూపొందించిన కంటెంట్‌ను మరో రకమైన సిస్టంపై మార్చటానికి ప్రమాణాలు అంగీకరించవు.

ఒకవేళ మీరు కంటెంట్‌ను ఎంచుకొని, మీ అంతట మీరే దాన్ని మీకు కావాల్సిన విధంగా మార్చుకోవాలనుకుంటే, మీరు స్వంతంగా ఒక డెవలప్‌మెంట్ సిస్టంను కొనుక్కోవాల్సి ఉంటుంది. అప్పుడు కంటెంట్ ఫోర్స్ మీద కూడా మీకు అధికారం ఉంటుంది. కంటెంట్‌ను మీరు స్వంతంగా రూపొందించుకోవాలనుకొంటే, సిస్టం ఎంపికను జాగ్రత్తగా చేయాల్సి ఉంటుంది. మీ సిస్టం మీద రూపొందించబడిన కంటెంట్ ఇతరచోట్ల పనిచేస్తుందో లేదో చూసుకోవాలి.

## 'ఈ-విద్య' ప్రమాణాలు

Scrom అంటే కొన్ని సాంకేతిక ప్రమాణాలు, మార్గదర్శక సూత్రాలు. అవి యాక్సెస్‌బిలిటీ, ఇంటర్ ఆపర్‌బిలిటీ, డ్యూరబిలిటీ, రీయూజబిలిటీ అనే ADL నిర్వాహక అవసరాలను తీర్చడానికి ఈ సూత్రాలు ఉద్దేశింపబడినాయి.

**1. యాక్సెస్‌బిలిటీ:** అనేకచోట్ల నుంచి బోధనా అంశాలను సేకరించి ఇతర చోట్లకు వాటిని పంపించగలిగే సామర్థ్యాన్ని యాక్సెబిలిటీ అంటారు. ఉదాహరణకు- కంటెంట్ రచయిత ADL రిజిస్ట్రీ చూసి, అటువంటి కంటెంట్‌ను మరో సంస్థ ఏదైనా ఇదివరకే డెవలప్‌చేసి, ఏదైనా LMS మీద ఉంచిందా అన్న విషయాన్ని తెలుసుకోవచ్చు.

**2. ఇంటర్ ఆపరేబిలిటీ:** ఒక సిస్టంలో రూపొందించిన బోధనాంశాలను మరో సిస్టంలో ఉపయోగించగలిగే సామర్థ్యాన్ని ఇంటర్ ఆపరేబిలిటీ అంటారు. ఉదాహరణకు- Scorm నిబంధనలకు అనుగుణంగా ఉన్న LMS లో డెలివరీ చేయడానికి సిద్ధంగా ఉన్న కంటెంట్‌ను అదే Scorm వెర్షన్ లో వున్న LMS కు డెలివరీ చేయవచ్చు.

**3. డ్యూరబిలిటీ:** టెక్నాలజీలో వస్తున్న మార్పులను తట్టుకుని, ఖరీదైన మార్పులు అవసరంలేని సామర్థ్యాన్ని డ్యూరబిలిటీ అంటారు. ఉదాహరణకు కొత్త ఆపరేటింగ్ సిస్టంకు అప్‌గ్రేడ్ చేయడంవల్ల కంటెంట్‌ను విద్యార్థులకు అందించడంలో పెద్ద ప్రభావమేమీ ఉండదు.

**4. రీయూజబిలిటీ:** బోధనాంశాలను వివిధ అప్లికేషన్లలో, వివిధ సందర్భాలలో చేర్చడానికయ్యే అవకాశాన్ని రీ యూజబిలిటీ అంటారు. ఉదాహరణకు ఒక సంస్థ కోసం రూపొందించిన 'ఈ-విద్య' కంటెంట్‌ను అటువంటి విద్యావసరాలున్న మరో సంస్థ కోసం మార్పులు చేర్పులు చేసి తిరగ రాయవచ్చు.

### SCORM వెర్షన్స్ రిలీజ్ డేట్స్:

జనవరి 2000 - SCORM 1.0; జనవరి 2001 - SCORM 1.1 అక్టోబర్ 2001 - SCORM 1.2; జనవరి 2004 - SCORM 2004 (1వ ఎడిషన్); జూలై 2004 - SCORM 2004 (2వ ఎడిషన్) అక్టోబర్ 2006 - SCORM 2004 (3వ ఎడిషన్); మార్చి 2009 - SCORM 2004 (4వ ఎడిషన్)

**- డాక్టర్ బి.వి.ఎన్.ఎస్ ప్రకాశరావు**
**టెక్నికల్ డైరెక్టర్, NIC, హైదరాబాద్**
**(అనువాదం : లలిత.బి)**

# ‘ఈ-విద్య’ కంటెంట్ అభివృద్ధిలో 12 దశలు

**‘ఈ-విద్య’ కంటెంట్ అభివృద్ధి అమ్మకందార్లతో మాట్లాడేముందు అనేక ముఖ్యమైన విషయాలను గమనించాలి. కంటెంట్ అభివృద్ధి పరచడంలో ఉన్న సమస్యలను ఇప్పుడు చర్చిద్దాం.**

## దశ-1

### ఉపోద్ఘాతం

‘ఈ-విద్య’ కంటెంట్ అమ్మకందార్లతో మాట్లాడటానికి ముందు విస్తృతంగా విశ్లేషణ చేసి ప్రణాళికను రూపొందించుకోవాల్సి ఉంటుంది. అమ్మకందార్లను ఆహ్వానించటానికి ముందు కంటెంట్ ఎవరికోసం ఉద్దేశింపబడింది (టార్గెట్ ఆడియన్స్), లక్ష్యాలు, పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులు అన్ని సాఫ్ట్‌వేర్‌లతో సక్రమంగా పనిచేయడం వంటి ప్రామాణిక విషయాలపై స్పష్టత ఉండాలి.

## దశ-2

### టార్గెట్ ఆడియన్స్

కంటెంట్ ఎవరిని ఉద్దేశించి తయారు చేస్తున్నారో గుర్తుంచుకోవాలి. ఒకవేళ టార్గెట్ ఆడియన్స్ నిరక్షరాస్యులు లేదా పాక్షికంగా అక్షరాస్యులైతే వారి స్థాయికి తగ్గట్టుగా టెక్ట్స్‌కంటే ఎక్కువ యానిమేషన్లు, గ్రాఫిక్స్, ఇమేజెస్, వీడియో, ఆడియో మొదలైన వాటిని ఉంచాలి. ఒక వేళ టార్గెట్ ఆడియన్స్ విద్యావంతులైతే, ఎక్కువ వీడియోలు, ఇమేజెస్, టెక్స్ట్, ఆడియో, అంచనాలు, క్విజ్‌లు, ఫీడ్‌బ్యాక్, ఫ్రీక్వెంట్లీ ఆస్క్‌డ్ క్వశ్చెన్స్ ఉండాలి. తక్కువ యానిమేషన్లు ఉండాలి.

## దశ-3

### లక్ష్యాలు

‘ఈ-విద్య’ కంటెంట్‌ను అభివృద్ధి పరిచేటప్పుడు, బోధనపై గాగ్నే పేర్కొన్న 9 లక్ష్యాలను దృష్టిలో ఉంచుకోవాలి. అవి:

1. విద్యార్థుల దృష్టి మరలకుండా, శ్రద్ధ పెట్టేలా చూడాలి.
2. లక్ష్యాలను విద్యార్థులకు తెలియజెప్పాలి.
3. అంతకుముందు నేర్చుకొన్న వాటిని గుర్తు తెచ్చుకొనేలా ప్రేరణ కలిగించాలి.
4. కంటెంట్‌ను వారి ముందుంచాలి.
5. మార్గదర్శకత్వాన్ని అందించాలి.
6. వారిని ఆచరణలో చూపమనాలి.
7. ఫీడ్ బ్యాక్‌ను అందించాలి.
8. ఆచరణను అంచనా కట్టాలి.
9. నేర్చుకొన్న విషయాలు మైండ్‌లో నిలిచిపోయేలా జాబ్‌కు ట్రాన్స్‌ఫర్ చేయాలి.

## దశ-4

### ఈ లెర్నింగ్ అవర్, కంప్రెషన్ రేషియో

‘ఈ-లెర్నింగ్’ అవర్, కంప్రెషన్ రేషియో అంటే ఏమిటో క్లయింట్‌కు



బాగా తెలిసి ఉండాలి. లేకుంటే అమ్మకందారులు క్లయింట్‌ను ఇరకాటంలో పెడతారు.

కోర్సును ఆన్‌లైన్‌లో నేర్చుకోటానికి ఎంత సమయం పడుతుంది. క్లాస్‌రూమ్‌లో ఎంత సమయం పడుతుందన్నది సమస్య. దీని మీద చాలా పరిశోధనలు జరిగాయి. వాటి సమాధానాల్లో 20 నుంచి 80 శాతం వరకు తేడా ఉన్నాయి. చివరకు సగటు కంప్రెషన్ రేషియోపై ఒక సాధారణ ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం 2 గంటలు క్లాస్‌రూమ్ బోధనకు పడితే, 'ఈ-విద్య' బోధన ద్వారా ఒకగంట మాత్రమే పడుతుంది.

అయినప్పటికీ, ఈ వ్యాసరచయిత అనేక మంది అమ్మకం దారులతో చర్చించి, విద్యారంగంలో వారి అనుభావాలను తెలుసుకున్నాక, రెండుమూడు గంటల క్లాస్‌రూమ్ బోధన, ఒక గంట 'ఈ-విద్యా'బోధనకు సమానమని విశ్వసిస్తున్నారు.

## దశ-5

### స్లైడ్స్ సంఖ్య

ఒకగంట 'ఈ-విద్య'బోధన సందర్భంగా ఎన్నిస్లైడ్స్ లేదా స్క్రీన్లను చూపించవచ్చు? స్లైడ్స్, స్క్రీన్స్, సీన్స్ వంటి మాటలతో అమ్మకందారులు క్లయింట్‌ను అయోమయానికి గురిచేయవచ్చు. ఇది మరో చర్చనీయాంశం. 'ఈ-విద్య' ద్వారా బోధనకు ఒక గంటలో 50 నుంచి 60 స్లైడ్స్‌ను చూపించవచ్చు. ఒక్క స్లైడ్‌లో ఒకటి అంతకంటె ఎక్కువ సీన్స్ ఉండవచ్చు. పాఠ్యాంశం క్లిష్టతను బట్టి ఎన్ని స్లైడ్స్ ఉండాలన్న విషయాన్ని క్లయింట్ నిర్ణయించాలి.

## దశ-6

### SCORM కు అనుగుణంగా ఉండాలి.

SCORM (Shareable content object Referance model) నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా కంటెంట్ ఉండాలి. ఇది అమెరికన్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన ప్రమాణం. దీంట్లో అనేక వెర్షన్లు ఉన్నాయి. అవి-

SCORM 1.0
SCORM 1.1
SCORM 1.2

| | | |
|---|---|---|
| SCORM | 2004 | 1 వ ఎడిషన్ |
| SCORM | 2004 | 2 వ ఎడిషన్ |
| SCORM | 2004 | 3 వ ఎడిషన్ |
| SCORM | 2004 | 4 వ ఎడిషన్ |

అయితే, వెర్షన్‌ను ఎంపిక చేసుకొనేటప్పుడు, తాము అభివృద్ధి పరచిన కంటెంట్ ఆ వెర్షన్‌లో అన్ని భాగాలకు లోబడి ఉందో లేదో చూసుకోవాలి. ఆ వెర్షన్ ఏ LMS లోనైనా పనిచేసే విధంగా క్లయింట్ తన వెర్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.

## దశ-7

### కంటెంట్ డెవలప్‌మెంట్, ADDIE ప్రక్రియ

కంటెంట్‌ను అభివృద్ధిపరచడంలో అమ్మకందారు ADDIE ప్రక్రియను అనుసరించాలి. ADDIE అంటే, Analysis, Design Development and Testing, Implementation & Evaluation. ఒక్కోదాన్ని గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### అనాలసిస్, డిజైన్ డాక్యుమెంట్, రాపిడ్ ప్రొటోటైప్

క్లయింట్స్ విశ్లేషణల ఆధారంగా, అమ్మకందారు తన అవసరాల విశ్లేషణతో ఒక డిజైన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తాడు. ఈ సందర్భంగా అతడు ఆడియన్స్ సంఖ్య, సాంకేతిక వివరాలు, కంటెంట్ ఔట్‌లైన్, పరస్పర చర్చకు సంబంధించిన వ్యూహం, నేవిగేషన్ మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకొని ఒక చిత్తు ప్రతిని తయారు చేసి క్లయింట్‌కు అందిస్తాడు. అందులో ఇంటర్‌ఫేస్, సాఫ్ట్‌వేర్ స్వరూపం, పనితీరు గురించి ఉంటాయి. అమ్మకందారు ఇచ్చిన చిత్తుప్రతి ఆధారంగా ప్రోగ్రామింగ్ చేస్తారు. దానిలో అమ్మకం దారు మార్పులు చేర్పులు చేశాక, చివరిగా క్లయింట్ ఆమోదం పొందుతుంది.

### స్క్రిప్టు లేదా స్టోరీబోర్డు

దీన్ని సవిరమైన డిజైన్ డాక్యుమెంట్ అని కూడా అంటారు. దీంట్లో అమ్మకందారు డిజైనర్లు, సవివరమైన స్క్రిప్టులు లేదా స్టోరీబోర్డును రూపొందిస్తారు. ఈ డాక్యుమెంట్‌లో ప్రతిస్క్రీన్‌లో సూక్ష్మమైన వివరాలను పొందుపర్చుతారు. టెక్ట్స్, వర్ణన, వీడియో, గ్రాఫిక్స్ మొదలైన వివరాలను పొందుపర్చుతారు. టెక్ట్స్, వర్ణన, వీడియో, గ్రాఫిక్స్ మొదలైన వాటితో స్క్రీన్స్ తయారు చేస్తారు. ప్రతి స్క్రీన్‌లో స్పెషల్ నావిగేషనల్ ఆప్షన్స్ వంటివి ఉంటాయి. ఈ దశలో స్టోరీబోర్డుకు క్లయింట్ ఆమోద ముద్ర తప్పనిసరిగా ఉండాలి.

### డెవలప్‌మెంట్

ఫైనల్ స్లోరీబోర్డు ఆమోదం పొందాక, డెవలప్‌మెంట్ దశ ప్రారంభమవుతుంది. ఆర్టిస్టులు గ్రాఫిక్స్ రూపొందిస్తుండగా, ఆడియోవర్ణన, వీడియో రికార్డింగ్, ఎడిటింగ్, డిజిటైజేషన్ పనులు జరుగుతూ ఉంటాయి. ప్రోగ్రామర్స్ తుదిదశ ప్రోగ్రామింగ్‌ను చేస్తూ ఉంటారు.

### టెస్టింగ్

ఈ దశలో, ప్రోగ్రాంలో సాఫ్ట్‌వేర్, టెక్నికల్ లోపాలు ఏవైనా ఉన్నాయేమో తెలుసుకొనేందుకు క్షుణ్ణంగా పరీక్షలు చేస్తారు. దీనితోనే బోధనా కార్యక్రమం బాగా ఉన్నది, దాని లక్ష్యాలను సాధించగలదని నిర్ధారణకు వస్తారు.

## డెలివరీ

మాస్టర్ సి.డి.ని డెలివరి చేయడానికి ముందు చివరిదశ క్వాలిటీ చెక్ చేస్తారు. అప్పుడు, వెబ్‌సైట్‌లో ప్రోగ్రాంను ఉంచుతారు. అమ్మకందారు సి.డి. కోసం లేబుల్స్, జెవెల్‌కేస్ ప్యాకేజింగ్, క్విక్ రిఫరెన్స్ కోసం మ్యానువల్‌ను తయారు చేయిస్తాడు. అప్పుడు ప్రోగ్రాంను సర్వర్‌కు అప్‌లోడ్ చేసి అందరికీ అందుబాటులో ఉంచుతారు.

## ఇవాల్యుయేషన్

చివరకు అమ్మకందారు, క్లయింట్ కలిసి ప్రోగ్రాం ఫలితాలను విశ్లేషించి, మదింపుచేస్తారు. విద్యార్థులనుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకొని స్కోరులతో టేబుల్స్ తయారుచేసి వాటి సారాంశాన్ని తయారుచేస్తారు.

## దశ-8

## ఇంటర్ ఆపరబిలిటీ

తయారు చేసిన కంటెంట్ వెబ్‌లోనూ, స్వతంత్రంగా పనిచేసే సిస్టమ్స్‌మీద పనిచేయాలి. అనంతరం, దాన్ని ఎదో ఒక LMS కు మార్చి అన్ని ఆపరేటింగ్ సిస్టమ్స్‌లో పనిచేసేలా చేస్తారు.

## దశ-9

## అప్ డేటబిలిటీ

ఒకసారి కంటెంట్ డెవలప్ అయ్యాక, కొన్నిరోజుల తరువాత అమ్మకందారు దాన్ని నామమాత్రపు ఫీజుతో అప్‌డేట్ చేయాలని క్లయింట్ షరతు విధిస్తాడు. ఇది ఎందుకు అవసరమవుతుందంటే, మారే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వాటిలో కొన్ని స్లైడ్స్‌ను మార్చాల్సి ఉంటుంది. కానీ మొత్తం ప్రోగ్రాంను కాదు.

## దశ-10

## టెంప్లేట్స్

టెంప్లేట్ అంటే స్టైల్‌గైడు. అందులో ఫాంట్స్, వాటికలర్స్, సైజులు, నావిగేషనల్ కంట్రోల్స్ మొదలైనవి ఉంటాయి. టెంప్లేట్స్‌ను క్లయింట్ నిర్ణయిస్తాడు. దానివల్ల వివిధ అమ్మకం దారులు రూపొందించిన కంటెంట్‌ను LMS పైకి తేలికగా ఉంచడం వీలువుతుంది.

## దశ-11

## ఇతర పారామీటర్లు

ఆడియో ఫార్మాట్ (వేవ్, రియల్, డబ్ల్యు.ఎం., క్విక్‌టైం, ఎం.పి.కె), వీడియోఫార్మాట్స్ (ఎవీఐ, ఎంపిజి, రియల్, క్విక్‌టైం, ఎంపెగ్2, ఎంపెగ్ 4 మొదలైనవి), రిసొల్యూషన్ (1024×768,800×600 మొదలైనవి), ఆథరింగ్ టూల్స్ (ఎక్స్ ఎం ఎల్, హెచ్ టి ఎం ఎల్, ఫ్లాష్, టూల్‌బుక్, ఆథర్‌వేర్ మొదలైనవి) అన్నీ ఒకే రకంగా ఉండాలి. వివిధ అమ్మకందారులు ప్రోగ్రామ్స్‌ను అభివృద్ధి చేసినప్పుడు ఒకేలా లేకపోతే సమస్యలు తలెత్తుతాయి. నేపథ్యసంగీతంపై కూడా అమ్మకందారుతో చర్చించాల్సి ఉంటుంది. అభివృద్ధి చేసిన కంటెంట్ అన్నిరకాల బ్రౌజర్లు - మొజిల్లా ఫైర్‌ఫాక్స్, ఇంటర్‌నెట్ ఎక్స్‌ప్లోరర్, ఒపేరా, నెట్‌స్కేపు మొదలైన వాటిలో పని చేయాలి.

## దశ-12

## కాపీ రైట్స్

సోర్స్‌కోడ్ హక్కులు, ప్రోగ్రాంసోర్ట్స్, స్టోరీబోర్డు ప్రజెంటేషన్ ('ఈ-విద్య' మెటీరియల్ సి.బి.టి, డబ్ల్యుబిటి ఫామ్‌లో) అన్నీ అన్ ఎన్‌క్రిప్‌టెడ్ ఫార్మాట్‌లో క్లయింట్ దగ్గరే ఉండాలి. అమ్మకందారు వద్దకాదు.

కంటెంట్‌ను క్లయింట్ తమ అంతర్గత ఉపయోగాలకోసం తిరిగి ఉపయోగించుకోవచ్చు. దాన్ని మార్చుకోవచ్చు. క్లయింట్లకే దానిపై సర్వహక్కులు ఉంటాయి.

పైనపేర్కొన్న దశలు అన్నీ సాధ్యంకావాలంటే, క్లయింట్, అమ్మకందారు

1. ఒక స్థాయిలోనే కాంటాక్టులో ఉండాలి.
2. సాధ్యమైనన్ని సార్లు కలుస్తూ ఉండాలి.
3. ప్రాజెక్ట్ షెడ్యూల్స్ వివరంగా ఉండాలి.
4. ప్రొటో టైపులో అన్ని మార్పులను చేర్చాలి.
5. స్క్రిప్ట్‌లోనూ మార్పులు చేయాలి.
6. వీడియో, ఆడియో షూట్స్‌కు క్లయింట్ తప్పక హాజరు కావాలి.

## ముగింపు

SCORM ప్రమాణాలకు అనుగుణంగా ఉండే కంటెంట్ డెవలప్‌మెంట్ గురించి ఇక్కడ చర్చించాలి. కంటెంట్‌ను డెవలప్ చేశాక క్లయింట్ తనకు తగిన LMS ను ఎంపిక చేసుకోవాలి. క్లయింట్ కొత్తవాడైతే, ఓపెన్ సోర్స్‌లో లభ్యమయ్యే MOODLE, LMS ను తొలిదశలో ఎంచుకోవడం మంచిది. MOODLE, LMS అన్నిచోట్లా, అందరికీ సంతృప్తికరంగా ఉన్నట్లు ఒక అధ్యయనం తెలుపుతోంది. ముఖ్యంగా విద్యారంగం, ప్రభుత్వరంగాలలో, చిన్న, మధ్యతరగతి కార్పోరేషన్లలో ఇది చాలా ప్రాచుర్యం పొందింది.

## ఎక్నాలెడ్జ్‌మెంట్లు

'ఈ-విద్య' పరిష్కార మార్గాలపై పనిచేయడానికి నాకు అవకాశమిచ్చిన 'అపార్డ్' కమిషనర్ శ్రీ ఫణికుమార్ గారికి, నేషనల్ ఇన్‌ఫర్‌మాటిక్స్ సెంటర్ SIO & DDG శ్రీ బి.వి శర్మగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

*- డాక్టర్. బి.వి.ఎన్.ఎస్ ప్రకాశరావు*

*(అనువాదం : కె.యస్.రెడ్డి)*

# పీఠికా పాటవం

*ఆది కవి నన్నయతోనే 'అవతారిక' ఆవిర్భవించింది. అచ్చుయంత్రం వచ్చాక పరిష్కర్తలు, ప్రచురణకర్తలు వచ్చారు. కొన్నాళ్ళ వరకు పీఠికలు వ్రాయించే బాధ్యత ప్రచురణకర్తలే వహించారు. ప్రాచీన గ్రంథాలలో చాలావాటికి తంజవరం తేవప్పెరుమాళ్ళయ్య, నాగపూడి కుప్పసామయ్యగారు ఆలోకనలను అందించారు. తర్వాత కాలంలో ఎవరి గ్రంథాలకు వారే పీఠికలు వ్రాసుకోవడం. లేదా వారికి ఇష్టమైన వారిచేత వ్రాయించుకోవడం ఆనవాయితీ అయింది. గ్రంథాన్ని అనుసరించి ఆయా రంగాలలో ప్రసిద్ధులైన వారిని సహజంగా ఈ పీఠిక వ్రాయడానికి నియమించడం జరుగుతూ వుంటుంది. ఇందులో మొగమాటాలు, ముఖపరిచయాలు వగైరా వున్నా వుండవచ్చు.*

*కొందరు ప్రముఖ రచయితల పీఠికల బాణీలు ఎలా వుంటాయో చూద్దాం:*

*సర్వశ్రీ అనే అభ్యుదయ కవి తన వచన కవితా సంపుటికి పీఠిక వ్రాయండని కోరినపుడు - ఆయా ప్రముఖుల ఆముఖాలు ఎలా వుంటాయి అనేది ఈ పేరడీకి వస్తువు.*

## జీడిగింజలు

**జీడిమామిడికాయలో విత్తనం వేరుగా వున్నట్టే - సంజీవదేవ్ గారి పీఠికలు అసలు గ్రంథవిషయంతో సంబంధం లేకుండా వేరుగా వుంటాయి. విడిగా చదువుకున్నా అట్టే ఇబ్బంది వుండదు. పీఠికలకు వీరిచ్చే ప్రత్యేక శీర్షికలు వొక ఆకర్షణ -**




*కవిత విన్పిస్తుంది చెవికి*
*కవిత కన్పిస్తుంది కంటికి*
*గద్యంలో వుంటవి కొన్ని రచనలు*
*వుంటాయి కొన్ని రచనలు పద్యంలో–*


కవిత కాని గద్యం వున్నట్టే కవిత కాని పద్యం కూడా వుంటుంది. కవితగల గద్యం వున్నట్టే కవిత గల పద్యం కూడా వుంటుంది. ఉన్మీలనచేసే స్రష్టయొక్క అనుభూతికి, రసమయ అభివ్యక్తికి భావసామ్యం కుదిరినపుడు రసాత్మకమైన కావ్యంగా రూపాంతరం చెందుతుంది. అందుకే ప్రసిద్ధ చైనీయ దార్శనికుడు లోఫ్–చే అంటాడు. "రసాత్మక కావ్యంలో భాషని భావాన్ని వేరుచేయజాలం. అవి రెండూ అవిభక్తమైనంత సమ్మిళితంగా వుంటవి" అని.

కవిత పద్యమా, గద్యమా: నిబద్ధమా, అనిబద్ధమా అనేది అముఖ్యం. నిబద్ధరీతి గొప్పదే. సందేహం లేదు. అయితే అనిబద్ధరీతి అంత కంటే తక్కువ గొప్పదేమీకాదు. నిబద్ధరీతిలో అనిబద్ధత, అనిబద్ధరీతిలో నిబద్ధత అంతర్లీనంగా వుండి వుంటాయి.

కొందరి కవితల్లో పార్థివానుభూతులకు అధికృత వుంటే మరి కొందరి కవితల్లో అధికృత వుంటుంది. అపార్థివానుభూతలకు సర్వశ్రీగారి కవితల్లో అధికృత వుంటుంది రెంటికీ! ☆




**పుస్తకాలకు, ముఖ్యంగా సూవెనీర్లకు రాజకీయ నాయకుల సందేశాలు, అభిప్రాయాలు తెప్పించడం ఒక ఆనవాయితీ అయింది. వారు పంపే అభిప్రాయాలు ఏ పుస్తకాలకైనా ఆముఖంగా వుండవచ్చు. తారతమ్యం లేని సామ్యవాద సరళి.**



'సర్వశ్రీ గారి రచనలను ప్రచురిస్తున్నందుకు సంతోషం.

మహాత్మాగాంధీ, సుభాస్‌బాబు లాంటి మహనీయుల ఆదర్శాలను ప్రజలలో ప్రచారం చేయాల్సిన అవసరం నేడు యెంతైనా వున్నది. సదవగాహన, సుహృద్భావం పెంపొందించే ఉత్తమ సాహిత్యం నేడు రావాల్సి వున్నది. గాంధేయ సిద్ధాంతాలకు, జాతి పునర్నిర్మాణానికి మనమంతా పునరంకితం కావల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పటికే తెలుగు భాషను తాలుకా స్థాయిలో ప్రవేశపెట్టడం జరిగింది. త్వరలో ఫిర్కాస్థాయికి. గ్రామస్థాయికి తీసుకురావాలని అనుకుంటున్నాం. ఇలాంటి తరుణంలో సర్వశ్రీ లాంటి అభ్యుదయవాదుల రచనలను ప్రచురించడం ముదావహం.' ☆

## శ్రీశ్రీ

**శ్రీ**శ్రీ గారికి కుదురు తక్కువ. అసలే మెలిక "శ" దానిపైన గుడి, దానికి పొల్లు – అడుగున కొయ్యగుర్రం పీఠంలా ర్రావడి, పోనీ ప్రక్కనైనా వ్యాట్ సీసాలా పొట్టిగా నిలబడగల అక్షరం వుందా అంటే అది కూడా శ్రీయే – ఇక శ్రీశ్రీకి కుదురు ఎలా వుంటుంది? అయినా యుగకలం ఆయన చేతిలో వుంది – మరి ఆ కలం కదిలినా, కక్కినా కూడా అందమే–

'ఓ నాలుగు పుష్కరాల క్రితం– ప్రజోత్పత్తి నామ సంవత్సరం కావచ్చు అది. సమాజ శ్రేయస్సు దృష్ట్యా సాహితీ యజ్ఞం చేయాల్సి వచ్చింది. శిష్టా, పఠాభి,



నారాయణబాబు, జరుక్‌శాస్త్రి ఋత్విక్కులైనారు. నేనేమో సోమయాజిని, ఛందస్సు బలిపశువు అయింది. గురజాడనీ, వేమననీ ఆవాహన చేశాం. యజ్ఞానంతరం తెలుగు మాగాణం ముక్కాకు  పంటలతో సశ్యశ్యామల మైంది. ఇంకో రివల్యూషన్‌కి నాంది పలికింది.


ఛాందసులు ఫ్యాక్టరీ గొట్టానికి, పొయిట్రీకి సంబంధం ఏమిటని సైరన్లలా కూశారు. కవితాకన్యకు ఘోషా లేకపోతే అనర్థకమన్నారు.

సర్వశ్రీగారి కవితా సంపుటి ఈ శతాబ్దపు క్లాసిక్ అని చెప్పడం ఆత్మవంచన అవుతుంది. అయితే వచనకవిత్వపు ఆనూపానూ తెలిసిన రచయిత అని మాత్రం చెప్పగలను. ☆

## పంచకోల కషాయం

**మూడు ప్రాంతాల మాండలికాలు, విప్లవ భావాలు, స్వీయప్రతిభ యీ అయిదూ కలసిన పంచకోల కషాయం కె.వి. రమణారెడ్డి గారి గద్యశైలి. కషాయం ఆరోగ్యానికి మంచిది కాదా అంటే మంచిదే. ఎటొచ్చీ గొంతు దిగే దాకానే ఇబ్బంది, వైద్యో నారాయణో హరి: -**

'అభ్యుదయ కవి తెలుగు మీరి వచన కవితని ఇష్టాధీనంగా పలికించగల శక్తిని సముపార్జించాడు. బూర్జువా భ్రమలలోపడి నేటి ఆర్థిక, సాంఘిక తారతమ్యాల వైపు దృష్టి సారించకుండా 'కూపస్థ భల్లూకా'ల్లాగా వున్న వాళ్ళు యెందరైనా వున్నారు. ఇక్కడ వాళ్ళను గురించి చర్చించడం అంత లాభసాటి పని కాదు.




ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మార్క్సిస్టు చింతనకు లోబడని రచయితలు అరుదుగా వున్నారు. వస్తువును విశ్లేషించడం భౌతికవాదానికి మూలమైన మార్క్సిస్టు దృక్పథం.

వాస్తవ విషయపరమైన వాటిని ఆదర్శీకరించదు భాష. సామాజిక స్పృహ కవి మనస్సుతోటి సంధానించుకుంటే తప్పక ఆ కవితకు ఉత్తమత్వం ఆపాదించవచ్చు. తన సొంత ఇష్టాయిష్టాలను అతిక్రమించిన స్వర్గ హద్దులు దాటి వాస్తవాలను కవి చూడగలగడం సబబు.



గణాలు కిట్టించుకుంటూ పద్యం రాయడం మాత్రమే కవిత్వం అని త్రికరణశుద్ధిగా నమ్మే సాంప్రదాయికులు ఆనాళ్ళలోనూ యీనాళ్ళలోనూ లేకుండా పోలేదు.

సర్వశ్రీ గారి కవితల్లో నాకు స్పష్టంగా రెండు కొరతలు కన్పిస్తున్నాయి... ☆

## స్థాలీ పులాక న్యాయం

**కొందరు మరీ పెద్ద పండితులు వుంటారు. వారు కూడా ఏ గ్రంథానికైనా ఇమిడిపోయే పీఠిక వ్రాయగలరు. వారికి సమయాభావం, అనారోగ్యం ఎప్పుడూ వుండేవే! వీళ్ళు మనం వ్రాసే లేఖల్ని కూడా స్థాలీపులాక న్యాయంగానే చదువుతారు.**

సర్వశ్రీ విరచితంబైన గ్రంథరాజము మాకు ముట్టినది. సమయా భావముచే స్థాలీ పులాక న్యాయముగా చదివియుంటిమి. ఇందు గవి నేటి సాంఘిక విషయాలను తన గవితలో జొప్పించి రక్తి కట్టించినాడు. వీరి కల్పనా చతురత మిక్కిలి ప్రశంసనీయము. ఆథాపి సులలితము ఆ పాత మధురమై యొప్పుచున్నది.

బుధవరులు గుణ గ్రహణ పారీణులై దీని నాస్వాదింతురు గాక. సర్వశ్రీ చిరంజీవియై నిట్టి సత్కృతులు వేలాదిగా వెలయింతురని ఆసింతును. ఆస్తు!". ☆

# మన గ్రామం - మన ఆరోగ్యం, భద్రత, సౌకర్యం

**చట్టాలు ఎదుర్కొంటున్న ఒక ప్రధానమైన సవాలు ఏమంటే అవి అమలు జరగకపోవటం. చట్టాలు అమలు జరగకపోవడానికి గల ప్రధాన కారణాలలో ఒకటి చట్టంలోని అంశాలు ప్రజలకు తెలియకపోవటం.**

**పారిశుధ్యానికి విఘాతం కలిగించే చర్యల వలన, సమాధులతో నిండిపోయిన స్మశానాల వలన, పాడుబడ్డ ఇళ్ళల్లో లేదా యజమాని పట్టించుకోకుండా వదిలేసిన స్థలాల్లో అడవిలా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లు, జెముళ్ళ వల్ల గ్రామ ప్రజలు ఇబ్బంది పడటం, అందోళన చెందడం జరుగుతున్నది.**

గ్రామపంచాయితీ పరిధిలో ప్రజారక్షణ (Public safety), సౌకర్యం (Conveniences), ఆరోగ్యం సంబంధించిన అంశాలను పంచాయితీ రాజ్ చట్టం 1994లోని 4వ అధ్యాయంలో పేర్కొన్నారు.

### నీటి వనరులు

ఈ చట్టం అమలులోకి వచ్చేనాటికి ఉండి లేదా ఈ చట్టం అమలులోకి వచ్చిన తరువాత ఏర్పాటు చేయబడిన గ్రామంలోని అన్ని రకాల ప్రజా నీటివనరులు (Public water coureses) సెలయేరులు, రిజర్వాయర్లు, చెరువులు, Cistern, ఫౌంటెన్లు, బావులు, పంపులు, ఇతర అన్ని రకాల నీటి పనులు, (వాటి వినియోగానికి సంబంధించి (Prescriptive) హక్కు వచ్చే విధంగా ప్రజల చేత వినియోగించబడే వాటితో సహా) ప్రజోపయోగార్థం గ్రామపంచాయితీ ఖర్చుతో చేసినా లేదా ఇతరత్రా చేసినా గ్రామపంచాయితీకే చెంది, గ్రామపంచాయితీ క్రిందనే ఉంటాయి. అని ఈ చట్టంలోని 80వ సెక్షనులోని 1వ సబ్ సెక్షనులో పేర్కొన్నారు.

ఇరిగేషన్ పనులకు లేదా వాటికి ప్రక్కన ఉన్న భూమికి ఈ సబ్ సెక్షను వర్తించదు.

ఈ సెక్షనులోని 2వ సబ్ సెక్షను ప్రకారం గ్రామ పంచాయితీకి చెందిన నీటి వనరుల్లో చేపలు పట్టే హక్కు, నిర్ణీత రుసుము తీసుకుని ఇట్టి నీటి వనరు నుండి నీటిని seed beds కు సరఫరా చేసే హక్కు, ఒడ్డు స్థలంలో చెట్లను నాటి వాటి ఫల సాయాన్ని అనుభవించే హక్కు గ్రామపంచాయితీకి ఉంటుంది.

గ్రామపంచాయితీని సంప్రదించి, గ్రామ పంచాయతీ అభ్యంతరాలకు తగు ప్రాధాన్యతనిచ్చి, గ్రామ పంచాయితీకున్న అట్టి అధికారాన్ని ప్రభుత్వం నిర్వచించటం, నియంత్రించటం లేదా ఏదేని ప్రజానీటి వనరును, దాని ఒడ్డు భూమి నిర్వహణను తీసుకోవటం ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా చేయవచ్చు.

అయితే 100 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన చెరువులు, వాటిలో చేపలు పట్టే హక్కు గ్రామపంచాయితీ కిందకు రావు. అవి చిన్న తరహా నీటి వనరుల నుండి మినహాయించబడ్డాయి. అలాగే నీరు సముద్రంలో కలిసే చోట గ్రామపంచాయితీ భూమిపై ఏర్పడే నీటి కయ్యలు, చలమలు (Swamp and back waters) గ్రామ పంచాయితీ క్రిందకు రావు.

ఈ చట్టంలోని 81వ సెక్షను ప్రకారం ఏదేని చెరువు లేదా కుంటలలో లేదా నీటి ప్రవాహంలో బట్టలు ఉతకడాన్ని లేదా పశువులను కడగటాన్ని లేదా ఇతర వస్తువులను శుభ్రం చేయడాన్ని లేదా చేపలు పట్టడం ప్రజా ఆరోగ్య అవసరాల కొరకు గ్రామపంచాయితీ నిషేదించడం లేదా నియంత్రించడం చేయవచ్చు. త్రాగునీటికి లేదా స్నానానికి లేదా పశువులను కడగటానికి లేదా బట్టలు ఉతకటానికి లేదా ఏదేని ఇతర నిర్దిష్ట అవసరాలకు ప్రత్యేక ప్రదేశాలను అట్టి వనరుల్లో ఏర్పాటు చేయవచ్చు.

గ్రామపంచాయితీకి ఉన్న ఈ అధికారాన్ని ప్రైవేటు నీటి వనరుల మీద అట్టి స్థల యజమాని అమోదంతో వినియోగించవచ్చు.

గ్రామంలోని బావి లేదా చెరువు లేదా ఏదేని ఇతర నీటి వనరుల ద్వారా గ్రామ ప్రజలు వినియోగిస్తున్న నీటి వలన ప్రమాదకరమైన వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రభుత్వ సర్వీసులో ఉన్న గ్రామపంచాయితీ లేదా మండల పరిషత్ లేదా జిల్లా పరిషత్ ఆరోగ్య లేదా వైద్య అధికారి నుండి ధృవపత్రం వచ్చినప్పుడు కార్యనిర్వాహణాధికారి అట్టి నీటి వినియోగాన్ని నిషేధిస్తూ బహిరంగ ప్రకటన చేయాలి. అట్టి ప్రకటనను సదరు నీటి వనరుకు దగ్గరలో అతికించటం, చాటింపు వేయించటం ద్వారా ఎన్ని రోజులు అట్టి నిషేధం ఉంటుందో తెలియపర్చాలి.

కార్యనిర్వాహణాధికారి అట్టి నోటీసును సవరిస్తూ లేదా అందులో పేర్కొన్న కాలపరిమితిని పొడిగిస్తూ మళ్లీ ధృవీకరణ పత్రం పొందకుండానే ప్రకటన చేయవచ్చు.

చెరువులు లేదా ఇతర నీటి వనరుల్లో చేపలు పట్టే హక్కును గ్రామపంచాయితీ స్థానిక మత్స్య సహకార సంఘానికే ప్రథమ ప్రాధాన్యతను ఇచ్చి, మత్స్యశాఖతో సంప్రదించి కేటాయించాలి. అయితే జిల్లా కలెక్టరుచే త్రాగు నీటికి, బట్టలు ఉతుకటానికి నిర్దేశించబడిన చెరువులను, ఆయకట్టు కానటువంటి వనరులను గ్రామపంచాయితీ మత్స్య సహకార సంఘాలకు కేటాయించరాదు.

నిర్దేశిత ప్రదేశాలను నిర్దేశించిన అవసరాలకు తప్ప, ఇతర అవసరాలకు ఉపయోగించకుండా నిషేధించే అధికారాన్ని గ్రామపంచాయితీకి ఈ చట్టంలోని 82వ సెక్షను కల్పిస్తుంది.


ఎ) త్రాగు నీటి లేదా వంట నీటి అవసరాల కోసం గ్రామ పంచాయతీ

చేత లేదా ప్రైవేటు ఆస్తి అయినట్లయితే దాని యజమాని చేత నిర్దేశింపబడిన నీటిలో స్నానం చేయడం లేదా మురికి చేయడం, లేదా

బి) ప్రమాదకరమైన వస్తువులను పైన పేర్కొన్న నీటి వనరుల్లో ఉంచడం, లేదా

సి) పశువులను లేదా వంట సామానులను లేదా ఉన్నిని, తోళ్ళను లేదా ఇతర దుర్గంధ పూరితమైన లేదా ప్రమాదకరమైన వస్తువులను కడగటం లేదా హానికరమైన లేదా ప్రమాదకరమైన వస్తువులను పైన పేర్కొన్న స్థలాల్లో లేదా స్నానానికి లేదా బట్టలు ఉతకటానికి నిర్దేశించిన స్థలాల్లో దాచి పెట్టడం, లేదా,

ఇ) పైన పేర్కొన్న అవసరాల కోసం నిర్దేశించబడిన లేదా స్నానానికి లేదా బట్టలు ఉతకడానికి నిర్దేశించబడిన స్థలంలోనికి డ్రైనేజికి లేదా ఇంజను లేదా బాయిలర్ లేదా ఏదేని ఇతర ప్రమాదకరమైన పదార్థాన్ని విడిచి పెట్టడం ఏ వ్యక్తీ చేయరాదు.




## పవిత్ర స్థలాల నుండి చెల్లింపులు

పవిత్ర స్థలాల మీద అధికారం కలిగియున్న వ్యక్తులు చేయాల్సిన చెల్లింపులను గురించి ఈ చట్టంలోని 83వ సెక్షనులో పేర్కొన్నారు.

మసీదు, గుడి, ఆశ్రమం లేదా ఏదేని మత ప్రార్థన లేదా బోధనా స్థలం లేదా సంతలు లేదా పండుగలు లేదా అలాంటి ఇతర ప్రయోజనాల కోసం గ్రామపంచాయితీ పరిధిలో లేదా సమీపంలో నిర్వహించడం వలన సంవత్సరం మొత్తం గాని లేదా కొన్ని సందర్భాలలో గాని లేదా సంఖ్యలో ప్రజలు ఆకర్షించబడేటప్పుడు ప్రజా ఆరోగ్యం కోసం, రక్షణకు లేదా సౌకర్యానికి తాత్కాలికంగా గాని లేదా శాశ్వతంగా కాని గ్రామపంచాయితీ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం దర్మకర్తలను లేదా అట్టి ప్రదేశాలపై అధికారం కలిగి ఉన్న వ్యక్తులను సంప్రదించి గ్రామపంచాయితీ నిధికి రికరింగ్ లేదా నాన్-రికరింగ్ చెల్లింపులు నిర్దేశించిన విధంగా చెల్లించమనవచ్చు.

## ప్రైవేటు మరుగు దొడ్లు

ప్రైవేటు మరుగు దొడ్ల పారిశుధ్యం గురించి ఈ చట్టంలోని 84వ సెక్షనులో పేర్కొన్నారు. గ్రామ పంచాయితీ కార్యనిర్వాహణాధికారి ఏదేని స్థలం యజమానిని ఆ స్థలంలో ఉన్న వ్యర్థ పదార్థాలను తొలగించే సమయం, కాల పరిమితి, తదితర విషయాలకు సంబంధించి సంప్రదించవచ్చునని అందుకు అవసరమైన ఖర్చులను గ్రామపంచాయితీ నిర్ణయించిన విధంగా వసూలు చేయ వచ్చునని కూడా ఈ సెక్షనులో పేర్కొన్నారు.

## శ్మశానాల నిర్వాహణ

ఈ చట్టం అమలులోకి వచ్చేనాటికి శ్మశానంగా ఉపయోగించబడుతున్న స్థలం యజమాని, అప్పటికే ఉన్న ఏదేని చట్టం క్రింద రిజిష్టరు కాబడనట్లయితే, ఈ చట్టం ప్రకారం గ్రామపంచాయితీకి రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఈ చట్టంలోని 85వ సెక్షనులో పేర్కొన్నారు.

అట్టి స్థలానికి ఎవరూ యజమాని లేకపోయినట్లయితే గ్రామపంచాయితీ ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని రిజిష్టరు చేయవచ్చును లేదా మూసి వేయవచ్చును అని కూడా ఈ సెక్షనులో పేర్కొన్నారు.

ఈ చట్టం అమలులోకి వచ్చిన తరువాత గ్రామ పంచాయితీకి దరఖాస్తు చేసే అనుమతి పొందకుండా ఏ ప్రదేశాన్ని శ్మశానంగా వినియోగించరాదు అని ఈ చట్టంలోని 86వ సెక్షనులో పేర్కొన్నారు.

అట్టి దరఖాస్తును గ్రామపంచాయితీ, జిల్లా ఆరోగ్య అధికారితో సంప్రదించి అనుమతి ఇవ్వడం లేదా తిరస్కరించడం లేదా ఏదైనా అభ్యంతరాలు వచ్చినట్టయితే అట్టి అభ్యంతరాలు పరిష్కారమయ్యే వరకు వాయిదా వేయవచ్చును.

ఈ విధంగా గ్రామ పంచాయితీ జారీ చేసిన ఉత్తర్వులను జిల్లా కలెక్టరు రద్దు చేయడం గాని లేదా సవరించడం గాని చేయవచ్చును అని కూడా ఈ సెక్షనులో పేర్కొన్నారు.

శ్మశానంగా ఉపయోగించటానికి కావలసిన స్థలాన్ని గ్రామపంచాయితీ నిధితో గ్రామపంచాయితీ ఏర్పాటు చేసి దానిని ఉపయోగించినందుకు రుసుము లేదా అద్దెను వసూలు చేయవచ్చునని ఈ చట్టంలోని 87 వ సెక్షనులో పేర్కొన్నారు.

పైన పేర్కొన్న 85, 86,87 సెక్షన్ల ప్రకారం రిజిస్టరు కాబడిన లేదా అనుమతి పొందిన ఈ చట్టం అమలులోకి వచ్చేనాటికి రిజిష్టరు కాబడి, అనుమతి పొందిన స్థలాల వివరాలను గ్రామపంచాయితీ కార్యాలయంలో ప్రత్యేక రిజిష్టరులో నమోదు చేయాలి అని 88వ సెక్షనులో పేర్కొన్నారు.

అట్టి స్థలాల ప్రవేశం వద్ద లేదా అట్టి స్థలాల సమీపంలో అందరి కీ కనిపించే విధంగా నోటీసును ఆంగ్ల భాషలోను, అట్టి గ్రామ ప్రధాన భాషలోనూ ఏర్పాటు చేయాలని కూడా ఈ సెక్షనులో పేర్కొన్నారు.

నిర్దేశించిన స్థలంలో మినహా, నివాస ప్రాంతానికి లేదా త్రాగు నీటి వనరుకు 200 మీటర్ల పరిధిలో ఏ వ్యక్తి కూడా శవాన్ని పూడ్చిపెట్టడం, దహనం చేయడం చేయరాదని 89వ సెక్షనులో పేర్కొన్నారు.

శ్మశానాలపై అజమాయిషీ ఉన్న వ్యక్తి ప్రతి శవ దహనం లేదా పూడ్చిపెట్టే సమాచారాన్ని గ్రామ పంచాయితీచే నియమించబడిన వ్యక్తికి తెలియపరచాలని 90వ సెక్షనులో పేర్కొనబడింది.

ఏదైనా రిజిష్టరు కాబడిన లేదా లైసెన్సు పొందిన శ్మశాన స్థలం ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం కలిగించే స్థితిలో

ఉన్నా లేదా అట్టి శ్మశాన స్థలం సమాధులతో నిండిపోయి ఉండి, శ్మశానంగా వినియోగించటానికి ప్రత్యామ్నాయ స్థలం ఉన్నప్పుడు గ్రామపంచాయితీ, సంచాలకులు (కమీషనర్) అనుమతితో రెండుమాసాల గడువు తర్వాత అట్టి స్థలాన్ని శ్మశానంగా వినియోగించరాదని ప్రకటించవచ్చు. అట్టి నోటీసును గ్రామపంచాయితీ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఉంచడం, చాటింపు వేయించడం ద్వారా తెలియపర్చాలి అని ఈ చట్టంలోని 91వ సెక్షనులో పేర్కొన్నారు. ఈ నోటీసులో నిర్దేశించిన గడువు తర్వాత ఏ వ్యక్తి కూడా అట్టి స్థలంలో దహనంగానీ, పూడ్చిపెట్టడం గానీ చేయరాదు అని కూడా ఇందులో చెప్పబడింది.

## ఊర కుక్కలు, పందుల నిషేధం

గ్రామపంచాయితీ, అవసరమైతే జిల్లా మెజిస్ట్రేటు వారు నిర్దేశించిన పరిధిలో తిరుగుచున్న లైసెన్సు లేని పందులు లేదా కుక్కలు నాశనం చేయబడతాయని నోటీసు జారీ చేయవచ్చునని, అట్టి నోటీసును ఇచ్చినప్పుడు ఏ వ్యక్తి అయినా అట్టి హద్దుల్లో తిరుగుతూ కనబడిన అనుమతిలేని పంది లేదా కుక్కను నోటీసుకు విరుద్ధంకాని ఏ పద్ధతిలో నైనా చంపవచ్చునని ఈ చట్టంలోని 92 వ సెక్షనులో పేర్కొన్నారు.

## పారిశుధ్యం

ఏ ప్రదేశం యజమానీ డ్రైనేజిలోకి, మురుగును నిల్వ ఉంచే భూగర్భ ట్యాంకులలోకి మినహా మురికి కాలువ ప్రక్క గోడల్లోకి, భూమిలోకి ఇంకి బురదచేసి, ఇతరులకు ఇబ్బంది కల్గించే విధంగా తన ప్రదేశంలోని మురుగు దొడ్డి వంటి వాటి నుండి మురుగును రోడ్డు మీదకు వదలరాదని ఈ చట్టంలోని 93వ సెక్షనులో పేర్కొన్నారు.

గ్రామంలోని ఏ ప్రదేశంలోనైనా పారిశుధ్యం మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని కార్యనిర్వాహణాధికారి భావించినట్లయితే ఈ చట్టంలోని 94వ సెక్షను ప్రకారం అట్టి ప్రదేశం యజమానికి నిర్దిష్ట గడువు లోపల

ఎ) అట్టి నివాసాన్ని లేదా మురుగు దొడ్డిని పూర్తిగా లేదా పాక్షికంగా తొలగించమని

బి) భవనం లోపల ప్రైవేటు మురికి కాలువను నిర్మించమని లేదా ఉన్న ప్రైవేటు మురికి కాలువను మార్చమని లేదా తొలిగించమని,

సి) ఏదైనా స్థలాన్ని లేదా భవనాన్ని కార్యనిర్వాహణాధికారి సంతృప్తి మేరకు పరిశుభ్రంగా ఉంచాలని,

డి) ఏదైనా స్థలం లేదా భవనంలో ఉన్న బావి, మడుగు, గుంట చెరువు లేదా మురుగు కాలువ, కుళ్ళిన చెత్త లేదా నిల్వ ఉన్న నీరు ఆ పరిసరాల్లో ఉన్న ఇతరుల ఆరోగ్యానికి హానికరంగానూ లేదా ఇతరత్రా ఇబ్బంది (nuisance) కలిగించే విధంగానూ ఉన్నట్లయితే అట్టి వాటిని పూడ్చమని లేదా పూడిక తీయమని లేదా నీటిని తొలగించమని లేదా కార్యనిర్వాహణాధికారి అవసరమని భావించిన ఏదైనా చర్యను చేపట్టమని,

ఇ) ఏదైనా స్థలంలో మొక్కలు, పిచ్చి మొక్కలు, పొదలు, ముళ్ళపొదలు, జెముళ్ళు విపరీతంగా పెరిగి లేదా అడవి ఆరోగ్యానికి హానికరంగానూ లేదా ప్రజలకు ప్రమాదకరంగానూ లేదా పొరుగువారికి ఇబ్బందికరంగానూ లేదా గాలి రాకపోకలకు (Ventilation) అటంకంగాను ఉన్నట్లయితే అట్టి పొదలను, పిచ్చి మొక్కలను, జెముళ్లను లేదా అడవిని తొలగించమని.

ఎఫ్)ఏదైనా దిగుడు బావిని చేదబావిగా మార్చమని నోటీసు జారీ చేయవచ్చును.

అయితే ఆ నోటీసుకు అట్టి నోటీసును తీసుకున్న వ్యక్తి ఏవైనా అభ్యంతరాలను తెలిపినట్లయితే, కార్య నిర్వాహణాధికారి అట్టి అభ్యంతరాలను విని, పరిశీలించి తగునిర్ణయం తీసుకోవాలి.

నోటీసు జారీ చేసిన తరువాత నోటీసు తీసుకున్న వ్యక్తి నోటీసులో పేర్కొన్న గడువులోగా నోటీసులో పేర్కొన్న చర్యలను చేపట్టనట్లయితే, కార్యనిర్వాహణాధికారి అట్టి చర్యలను చేపట్టి అందుకు ఆయన ఖర్చును అట్టి వ్యక్తి నుండి వసూలు చేయవచ్చును.

## క్వారీ పనులు

ఈ చట్టంలోని 95వ సెక్షను ప్రకారం గ్రామపంచాయితీ అనుమతి లేకుండా పబ్లిక్ రోడ్డుకు 20 మీటర్ల లోపు లేదా గ్రామపంచాయితీ చెందిన స్థిరాస్థిలో క్వారీ పని చేయటం లేదా రాళ్ళను, మట్టిని తొలగించటం చేయరాదు. అందుకు గ్రామపంచాయితీకి అనుమతిని మంజూరు చేయవచ్చును లేదా తిరస్కరించవచ్చును. తిరస్కరించినప్పుడు అందుకు కల కారణాలను సంబంధిత వ్యక్తికి తెలియపరచాలి.

గ్రామపంచాయితీ అభిప్రాయంలో ఏదైనా క్వారీ పని లేదా రాళ్ళను, మట్టిని తొలగించటం అట్టి ప్రదేశంలో నివశిస్తున్న లేదా సమీప ప్రాంతాలలో చట్టబద్ధమైన సంబంధం ఉన్న వ్యక్తులకు ప్రమాదమని లేదా ఇబ్బంది(nuisance) కలిగిస్తుందని గానీ లేదా కలిగించే అవకాశం ఉందని భావించినట్లయితే అట్టి క్వారీ స్థల యజమానికి లేదా అట్టి స్థల అజమాయిషీ చేస్తున్న వ్యక్తికి దానిని కొనసాగించరాదని లేదా అట్టి స్థలం నుండి రాళ్ళను, మట్టిని లేదా ఇతర పదార్థాలను (Material) తొలగించడం కొనసాగించరాదని కోరడం లేదా జరిగే ప్రమాదాన్ని లేదా దానివల్ల కలిగే లేదా కలిగే అవకాశం ఉన్న ఇబ్బందిని (nuisance) నివారించడానికి అట్టి క్వారీ లేదా స్థలంపై అవసరమైన చర్యను చేపట్టవచ్చును.

## రోడ్ల ఆక్రమణ

పబ్లిక్ రోడ్లపై గోడ కట్టడం, కంచెవేయటం, ఏ విధమైన అటంకాన్నైనా ఏర్పరచటం,ఆక్రమించుకోవటం చేయరాదని ఈ చట్టంలోని 96వ సెక్షనులో పేర్కొన్నారు.

ఆ చట్టంలోని 97వ సెక్షను ప్రకారం తలుపులు, గేట్లు, నేల అంతస్థు (ground floor) కిటికీలు కార్యనిర్వాహణాధికారి అనుమతి లేకుండా గ్రామపంచాయితీ రోడ్డు వైపు బయటకు తెరుచుకునే విధంగా ఏర్పాటు చేయరాదు. కార్య నిర్వాహణాధికారి నోటీసు ద్వారా యజమానికి బయటకు తలుపులు రోడ్డు వైపు తెరుచుకోకుండా ఉండే విధంగా ఏర్పాటు చేసుకోమని నోటీసు జారీ చేయవచ్చును.

ఈ చట్టంలోని 98వ సెక్షను ప్రకారం ఆక్రమణలను తొలిగించమని కోరుతూ భవన యజమానికి లేదా స్వాధీనంలో ఉన్న వ్యక్తికి కార్య నిర్వాహణాధికారి నోటీసు జారీ చేయాలి.

అట్టి భవన యజమాని లేదా స్వాధీనంలో ఉన్న వ్యక్తి అట్టి అక్రమణ కాలపరిమితి చట్టం ప్రకారం యజమాన్యపు హక్కు (Prescriptive title) కల్పించడానికి అవసరమైనంత కాలం నుంచి ఉందని లేదా స్థానిక సంస్థ అనుమతిలో (Licence) ఏర్పాటు చేయబడిందని లేదా అట్టి అనుమతి లేదా లైసెన్సు కాలపరిమితి ముగియలేదని ఋజువు చేసినట్లయితే గ్రామపంచాయితీ సహేతుకమైన నష్ట పరిహారాన్ని అట్టి అక్రమణ తొలగింపు లేదా మార్పిడి వలన నష్టపోయిన ప్రతి వ్యక్తికీ చెల్లించాలి.

ఈ చట్టంలోని 99వ సెక్షను ప్రకారం కార్యనిర్వాహణాధికారి

గ్రామపంచాయితీ ఆమోదంతో భవన యజమానికి లేదా స్వాధీనంలో ఉన్న వ్యక్తికి, గ్రామపంచాయితీ రోడ్డు మీదకు వచ్చే విధంగా వరండాలు, బాల్కనీలు, సన్‌షెడ్‌లు వంటి వాటిని ఏర్పరచుకోవడానికి లేదా భవనంలోకి ప్రవేశించడానికి అనువుగా మెట్టును లేదా డ్రైన్‌ను నిర్మించుకోవడానికి నిబంధనలకు, పరిమితులకు లోబడి అనుమతించవచ్చు.

పంచాయితీ రోడ్డు మీద గాని లేదా గ్రామపంచాయితీ అధీనంలో ఉన్న బహిరంగ స్థలంలో గాని తాత్కాలికమైన నిర్మాణాలను లేదా గుడారాలను నిబంధనలకు, పరిమితులకు లోబడి కార్యనిర్వాహణాధికారి అనుమతిని మంజూరు చేయవచ్చు.


గ్రామపంచాయితీ ఆమోదంతో గ్రామపంచాయితీ ఆధీనంలో ఉన్న రోడ్డు ప్రక్కన ఆక్రమించుకోవటానికి గ్రామ పంచాయితీ నిర్ణయించిన నిబంధనలకు, షరతులకు, కాలపరిమితికి లోబడి అద్దెకు ఇచ్చే అధికారాన్ని కార్యనిర్వాహణాధికారి కలిగి ఉన్నారు.

అయితే అట్టి నిర్మాణం లేదా అక్రమణ ఆరోగ్యానికి హానిని లేదా ప్రజలకు అసౌకర్యాన్ని లేదా ఇతరత్రా ఆ రోడ్డు వినియోగాన్ని ఆటంకపరిచే విధంగానూ ఉన్నట్లయితే పైన చెప్పబడిన అనుమతిని లేదా అద్దెకివ్వడం చేయరాదు.

ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా గ్రామపంచాయితీకి ఉన్న ఈ అధికారాన్ని నియంత్రించి అవసరమనుకున్న అజమాయిషీ చేయవచ్చు.

ఈ సెక్షను క్రింద ఇవ్వబడిన లైసెన్సు కాలపరిమితి ముగిసిన తరువాత, కార్యనిర్వాహణాధికారి నోటీసు లేకుండా కూడా అట్టి నిర్మాణాన్ని తొలిగించి, అందుకు అయిన ఖర్చును లైసెన్సు పొందిన వ్యక్తి నుండి ఈ చట్టంలో పేర్కొన్న పద్ధతిలో వసూలు చేయవచ్చు.

మురికి కాలవల మీద లేదా డ్రైయిన్‌ల మీద ఏ విధమైన కట్టడాలు కార్యనిర్వాహణధికారి అనుమతి లేకుండా చేయరాదని ఈ చట్టంలోని 100వ సెక్షనులో పేర్కొన్నారు. అనుమతి లేకుండానూ లేదా ఇచ్చిన అనుమతిలోని షరతులకు విరుద్ధంగాను చేసిన కట్టడాలను కార్యనిర్వాహణాధికారి లేదా అతని చేత అధికారమీయబడిన వ్యక్తి నోటీసు జారీ చేసి అట్టి నిర్మాణాలను కూల్చివేయవలసిందిగా సంబంధిత వ్యక్తిని అదేశంచవచ్చును అని కూడా ఇందులో పేర్కొన్నారు.




## రోడ్డుపై గోతులు తవ్వరాదు

కార్యనిర్వాహణాధికారి అనుమతి లేకుండా, కార్యనిర్వాహణాధికారి ఇచ్చిన అనుమతిలో విధించిన షరతులకు లోబడి మినహా ఏ వ్యక్తి పంచాయితీ క్రింద ఉన్న పబ్లిక్ రోడ్డుపై గోతులు త్రవ్వకాలు, అటంకాలు ఏర్పరచడటం చేయరాదని ఈ చట్టంలోని 101వ సెక్షనులో పేర్కొన్నారు.

అట్టి అనుమతి పొందిన వ్యక్తి చేసే గోతులకు లేదా అటంకాలకు వాటిని పూడ్చే వరకు లేదా తొలగించే వరకూ తన సొంత ఖర్చుతో సరిపడినంత కంచె వేసి, రాత్రివేళలో కావలసినంత వెలుగును ఏర్పాటు చేయాలి.

ఏ వ్యక్తి అయినా ఈ సెక్షన్‌ను ఉల్లంఘించినట్లయితే, కార్య నిర్వాహణాధికారి అట్టి గోతిని పూడ్చి లేదా అటంకాన్ని తొలగించి లేదా అట్టి గొయ్యికి గాని, అటంకానికి గాని, లైట్లు పెట్టి అందుకు అయిన ఖర్చును సంబంధిత వ్యక్తి నుండి వసూలు చేయవచ్చును.

## రోడ్డుపై చెట్టు

కార్యనిర్వాహణాధికారి అనుమతి లేకుండా, కార్యనిర్వాహణాధికారి విధించిన షరతులకు లోబడి మినహా పబ్లిక్ రోడ్డు మీదా లేదా గ్రామపంచాయితీకి చెందిన ఇతర ఆస్తులలో చెట్లను నాటరాదు అని ఈ చట్టంలోని 102వ సెక్షనులో పేర్కొన్నారు.

కార్యనిర్వాహణాధికారి అనుమతి లేదా ఆదేశం లేకుండా లేదా కార్య నిర్వాహణాధికారి విధించిన షరతులకు విరుద్ధంగా పబ్లిక్ రోడ్డు లేదా స్థలం మీద ఉన్న గ్రామపంచాయితీకి చెందిన చెట్లను పడగొట్టటం, తొలగించటం, నాశనం చేయడం, కొమ్మలు నరకడం, బెరడు తీయడం, ఆకులు, కాయలు కోయటం లేదా ఏ విధమైన నష్టాన్ని కలిగించడం చేయరాదు.

## పంచాయితీ స్థల అక్రమణ

గ్రామపంచాయితీకి చెంది, ప్రజాప్రయోజనాలకు నిర్దేశించబడిన భూమిని, గ్రామపంచాయితీ అనుమతి లేకుండా ఏ వ్యక్తి అయినా అక్రమించుకున్నట్లయితే అట్టి ఆక్రమణ చేసినందుకు గాను అట్టి వ్యక్తి గ్రామ పంచాయితీ విధించే జరిమానా చెల్లించవలసి ఉంటుంది అని ఈ చట్టంలోని 103వ సెక్షనులో పేర్కొన్నారు.

ఈ విధంగా జరిమానా విధించబడిన లేదా విధించబడనున్న వ్యక్తికి, అట్టి స్థలాన్ని ఖాళీ చేయమని, అక్కడ ఏదేని భవనం లేదా నిర్మాణం లేదా అక్కడ ఉంచిన దేనినైన తొలిగించమని కార్యనిర్వాహణాధికారి నోటీసు జారీ చేయవచ్చును.

అట్టి అక్రమణ వలన పంచాయితీ ఆస్తికి ఏవిధమైన నష్టం జరిగినా, జరిమానాతోపాటు గ్రామపంచాయితీకి నష్ట పరిహారం కూడా చెల్లించాల్సి ఉంటుంది.

చట్టం కల్పిస్తున్న హక్కులు, అది విధిస్తున్న పరిమితులను గూర్చి ప్రజలకు అవగాహన కల్పించటం ద్వారానే, హక్కుల వినియోగంలోనూ, ఉల్లంఘనల నియంత్రణలోను ప్రజల పాత్రను పెంపొందించడం సాధ్యమౌతుంది. స్థానిక సంస్థలతో సహా పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం, ప్రజల పాత్ర పెంచడం ద్వారానే ప్రజాస్వామ్య పరిణితికి, రాజ్యాంగ లక్ష్యసాధనకు మార్గం సుగమమవుతుంది.

– ***వి. రఘు,*** *న్యాయవాది*



# మానవీయత మూర్తీభవించిన యేసుక్రీస్తు

కమ్యూనిస్టు దేశాల ఆధిపత్యం సమానంగా ఉన్న, 'కోల్డ్‌వార్' దినాల్లో పలునోళ్ళలో వినబడిన మాట ఇది. మొత్తం ప్రపంచం ఇద్దరు యూదుల కనుసన్నల్లో నడుస్తోంది. సగం ప్రపంచాన్ని కార్ల్‌మార్క్స్ సిద్ధాంతాలు నడిపిస్తూంటే, మిగతా సగం ప్రపంచాన్ని జీసస్ స్థాపించిన క్రైస్తవ మత ప్రాబల్యం నడిపిస్తోందని అనేవారు.

మానవ చరిత్రను 'జీసస్ క్రైస్ట్ లేదా తెలుగీకరణలో 'యేసుక్రీస్తు' ప్రభావితం చేసినంతగా బహుశా మరే చారిత్రక వ్యక్తీ చేయలేదనడంలో అతిశయోక్తి లేదేమో! యేసుక్రీస్తు క్రైస్తవులందరికీ ఆరాధ్యదైవం. నిజానికి ఆయన తరువాత ఆయన అనుచరులు ఆయన సిద్ధాంతాల ఆధారంగా స్థాపించి వ్యాప్తి చేసిందే క్రైస్తవ మతమైనా, యేసుక్రీస్తు దాకా చలామణిలో ఉండి అప్పటిదాకా మానవచరిత్రలో తనదైన ముద్రను వేసిన యూదు మతానికి క్రైస్తవ మతం పొడిగింపు అని చెప్పవచ్చు.

ప్రేమ, క్షమాపణ అనే రెండు పునాదుల మీద క్రైస్తవ మతం స్థాపించబడింది. ఎందుకంటే ఈ రెండింటినీ ఆధారం చేసుకున్నవే యేసుక్రీస్తు ప్రబోధాలు, ఆయన జీవితం కూడా!! ప్రపంచంలోని అన్ని భాషల్లోనూ ఈ రెండు పదాలూ ఉన్నా వాటికి ఆచరణయోగ్యమైన, మానవ కళ్యాణార్థమైన అసలు సిసలు భాష్యం మాత్రం యేసుక్రీస్తు ప్రబోధాల్లో, జీవితంలో మాత్రమే చూడగలం. ప్రేమ, క్షమాపణ అనే అంశాల పైన అనేక గంటలు, రోజుల పాటు ప్రబోధాలు వల్లించడం అందరూ చేయగలిగిన అత్యంత తేలికపాటి విషయం. కాని వాటినే ఆచరణలో చూపించాల్సి వస్తే మాత్రం అంతా వెనక్కితగ్గే విషయమే!

ముప్పై మూడున్నర సంవత్సరాల యేసుక్రీస్తు జీవితం పూర్తిగా ప్రేమమయం. ప్రజలతో వారి కష్టాలు, కన్నీళ్ళతో, వారి దైనందిన జీవితంతో, వారి సమస్యలతో యేసుక్రీస్తు జీవితం పూర్తిగా పెనవేసుకుపోయింది. ఆనాటి మతాచార్యులు, రోమాప్రభుత్వ పాలకులు, వారి అధికారులు, అనుచరులంతా సమాజంలో ఒక బలమైన వర్గంగా ఏర్పడి 'దోపిడీ వ్యవస్థ'కు ప్రతినిధులుగా మారిన అత్యంత కీలకమైన దశలో యేసుక్రీస్తు సామాన్య మానవుని 'అసామాన్య నేతగా' రంగప్రవేశం చేశాడు. దౌర్జన్యం, దోపిడీ, బలప్రయోగం, అహంకారం, అధికారదర్పం రాజ్యమేలుతున్న సమయంలో ఆనాటి పోకడలకు, పరిస్థితులకూ పూర్తిగా భిన్నంగా కరుణ, సాత్వికత్వం, ప్రేమ, క్షమాపణ వంటి మరుగుపడిన నిజ మానవీయ విలువలను తెర మీదకి తెచ్చాడు.

అందుకే ఆయన ఎక్కడే ఉంటే అక్కడికి వేల సంఖ్యలో ప్రజలు పరుగులెత్తేవారు. ఆయన బోధనలు విని స్వాంతన పొందేవారు. ఎవరినీ కాదనకుండా ఆయన అందర్నీ అక్కున చేర్చుకునేవాడు, ఓదార్చేవాడు, తన మాటలతో సేదదీర్చేవాడు. ఆయన్ను అనుసరించిన వారిలో సామాన్యులు, అతిసామాన్యులేకాదు; పండితులు, సంపన్నులు ఆనాటి అగ్రశ్రేణి సామాజిక వర్గమూ ఉన్నారు. అయితే సంపన్నులూ, ప్రముఖులంతా తెరవెనకే రహస్య క్రైస్తవులుగా మిగిలిపోగా, సామాన్యులు మాత్రం సాహసంతో ముందుకు వచ్చి ఆయన్ను అనుసరించారు.

యేసుక్రీస్తు జననం, జీవితం, మరణం, పునరుత్థానం అన్నీ అత్యంత అసాధారణమైన ఘట్టాలుగా చరిత్రలో మిగిలిపోయాయి. పేదవారు కాకపోయినా, అతి సామాన్యులుగా పిలువదగిన నేపథ్యంలో దైవాంశ సంభూతుడు ఆత్మవశంతో మేరీ, జోసఫ్ దంపతులకు ఈనాటి ఇజ్రాయెల్ దేశంలో గల యూదయ ప్రాంతంలోని బెత్లేహేము అనే అనామక గ్రామంలో యేసుక్రీస్తు జన్మించాడు. వృత్తిరీత్యా వడ్రంగి అయిన జోసఫ్ యేసుక్రీస్తుకు వృత్తి సంబంధమైన పూర్తి తర్ఫీదునిచ్చాడు. అయితే జన్మరీత్యా తన ప్రాశస్త్యాన్ని, తన యుగంలో తన ద్వారా దేవుడు నెరవేర్చాలనుకున్న ప్రణాళికలన్నీ ఆకళింపు చేసుకున్న యేసుక్రీస్తు నాటి మతాచార్యుల తప్పుడు బోధనలను చిన్ననాటి నుండే ఎదిరించడం ప్రారంభించాడు. ఒక విధంగా ఆయన

'బార్న్‌రెబెల్'! (జన్మించిన నాటినుండే తిరుగుబాటు దారుడు).

పశ్చిమాసియా అంతటా రోమా ప్రభుత్వం పెత్తనాన్ని చలాయిస్తున్న రోజులవి. ఆనాటి పాలస్తీనా (ఈనాటి ఇజ్రాయెల్) దేశాన్ని కూడా రోమా ప్రభుత్వమే పరిపాలిస్తున్న సమయంలో స్థానికంగా ఉన్న యూదు మతాచార్యులు, పెద్దలు రోమా ప్రభుత్వ ప్రతినిధులతో చేతులు కలిపి సామాన్య ప్రజానీకంపైన దోపిడీని, దౌర్జన్యాన్ని అత్యధికం చేశారు. నీటి కొరత, సారవంతమైన భూముల కొరత (అదంతా ఎడారి ప్రాంతం) కారణంగా అసలే పంటల దిగుబడి అంతంత మాత్రంగా ఉండి కరువు క్షామ పరిస్థితులు, భరించలేని పన్నుల వసూళ్ళతో నడ్డి విరిగి ఉన్న సామాన్య ప్రజల కష్టాలను యేసుక్రీస్తు అర్థం చేసుకొని వెలుగులోకి తెచ్చాడు. తన బోధనల ద్వారా, ముఖ్యంగా తన జీవితం ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కలిగించడానికి, దేవుని పట్ల, దైవిక నియమాల పట్ల సరైన అవగాహనను కల్పించడానికి ఆయన శ్రమించాడు.

ఆనాడూ, ఈనాడూ కూడా దేవుడు చెప్పేది ఒక్కటైతే మతాచార్యులు చెప్పేది మరొకటిగా ఉంటుంది. దేవుణ్ణి తమ స్వార్థంకోసం మతాచార్యులు వాడుకోవాలనుకోవడమే నేడు, నాడూ కూడా సమాజంలో ఘర్షణలకు, తిరుగుబాటుకు కారణమయింది. దేవుడు కరుణామయుడన్నది సార్వత్రిక నిజం కాగా, దేవుణ్ని ఒక బూచిలాగా చూపించి పరమ కర్కోటకుడుగా, తప్పులు చేసినవారిని దండించడం తప్ప దేవుడు మరొకటి ఎరుగనివాడన్నట్టుగా ఆనాటి మతాచార్యులు చిత్రిస్తున్న సమయంలో యేసుక్రీస్తు దేవునికి సంబంధించిన అసలు విషయాలను ప్రాచుర్యంలోనికి తెచ్చాడు.

నజరేతు అనే గ్రామంలో ఒకరోజు ఆయన తన వాడుక చొప్పున అక్కడి దేవాలయానికి ఆరాధన కోసం వెళ్ళితే ఆయన చేతికి దైవగ్రంథాన్నిచ్చి దాంట్లోని ఒక భాగాన్ని చదవమన్నారు మతాచార్యులు. 'ప్రభువు ఆత్మ నా మీద ఉంది. బీదలకు సువార్త ప్రకటించడం కోసం ప్రభువు నన్ను అభిషేకించాడు. ఖైదీలకు విడుదలను, అంధులకు దృష్టిభాగ్యాన్ని ప్రకటించడానికి, అణగారినవారిని విడిపించడానికి, ప్రభువు మహోత్సవ సంవత్సరాన్ని ప్రకటించడానికి ఆయన నన్ను పంపాడు' అంటూ ప్రవచన రూపంలో యెషయా ప్రవక్త రాసిన భాగాన్ని ఆయన చదివి తిరిగి తన స్థలంలో కూర్చున్నాడు. ఆ భాగాన్నే యేసు ఎందుకు చదివాడో అర్థంకాక ఆలయంలో అంతా విస్తుపోయి చూస్తూ ఉంటే, "ఈ లేఖనాన్ని దేవుడు నా రాకకు ఎన్నో వందల సంవత్సరాల పూర్వమే ప్రవచన రూపంగా రాయించాడు. అది నెరవేరడం, మీరంతా కళ్ళారా చూస్తున్నారు" అని యేసుక్రీస్తు జవాబిచ్చాడు.

లోకంలో పాపం మితిమీరినపుడు, దేవుని పట్ల విధేయత హద్దులు మీరినపుడు దేవుడు తనదైన విధానంలో దండనకు పూనుకొంటాడన్నది అంతా విశ్వసిస్తూ వచ్చిన విషయం. కాని పాపిని దండించడం కాదు, మనిషిని పాపం నుంచి దూరం చేయడమే అసలు సిసలైన దైవిక పరిష్కారంగా, వినూత్నంగా ఆవిష్కరించి ఆలోచన రేకెత్తించిన యేసుక్రీస్తు నిజంగా విప్లవకారుడే!

నోవహు దినాల్లో అదే విధంగా జరిగిందని లేఖన భాగాల్లో అంతదాకా ప్రజలు చదివి తెలుసుకున్నారు. 'నోవహు దినాల్లో భ్రష్టత్వం పెచ్చరిల్లితే, దేవుడు నీతిమంతులుగా పేరుపొందిన నోవహును, అతని సంతానాన్ని, సకల జీవచరాల్లో 'ఆడమగ' జంటల నొక్కొక్కదాన్ని ఒక ఓడలో భద్రపరచి ఆ తరువాత నలభై రోజుల మహా జలప్రళయం ద్వారా లోకంలోని సకల జీవచరాలను నిర్మూలన చేశాడు. అయితే ఆ వినాశనాన్నంతటినీ చూసిన దేవుడు చాలా బాధపడి ఇక ముందు అలాంటి మహావినాశనానికి తాను పూనుకోబోనని నోవహుకు ప్రమాణం చేశాడు.

అయితే మానవుడెపుడూ అవిధేయతా ప్రియుడు, తిరుగుబాటుదారుడు, పాప ప్రలోభితుడు. మరి దానికి పరిష్కారం ఏమిటి? తన నిర్ణీత సమయంలో తన కుమారున్ని ఈ లోకానికి అణగారిన వారి ప్రతినిధిగా, విమోచకుడిగా, రక్షకుడిగా పంపిస్తానని దేవుడు వాగ్దానం చేశాడు. ఆ రక్షకుడు లేదా హెబ్రీ భాషలో 'మెస్సయ' కోసం అంతా ఎంతో ఆసక్తితో కనిపెడ్తున్న సమయంలోనే యేసుక్రీస్తు జననం జరిగింది. తన జీవిత ఉద్దేశ్యాన్ని ప్రభువు ఆవిధంగా లేఖనభాగం ద్వారా చదివి ప్రకటించినా సమాజంలోని ఉన్నత వర్గాల వారి చెవులకు అది సోకలేదు. ఎందుకంటే సమాజంలో పేరుకుపోయి ఉన్న దుర్గంధానికి తామే కారకులమన్న సంగతి ఎరిగిన వారుగా సంస్కరణలకు, దిద్దుబాట్లకు వారు సిద్ధంగా లేరు.

అందుకే యేసుక్రీస్తు ప్రబోధాలకు, పరిచర్యలకు అన్నిరకాల ఆంక్షలు, ఆటంకాలు సృష్టించారు. అడుగడుగునా అవరోధాలు ఎదుర్కొంటూ కూడా యేసుక్రీస్తు తన జీవితోద్దేశ్యాన్ని నెరవేర్చుకున్నాడు. లోకం అంతదాకా ఎరుగనటువంటి 'దైవత్వపు పార్శ్వాన్ని' ఆయన ప్రజల ముందర ఆవిష్కరించాడు. ఒక చెంపన కొడితే మరొకటి చెంప చూపించమన్న యేసుప్రభువు, సిలువలో మరణ శిక్షను అనుభవిస్తూ, ఆ సూత్రాన్ని అక్షరాలా అమలుచేశాడు. 'ప్రభువా! వారు చేస్తున్నదేమిటో వారికి తెలియదు కాబట్టి వారిని క్షమించు' అని మనసారా ప్రార్థించాడు. ప్రేమతో అందర్నీ అక్కున చేర్చుకున్నాడు, అందర్నీ ప్రేమతో పలకరించాడు. చివరికి సిలువలో మరణ శిక్షననుభవించేటపుడు కూడా ప్రేమతో అందరికోసం ప్రార్థించాడు.

యేసుక్రీస్తు ఒక గొప్ప తిరుగుబాటుకు నాయకత్వం వహించి విప్లవాన్ని లేవనెత్తి రోమా ప్రభుత్వాన్ని, ఆనాటి మతాచార్యుల దురాగతాలతో కూడిన ప్రాబల్యాన్ని మట్టికరిపిస్తాడని ఆశతో ఎదురుచూసిన ఆయన శిష్యులు ఆయన అంత బేలగా మరణించడాన్ని చూసి జీర్ణం చేసుకోలేక ఆయన్ను వదిలేసి పారిపోయారు. అయినా ఆయన మూడవనాడు తిరిగి పునరుత్థానం చెందిన తరువాత, తిరిగి వారందరినీ పోగు చేసి మళ్ళీ ఉద్బోధించి తాను అసంపూర్తిగా వదిలి వెళ్తున్న కార్యాన్ని పూర్తిచేయడం కోసం వారందరినీ కార్యోన్ముఖుల్ని చేశాడు.

యేసుక్రీస్తు ప్రబోధాలు, మాటల్లోని శక్తి ఆయన జీవితంలో వెల్లడయింది గనుకనే ఆయన ద్వారా ప్రోత్సహింపబడిన పామరులు, జాలరులు, నిరక్షరాస్యులైన ఆయన శిష్యులు ఆయన తరువాత

# మనం ప్రేమించే క్రీస్తు

**- స్వామి రంగనాథానంద**

మానవాళికంతటికీ స్ఫూర్తిదాయకమైన మహా బోధకులను మనసారా గౌరవించాలని భారతీయులమైన మనమంతా మన మతం ద్వారా నేర్చుకున్నాం. బోధకుల జీవితాలను మనం అధ్యయనం చేసే మన విధానంలో కూడా కొత్తదనంతో కూడిన అందం ఇమిడి ఉంది. మరో మతాన్ని ప్రబోధించే మనమంతా జీసస్ అనే మహనీయుని ద్వారా ఇంతటి స్ఫూర్తిని ఎలా పొందగలుగుతున్నామన్నది హిందూ యేతరులకు అంత సులభంగా అర్థమయ్యే విషయంకాదు.

ఒక మూఢనమ్మకాన్నో, మతసూత్రాన్నో కాక మతాన్వేషణలో భాగంగా భారతదేశం పొందగోరుతున్న ఆధ్యాత్మికత ఇది. మనం చదవబోతున్న విధంగా, జీసస్ క్రైస్ట్ కూడా మతం పట్ల ఇదే దృక్పథాన్ని అవలంబించాడు. భారతీయ మేధస్సులోని ఆత్మీయ ఆతిథ్యాన్ని ఈ దృక్పథం వివరిస్తుంది. వచ్చే రోజుల్లో అన్నీ నిక్షిప్తమైన ఉన్న ఇలాంటి విశాల దృక్పథాన్ని ప్రపంచంలో ఆలోచన కలిగిన వాళ్ళంతా స్వాగతించబోతున్నారు. 'జాతీయ సంస్కృతిగా మనం గర్విస్తున్న ఈ సంపదంతా వచ్చే రోజుల్లో సర్వమానవాళి సంస్కృతీ నాగరికతలో అంతర్భాగం కాబోతోంది. ఆ పరిణామం, శతాబ్దాలుగా సంకుచిత ప్రాదేశిక మతసూత్రాల సంకెళ్ళలో బందీగా ఉన్న 'క్రీస్తు-ఆత్మ' ను విముక్తి చేయడంలో సాయపడుతుంది. ఆ మహాబోధకుని మతానికి ఈ యుగంలో 'భారతీయత' చేయబోయే సేవ ఇది.

## జీసస్ జననం, బాల్యం. . .

దైవాంశ కలిగిన మహనీయుల జనన సమయంలో అటు ప్రకృతి ఇటు మానవాళి సమ్మేళనంలో ఆనందాతిరేకంతో కూడిన పరిణామాలు సంభవిస్తాయన్న విషయం మన దేశంలో ఉన్న వారికందరికీ తెలుసు. ఎందుకంటే సార్వత్రికానందాన్ని కలిగించే స్వాగత ఘటన అది. మన పవిత్ర గ్రంథాల్లోని మాటల్లో చెప్పాలంటే, 'మన పూర్వీకులు సంతసిస్తారు, దేవతలు నృత్యం చేస్తారు, ఈ ప్రపంచానికొక రక్షకుడు ఉద్భవిస్తాడు.

**మోదంతే పితారో నృత్యంతి దేవత:**
**సనత సేయమ్ భూర్భవతి (నారద భక్తి సూత్ర V.S)**

బైబిలులోని కొత్త నిబంధన గ్రంథంలోని సువార్త భాగాల్లో జీసస్ క్రైస్ట్ జననానికి సంబంధించిన వివరణ దీనితో సరిపోతుంది. లూకా సువార్తలో వర్ణన హృదయాన్ని లోతుగా తాకే విధంగా ఉంటుంది. కొత్తగా ప్రకటించబడిన రోమా చట్టం మేరకు పన్నుల తాలూకు వివరాలివ్వడం కోసం తల్లిదండ్రులైన జోసఫ్ మేరీలు గలిలియలోని నజరేతు నుండి యూదాయ ప్రాంతంలోని బెత్లెహేముకు వచ్చారు. అప్పటికే ఆమె తన ప్రథమ సంతానంతో గర్భవతి. ఆ జంట ఒక సత్రంలో తలదాచుకుంది. ఒక మహాగొప్ప ఆధ్యాత్మిక బోధకుడు కాబోతున్న శిశువును మేరీ అక్కడే ప్రసవించింది. సత్రంలో తగిన స్థలంలేని కారణంగా శిశువును తల్లి పొత్తిగుడ్డలతో చుట్టి ఒక పశువుల పాకలో పడుకోబెట్టింది. ఆ సమయంలో, దగ్గరలోనే గొర్రెలు మేపుకొంటున్న కొందరు కాపరులకు అంతా సద్దుమణిగిన అర్ధరాత్రివేళ ఈ కబురు అందింది. అత్యంత అమూల్యమైన శిశువు జనన వార్త అత్యంత అసాధారణమైన పద్ధతిలో వారికందింది.

'ప్రభువు దూత వారి వద్దకు వచ్చింది. ప్రభువు మహిమ వారి చుట్టూ ప్రకాశించినందున వాళ్ళంతా భయపడిపోయారు. అయితే ఆ దూత భయపడకండి. ఇదిగో ప్రజలందరికీ కలుగబోయే మహానంతోషకరమైన శుభసందేశాన్ని నేను మీకు తెలియజేస్తున్నాను. దావీదు పట్టణం లో నేడు మీ కోసం రక్షకుడు పుట్టాడు. ఈయన ప్రభువైన క్రీస్తు. దానికి మీకిదే సూచన. పొత్తిగుడ్డలతో చుట్టబడిన ఒక శిశువు తొట్టిలో పరుండబెట్టుబడి ఉండటం మీరు చూస్తారు' (లూకా 2:9-12)

కాపరులంతా ఆశ్చర్యచకితులయ్యారు. తమ ఆశ్చర్యంలోంచి తేరుకొంటూండగానే దేవతల సమూహమంతా కలిసి 'సర్వోన్నతమైన స్థలాల్లో దేవునికి మహిమయు, భూమికి, మనుషులందరినీ సమాధానం కలుగునుగాక' అంటూ దేవుని స్తుతిస్తూ పాడుతున్న మధురమైన గానాలు వినబడసాగాయి.

ఆ ఆనవాళ్ళ ఆధారంగా శిశువును చూసేందుకు కాపరులు బెత్లెహేము బయలుదేరారు. మేరీని, జోసఫ్‌ను కనుగొన్నారు. పశువుల పాకలో పరుండియున్న శిశువునూ కనుగొన్నారు. ప్రేమ పూరితమైన ఆరాధనను, అర్పణలను సమర్పించారు.

ఆ తరువాత పన్నెండేళ్ల బాలుడిగా జీసస్ బాల్యం తాలూకు క్లుప్త వివరాలు మనకు లభ్యమవుతాయి. యూదుల పస్కా పండుగను ఆచరించడానికి తల్లిదండ్రులతో సహా పరిశుద్ధ దేవాలయ సందర్శనాలకై జెరూసలేమ్‌కు ఆయన వెళ్ళాడు. పండుగ ఆచరించిన తరువాత తల్లిదండ్రులు తిరిగి ఇంటికి బయలుదేరారు. కాని జీసస్ తమతో లేడన్న విషయాన్ని ఒక రోజు పాటు ప్రయాణించిన పిదపవారు కనుగొన్నారు. ఆయన కోసం అంతటా వెదకడం ప్రారంభించారు. కాని మూడు రోజుల వెదుకులాట తరువాత పరిశుద్ధ దేవాలయ ప్రాంగణంలో నాటి యూదు మత ప్రతిష్టులు, పెద్దలతో ధర్మశాస్త్రం, మతవిశ్వాసం వంటి అంశాల మీద చర్చలు జరుపుతూండగా ఆయన్ను కనుగొన్నారు. నీవు ఆకస్మాత్తుగా అంతర్ధానమైతే మేమెంత భయపడిపోయాం తెలుసా? అంటూ తల్లి మెత్తగా మందలిస్తే 'నా కోసం మీరెందుకు వెదికారు? నేను నాతండ్రి వ్యవహారాల్లో తలమునకలై ఉంటానని మీకు తెలియదా? అని ఆయన ఎదురు ప్రశ్నించాడు. ఆయునిచ్చిన జవాబులోని అంతారార్థమైతే తల్లిదండ్రులు గ్రహించలేకపోయారు గాని, అతను తిరిగి దొరికాడు, తమతో ఇంటికి తిరిగి రావడానికి సమ్మతించాడని మాత్రం సంతృప్తి చెందారు.

జీసస్ యవ్వన ప్రాయానికి సంబంధించి ఒక పురుషుడిగా ఆయన ఆరంభ దినాలకు సంబంధించి మనకు పెద్దగా వివరాలు తెలియవు. అయితే 'జీసస్ జ్ఞానంలోను, దేవుని దయలోను మానవుని దయలోను వర్ధిల్లాడు' అని మాత్రం సువార్తల్లో ఒక్క మాటలో వివరించబడింది.

అయితే తన జీవిత పరమోద్దేశ్యాన్ని చాలా త్వరగానే ఆయన గ్రహించి, అది నెరవేర్చేందుకు గాను ఏదీ ఆటంకంగా ఉండకుండా అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాడనడానికి సూచనలున్నాయి. దగ్గరలోనే ఉన్న కొండలో ఏకాంతంగా, నిశ్శబ్దంగా స్వీయ ధ్యానంలో అనేక గంటలపాటు ఆయన గడిపి ఉండవచ్చు. మళ్ళీ ఆయన్ను మనం కలుసుకునేటప్పటికి ఆయన ముప్పై ఏళ్ళవాడు. అప్పటికి ఆయన ఒక చోట నుండి మరోచోటికి తిరుగుతూ, తన జీవితం, బోధనల ద్వారా సంచలనాన్ని సృష్టిస్తున్న మరో బోధకుని గురించి విన్నాడు. యూదయ అరణ్యంలోనూ, ఆ తరువాత యోర్దాను నదీ తీరంలోనూ 'మారు మనసు పొందండి. పరలోకరాజ్యం త్వరలోనే రాబోతుంది' అంటూ ప్రకటిస్తున్న బాప్తిస్మమిచ్చే యోహాను ఆయన (మత్తయి 3:2).

(మిగిలిన భాగం తరువాతి సంచికలో)

*అనువాదం: రెవ. టి. ఎ. ప్రభుకిరణ్*




ఆయన సువార్తను లోకంలోని అన్ని మూలాలకు చేరవేశారు. ఈ రెండువేల సంవత్సరాల్లో లోకంలోని 150 కోట్ల మంది క్రైస్తవులకు ఆ సువార్త చేరిందంటే దానికి ఆయన శిష్యులే కారణం! పిరికివారిని, పామరులను, పనికిమాలిన వారిని తన కోసం అనుచరులుగా ఎంపిక చేసుకోవడం చూసి ఆనాటి పండితులు, ప్రముఖులంతా ఆయన్ను ఎగతాళి చేశారు. కాని ప్రభువు అనుగ్రహించే శక్తితో వారే నలు దిగంతాలకూ సువార్త మోసుకెళ్ళారు. అది ఆయన ప్రేమలోని శక్తికి, ఆయనలోని పరివర్తనా ప్రాబల్యానికి నిదర్శనం. ఈ లోకంలో అగ్రగణ్యులను, సంపన్నులను, అధికారులను, మహా గొప్ప రాజకీయ నాయకులను అనుచరగణంగా చేసుకోవడానికి అంతా ఆరాటపడ్డారు. కాని సమాజంలోని అణగారిన వారి కోసమే తాను వచ్చానని, పాపులే తనకు అత్యంత ప్రియమైన వారని బహిరంగంగా ప్రకటించి వారినే అక్కున చేర్చుకొని, వారితోనే 'నవలోక నిర్మాణానికి' అంకురార్పణ చేసిన యేసుక్రీస్తు జీవితం, ప్రబోధాల పరమార్థం నిజంగా విప్లవాత్మకమైనదే!! యేసుక్రీస్తును ద్వేషించే వారున్నారు, ఆయన్ను గాఢంగా ప్రేమించే వారు ఉన్నారు. కాని ఆయన్ని విస్మరించడం మాత్రం ప్రపంచంలో ఎవరివల్లా కాదు. అదే ఆయన ప్రత్యేకత.



ఇక్కడ ఒక విషయం ఒప్పుకోక తప్పదు. యేసుక్రీస్తులోని అతి లోతైన భావాలను, ఆయన నిజమైన శక్తి సామర్థ్యాలను నిజంగా ఎరిగిన వారి సంఖ్య కూడా లోకంలో చాలా తక్కువే! ప్రేమ, క్షమ పునాదులుగా నవలోక నిర్మాణం ఆయన ఉద్దేశ్యం కాగా; దోపిడీ, దౌర్జన్యం, అణచివేత ఇంకా సాగుతూనే ఉన్నాయి. అంతే కాదు, ఆయన పేరుతోనే కొన్ని చోట్ల సాగుతోంది. ఇది నిజంగా దురదృష్టకరమైన పరిణామం. నయా భౌతికవాదంతో, పెచ్చరిల్లిన లాభార్జనా విధానాలతో 'కర్ర చేతిలో ఉన్న వాడిదే గేదె' అన్న సిద్ధాంతంతో మానవీయ విలువలు నానాటికీ అడుగంటుతున్న నేటి సమాజానికి నిజమైన ఊరట, పరిష్కారం యేసుక్రీస్తు ప్రబోధాల్లోనే అన్నది నిర్వివాదాంశం. అయితే వాటిని ప్రబోధించే వారు కూడా వాటిని అమలు చేసేవారుగా ఉండాలన్నది అత్యంత ప్రాథమికమైన నిబంధన. యేసుక్రీస్తు ప్రబోధాలు అప్పుడో ఎప్పుడో అంతా విన్నవారే. ఎరిగిన వారే!! అయితే వాటిని అమలు చేసి ప్రయోగాత్మకంగా లోకానికి రుజువు చేయగల యేసుప్రభువు నిజ అనుచరుల కోసం లోకం ఎదురుచూస్తోంది. మరో విధంగా చెప్పాలంటే, లక్షమంది యేసుక్రీస్తు ప్రబోధకులు కలిసి చేయలేని పనిని ఒక మదర్ థెరిస్సా చేయగలిగింది. అలాంటి లక్షల మంది థెరిస్సాల కోసం లోకం ఎదురుచూస్తోంది. ప్రేమ, క్షమ పునాదులుగా కలిగిన నవలోకపు నిర్మాణం ఆనాడే పూర్తవుతుంది. యేసుక్రీస్తు తన వంతు చేశారు, ఇక మన వంతు మిగిలి ఉంది.

- రెవ.టి.ఎ. ప్రభు కిరణ్















# తొలినాటి భారత్ క్రికెట్‌లో ఆంధ్రా ఆణిముత్యాలు

**ఒకప్పుడు ధనికులకు, కులీన వర్గాలకు పరిమితమైన క్రికెట్ ఇటీవలి కాలంలో ఢిల్లీ నుంచి గల్లీ వరకు వ్యాపించింది. ఇట్లా వ్యాపించిన క్రికెట్ ఇతర క్రీడలను, ముఖ్యంగా సాంప్రదాయక దేశీ క్రీడలను నిర్వీర్యం చేసిందనే విమర్శలు బాగానే వెల్లువెత్తాయి. చివరికి మారుమూల గ్రామాల్లో కూడా పిల్లలు క్రికెట్ ఆడటం ప్రారంభించారు.**

క్రికెట్ ఇతర క్రీడలను మింగివేస్తున్నదనే చర్చ, ఆరోపణలు ఒకపక్క సాగుతూనే ఉన్నాయి. అయితే, క్రికెట్ క్రీడా రంగంలో విజృంభించిన తెలుగువారి విజయాలను గుర్తు చేసుకోవటం కూడా అవసరం. వీరు క్రికెట్ క్రీడపై ఎనలేని ప్రభావం కనపరిచి, క్రీడాప్రియుల హృదయాలను వశం చేసుకున్నారు.

వీరిలో కటారి కనకయ్యనాయుడు (ప్రపంచానికి ఈయన సి.కె. నాయుడుగా సుపరిచితులు), ఆయన సోదరుడు కటారి సుబ్బన్న నాయుడు, సర్ విజయానంద్ గజపతిరాజు, విజయనగరానికి చెందిన మహారాజకుమార్ (క్రికెట్ ప్రపంచంలో ఈయన 'విజ్జీ'గా పేరు పొందారు) తదితరులు ఉన్నారు.

వీళ్లంతా తెలుగు మాట్లాడే కుటుంబాల నుంచి వచ్చినవారే. అయితే, వీరు ఇతర రాష్ట్రాలలోనే జన్మించి, బయటి రాష్ట్రాలలోనే ఎక్కువగా క్రికెట్ ఆడారు. కాని, వీరిలో ప్రతి ఒక్కరూ తమ ఆంధ్ర వారసత్వం గురించి గర్వపడేవారే.

వీరిలో 'విజ్జీ' తప్ప మిగిలిన అందరూ క్రికెట్ ఆటలో ప్రావీణ్యం కనబరిస్తే, విజ్జీ ఏమో క్రికెట్ క్రీడను ప్రోత్సహించటంలోనూ, నిర్వహణలోనూ కీలకపాత్ర పోషించారు. క్రికెట్‌కు ఆయన మంచి

రేడియో వ్యాఖ్యాత కూడా. లోక్‌సభకు కూడా ఆయన సభ్యుడిగా ఎన్నికయ్యారు.

వీరందరిలో సి.కె. నాయుడు పొడగరి. 1932-33లో ఇంగ్లాండ్‌తో భారత్ ఆడిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో ఆయన మన దేశ క్రికెట్ టీమ్‌కి నాయకత్వం వహించారు. ఆయన పూర్వీకులు మచిలీపట్నంకు చెందినవారు. అయితే, అప్పుడు సెంట్రల్ ప్రావిన్స్‌లో ఉన్న నాగపూర్‌లో 1895, అక్టోబర్ 31లో సి.కె. నాయుడు జన్మించారు. రాష్ట్రం వెలుపలే పెరిగినప్పటికీ, ఆయన తన మాతృభాష అయిన తెలుగులోనే మాట్లాడేవారు.

ప్రస్తుత తరానికి చెందిన చాలామంది యువతీ యువకులు షేక్స్పియర్ రాసిన ట్రాజెడీ నాటకాలు కాని, ఇతర నాటకాలు కూడా ఒకటి రెండు పేర్లు కూడా చెప్పలేకపోయినా, 'ఓహ్! షేక్స్పియర్ గొప్పవాడు' అనే అభిప్రాయం వ్యక్తం చేస్తారు. ఇదే పద్ధతిలో సి.కె. నాయుడు కూడా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. సి.కె. నాయుడు క్రికెట్ క్రీడారంగంలో సాధించిన విజయాల గురించి చాలా తక్కువ మందికే తెలుసు. అయితే 'సి.కె. గొప్ప హిట్టర్' అనే అభిప్రాయం అందరిలో ఉంది. నిజంగా, సి.కె. నాయుడు గొప్ప బ్యాట్స్‌మేన్. వివ్ రిచర్డ్స్ లేదా మన మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ క్రికెట్ రంగంలో ప్రవేశించడానికి చాలా ముందుగానే, సి.కె. నాయుడు తన సిక్స్‌లు, ఫోర్లతో స్టేడియంని హోరెత్తించేవారు.




1932-33లో ఇంగ్లాండ్‌తో భారత్‌కు జరిగిన మొదటి టెస్ట్‌మ్యాచ్‌కి నాయకత్వం వహించే అదృష్టం దక్కిన సి.కె.నాయుడు క్రికెట్ ఆడటాన్ని 1916లో ప్రారంభించారు. 1958 సంవత్సరం వచ్చేవరకు ఆయన ఆడుతూనే ఉన్నారు! అప్పటికి ఆయన వయస్సు 62 సంవత్సరాలు!! 1963-64లో బొంబాయిలో జరిగిన ఒక ఛారిటీ మ్యాచ్‌లో తిరిగి సి.కె. నాయుడు ప్రత్యక్షమయ్యారు. అప్పుడు ఆయన వయస్సు 67 సంవత్సరాలు. సి.కె. నాయుడి టెస్ట్ కెరీర్ మూడు, నాలుగు సంవత్సరాలే ఉన్నప్పటికీ 6 వేరు వేరు దశాబ్దాల్లో ఆయన క్రికెట్ ఆడటం విశేషం.

1926-27లో ఆర్థర్ గిల్లిగాన్ నాయకత్వంలోకి ఎంసిసి టీమ్ ఇండియాలో పర్యటించింది. ఎంసిసి అంటే, మెల్‌బోర్న్ క్రికెట్‌క్లబ్. ఇది ఇంగ్లాండ్‌కి చెందిన క్రికెట్ టీమ్. టెస్ట్‌మ్యాచ్ ఆడినప్పుడే ఇంగ్లాండ్ పేరును దీనికి వాడతారు. ఇతర అన్ని మ్యాచ్‌లలో దీన్ని ఎంసిసి-XI అనే వ్యవహరిస్తారు. హిందూస్-XI జట్టులో ఉన్న సి.కె. నాయుడు ఎంసిసి-XI జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 11 సిక్సర్లు, 13 ఫోర్లు బాదారు. కేవలం 116 నిముషాల్లో 153 పరుగులు చేశారు. ఒక సిక్సర్ అయితే ఏకంగా బొంబాయి జింఖానా స్టేడియం పైకప్పుపై వెళ్లి పడింది.

స్వాతంత్ర్యం రాకముందు రోజుల్లో ఏదో ఒక రాజకుటుంబానికి చెందిన ఒక రాజకుమారుడు క్రికెట్ టీమ్‌కు నాయకత్వం వహించటం పరిపాటి. అయితే, అదృష్టవశాత్తు భారత్ ఆడిన మొదటి టెస్ట్‌లోనే జట్టుకి నాయకత్వం వహించే అవకాశం సి.కె. నాయుడుకి దక్కింది.

ఇంగ్లాండ్‌లో చేసిన పర్యటన సందర్భంగా ఆడిన మొత్తం 26 టెస్ట్, ఇతర మ్యాచ్‌లలో సి.కె. నాయుడు 1618 పరుగులు చేసి, 65 వికెట్లు తీశారు. మొత్తం 32 సిక్సర్లు బాదారు. ఆ సీజన్‌లో అదే అత్యధికం. ఒక సిక్సం అయితే ఏకంగా బంతి వెళ్లి దగ్గర్లోని నదిలో పడింది. క్రికెట్ క్రీడారంగంలో బైబిల్‌గా వ్యవహరించబడే విజెడెన్ ఆయనను 1933లో క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా పేర్కొంది. మొదటి టెస్ట్‌లో నాయుడి నాయకత్వంలోని జట్టు ఓటమి పాలయినప్పటికీ, చేతి గాయంతో బాధపడుతున్న ఆయన 40 సిక్సర్లు కొట్టి, మొదటి స్థానంలో నిలిచారు.

డౌగ్లాస్ జార్డిన్ కెప్టెన్సీ కింద ఎంసిసి జట్టు 1933-34లో భారత్‌లో పర్యటించింది. పంజాబ్ గవర్నర్-XI జట్టు కోసం ఆడుతున్న నాయుడు సెంచరీ కొట్టారు. భారత్ గడ్డపై మొదటిసారి జరిగిన ఆ టెస్ట్ మ్యాచ్‌లో కూడా ఆయన నాయకత్వంలోనే భారత్ జట్టు ఆడింది. బొంబాయిలో జరిగిన మ్యాచ్‌కి దాదాపు లక్ష మంది పైగా ప్రేక్షకులు హాజరై, ఆటను తిలకించారు. భారత్ జట్టు రెండు టెస్ట్‌మ్యాచ్‌లనూ, సిరీస్‌ను కూడా ఓడింది. ఆయన 7 టెస్ట్‌ల్లో ఆడి 350 పరుగులను చేసి, 9 వికెట్లు తీశారు. అయితే, తన కెరీర్‌లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఆయన సాధించిన

మొత్తం పరుగులు 11,825, తీసిన వికెట్లు మొత్తం 411.

1956-57లో సి.కె. నాయుడు తన చిట్టచివరి రంజీట్రోఫీ ఆడారు. ఉత్తరప్రదేశ్ కోసం ఆడిన ఆయన 52 పరుగులు చేశారు. అంతకు ముందు రాజస్థాన్ జట్టుపై ఆడుతూ ఆయన 84 పరుగులు చేశారు. మరొక క్రికెట్ యోధుడయిన వినూ మన్‌కడ్ వేసిన బంతులకు రెండు సిక్సర్లు బాదారు. తన చిట్టచివరి మ్యాచ్‌లో బాగా ఆడలేమోనని సి.కె. నాయుడు ఆందోళన చెందుతుండేవాడని అంటుంటారు. అయితే, అదృష్టవశాత్తు చివరి మ్యాచ్‌లో కూడా ఆయన బాగానే ఆడారు.

క్రికెట్ క్రీడారంగానికి చేసిన సేవలవల్ల, సి.కె. నాయుడిని 'పద్మభూషణ్' బిరుదు వరించింది. 1967 నవంబర్ 14న ఆయన ఇండోర్‌లో మరణించారు. హోల్కర్ ప్రిన్స్‌లీ స్టేట్‌కి పాలకుడుగా ఉన్న రాజు సి.కె. నాయుడుని ఇండోర్‌కి ఆహ్వానించి 1923లో తన ఆర్మీకి కెప్టెన్‌గా నియమించారు.


సుబ్బన్న నాయుడు తన అన్నగారంత పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోకపోయినప్పటికీ, మంచి క్రికెటర్‌గానే కొనసాగారు. సి.ఎస్. నాయుడిగా వ్యవహరించేబడే ఈయన 1914లో ఏప్రిల్ 18న ఇండోర్‌లో జన్మించారు. ఆల్‌రౌండర్‌గా దాదాపు 30 సంవత్సరాల పాటు ఆయన ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడారు.

1930ల దశకంలో హిందూస్-XI జట్టు కోసం ఆడటానికి ఈ జూనియర్ నాయుడు క్రికెట్ రంగప్రవేశం చేశారు. రంజీ ట్రోఫీ మ్యాచ్‌లలో వివిధ జట్ల తరపున ఆయన క్రికెట్ మ్యాచ్‌లలో పాల్గొన్నారు. 295 వికెట్లు తీసి, 2575 పరుగులు సాధించిన సిఎస్. నాయుడు క్రికెట్‌లో తనకంటూ ఒక మంచి స్థానం సంపాదించుకున్నారు. ఎక్కువ వికెట్లు తీయటంలో ఆయన సాధించిన రికార్డు అనేక సంవత్సరాల పాటు ఆయన పేరిటే ఉండిపోయింది.

1940ల దశకం, 1950ల దశకంలో హోల్కర్ టీమ్‌కి సి.కె. నాయుడే వెన్నెముక. 11 సంవత్సరాలలో 10 సార్లు రంజి ఫైనల్‌కు ఈ జట్టు చేరుకోవటంలో సి.కె. నాయుడి కృషి ఉంది. కేవలం నాలుగు మ్యాచ్‌లు ఆడిన ఆయన 1942-43లో మొత్తం 40 వికెట్లు సాధించారు.

అలుపెరగని శ్రమ చేయగలిగిన సి.కె. నాయుడు లెగ్‌బ్రేక్ గూగ్లి బౌలర్‌గా పేరు పొందారు. 1944-45లో జరిగిన రంజీ ఫైనల్‌లో బొంబాయికి వ్యతిరేకంగా 152 ఓవర్లు బౌలింగ్ చేసిన ఘనత సి.ఎస్.నాయుడిదే. ఇందులో ఆయన 11 వికెట్లు సాధించారు. సి.కె. నాయుడి టెస్ట్ కెరీర్ ఎక్కువ కాలం సాగలేదు. పైగా అంత విజయవంతం కూడా కాలేదు. 1933-34లో తన సోదరుడి నాయకత్వంలో ఆయన మొదటిసారి టెస్ట్ మ్యాచ్ ఆడారు. సి.కె. నాయుడు 2002 లో ఇండోర్‌లో మరణించారు.

ఇక విజ్జీ విషయానికి వస్తే, ఆయన గొప్ప క్రికెటర్ కావాలనుకున్నాడు కానీ కాలేకపోయారు. అయితే, క్రికెట్ క్రీడకు మంచి ప్రోత్సాహకునిగా, సమర్థవంతమైన నిర్వాహకునిగా ఆయన పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.



విజయనగర సామ్రాజ్యం పాలకులైన పూసపాటి విజయరామ గజపతిరాజుకి 1905, డిసెంబర్ 28న 'విజ్జీ' జన్మించారు. తండ్రి మరణించిన తరువాత ఆయన వారణాసిలోని కుటుంబ ఎస్టేట్స్‌కి వెళ్లిపోయి, కాశీపూర్ జమీందారు కుమార్తెను వివాహమాడారు.

ధనవంతుడైన ఒక రాజకుమారుడుగా, 1926లో ఆయన ఒక క్రికెట్ జట్టును నిర్వహించారు. తన ప్యాలస్ లోపల ఒక క్రికెట్ క్రీడా మైదానాన్ని నిర్మించారు. ఆయన జట్టు భారత్‌లోనూ, శ్రీలంకలోనూ పర్యటించింది. భారత్‌లో ఆడేందుకు ఆయన అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లయన జాక్ హోబ్స్ వంటి వారిని కూడా రప్పించగలిగారు. 1936లా ఇంగ్లాండ్‌తో టెస్ట్‌మ్యాచ్ ఆడటానికి వెళ్లిన భారత్ టీమ్‌కి 'విజ్జీ' నాయకత్వం వహించారు. అదే సంవత్సరం ఆయన టెస్ట్ క్రికెట్ కెరీర్ ప్రారంభమవటమూ, పూర్తవటమూ కూడా జరిగిపోయింది. దేశవాళీ క్రికెట్‌లో కూడా ఆయన క్రీడా జీవితం త్వరితంగానే ముగిసింది. 8వ కింగ్ ఎడ్వర్డ్ విజ్జీకి 'నైట్‌వుడ్' ని ప్రదానం చేశారు. అయితే 1947లో భారతదేశం స్వాతంత్ర్యం సాధించిన తరువాత ఈ హోదాని ఆయన పరిత్యజించారు. ఎంసిసి ఆయనకు క్లబ్ సభ్యత్వాన్ని ఇచ్చింది.

క్రికెట్ క్రీడకు సంబంధించిన ఇతర రంగాలపై దృష్టి నిలిపిన విజ్జీ బోర్డ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ క్రికెట్ ఇన్ ఇండియా (బిసిసిఐ) సంస్థకు ప్రెసిడెంట్ కూడా అయ్యారు. ఈ బోర్డ్ అత్యంత శక్తివంతమైన సంస్థ. కాన్పూర్‌కి టెస్ట్‌వేదిక హోదాను ఇవ్వటంలో ప్రధాన పాత్ర వహించినది విజ్జీయే.

టెన్నిస్ కూడా ఆడుతుండే విజ్జీ క్రికెట్ మ్యాచ్‌లపై రేడియో కామెంటరీ చేయటంలో అద్భుత ప్రతిభ కనపరిచేవారు. వేటలో 300 పులులను కాల్చినట్లు చెప్పుకుంటుంటారు.

తరువాత సంవత్సరాల్లో విజ్జీ రాజకీయవేత్తగా మారి, 1962లో లోక్‌సభకు ఎన్నికయ్యారు.

**- దాసు కేశవరావు**

*(అనువాదం: వై. సరోజ)*

# అలరించిన బాల

**పదహారవ అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం నవంబర్ 14 నుంచి 20 వరకు వారం రోజుల పాటు హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. 14వ తేదీన జరిగిన ప్రారంభోత్సవం, 20వ తేదీన జరిగిన ముగింపు కార్యక్రమం ప్రేక్షకులకు మంచి వినోదాన్ని పంచి ఆకట్టుకున్నాయి.**

ఇక వారం రోజుల పాటు ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి పోటీకి వచ్చిన చిత్రాల ప్రదర్శన పిల్లలను, పెద్దలను ఎంతగానో అలరించింది. పలు చిత్రాలు ప్రదర్శనకు వన్నె తెచ్చి ఆకట్టుకున్నాయి. వాటిని చూడలేకపోయిన వారు బాధపడేలా చిత్రాలు ఉన్నాయని చూసినవారు ప్రశంసించారు. చిత్రాల ప్రదర్శనతోపాటు బాలల చిత్రాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చాగోష్ఠులు, ఓపెన్ ఫోరమ్‌లు, మీడియా సమావేశాలు, లలిత కళాతోరణంలో ప్రతిరోజూ సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు చలన చిత్రోత్సవాన్ని సఫలం




చేసి, నిండుదనం చేకూర్చాయి. బాలలకు, పెద్దలకు మంచి వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచిపెట్టాయి.

## బాలల చిత్రాలు పెరగాలన్న ఆకాంక్షను వ్యక్తపరిచిన ముఖ్యమంత్రి

పదహారో అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల ప్రారంభ కార్యక్రమం హైదరాబాద్ లోని లలిత కళాతోరణంలో జరిగింది. పలువురు రాజకీయ నాయకులు, జాతీయ, అంతర్జాతీయ సినీ ప్రముఖులు, విదేశీ అతిథుల నడుమ వైభవంగా బాలల సినిమా ఉత్సవం మొదలైంది. పాశ్చాత్య, దేశీయ సంగీత కార్యక్రమాలు, మహారాష్ట్ర, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాల సంప్రదాయ కళారూపాలు చూపరుల కళ్లను మిరుమిట్లు గొలుపుతూ ఆసాంతం అలరించాయి. వారం రోజులపాటు జరిగిన బాలల సినిమా పండుగ ప్రారంభోత్సవానికి కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీమతి




అంబికాసోని, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె.రోశయ్య, శాసనమండలి చైర్మన్ శ్రీ చక్రపాణి, రాజ్యసభ సభ్యుడు శ్రీ దాసరి నారాయణరావు, రాష్ట్ర సమాచార, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి శ్రీమతి జె. గీతారెడ్డి, చిల్డ్రన్స్ ఫిలిం సొసైటి ఆఫ్ ఇండియా (సిఎఫ్ఎస్) అధ్యక్షురాలు నందితాదాస్, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ శ్రీ పార్థసారథి, చిత్రోత్సవ డైరక్టర్ శ్రీ సుశోవన్ బెనర్జీ, తదితర ప్రముఖులు హాజరయ్యారు. ప్రముఖ దర్శకులు గుల్జార్, విశాల్ భరద్వాజ్, తారే జమీన్‌పర్ చిత్రంలో బాల నటుడు దర్శీల్, తెలుగు నటుడు వెంకటేశ్, నటి ఇలియానా, ప్రముఖ నటి రేవతి మీనన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

కేంద్రమంత్రి శ్రీమతి అంబికాసోని, ముఖ్యమంత్రి శ్రీ రోశయ్య తదితరులు వేదికపైన జ్యోతి ప్రజ్వలన గావించడంతోపాటు ముఖ్యమంత్రి చేతుల మీదుగా చిత్రోత్సవాలకు మస్కట్‌గా రూపొందించిన బంగారు బాల ఏనుగు 'గజ్జు'ను ఆకాశంలోకి వదలడంతో వారం రోజుల సినిమా పండుగను లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్రమంత్రి శ్రీమతి అంబికాసోని ప్రసంగిస్తూ, బాలల అభ్యున్నతికి స్వర్గీయ జవహర్‌లాల్ నెహ్రూ కన్న కలల్ని ఈ చిత్రోత్సవం సాకారం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్రోత్సవం ద్వారా చిన్నారుల మేధో పరిధి విస్తృతమవుతుందన్నారు. ముఖ్యమంత్రి శ్రీ రోశయ్య



# లచలన చిత్రోత్సవం

ప్రసంగిస్తూ, సినీ పరిశ్రమ దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. వినోదం, సందేశాన్ని అందించే బాలల చిత్రాలు ఎక్కువ సంఖ్యలో రావటం లేదన్నారు. పెట్టుబడి ఆశించకుండా, బాలలకు సందేశాత్మకంగా సినిమా అందించాలన్న నిర్మాతలు ఎక్కువ సంఖ్యలో లేరని, వీరిని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ, రాష్ట్రంలో వీరికి ప్రోత్సాహకాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చిత్రోత్సవ ఏర్పాట్లు, నగర సుందరీకరణలో సహకరించిన ప్రభుత్వ విభాగాల్ని మంత్రి శ్రీమతి గీతారెడ్డి ప్రశంసించారు.

చిత్రోత్సవంలో ప్రదర్శించే సినిమాల్లో ఉత్తమ చిత్రాల్ని ఎంపిక చేసే బాలల జ్యూరీ సభ్యుల జాబితాను నందితాదాస్ వేదికపై ప్రకటించారు. చిత్రోత్సవంలో 70 ఉత్తమ సినిమాలు ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ప్రముఖ దర్శకులు శ్రీ గుల్జార్ మాట్లాడుతూ, సిఎఫ్ఎస్ఐ వద్ద మంచి బాల సాహిత్య పుస్తకాలు, సినిమాలు ఉన్నాయని, వీటిని వృథాగా భద్రపర్చకుండా, దేశవ్యాప్తంగా చిన్నారులకు అందుబాటులోకి తీసుకుని రావాలని సూచించారు. దాదాపు వేయిమంది బాల అతిథులు, వారి తల్లిదండ్రులు కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. ముంబై కళాకారులు ప్రదర్శించిన 'జయహో' నృత్యం, హైదరాబాద్‌లోని సెయింట్ ఆల్ఫోన్సా, నాసర్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## గ్రామీణ బాలలకూ అవకాశం

హైదరాబాదులో జరిగిన చిత్రోత్సవంలో పాల్గొనేందుకు తమకూ అవకాశం వస్తే ఎంత బాగుండు... అని గ్రామీణ బాలలే కోరుకున్న వైనం అందరినీ ఆలోచింపజేసేదే! ఈ నేపథ్యంలో చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఎస్ఐ) అధ్యక్షురాలు నందితాదాస్ రాష్ట్ర బాలలకు తీపి కబురే అందించారు. చిత్రోత్సవంలో ప్రదర్శించిన దేశ, విదేశాల చిత్రాలను జిల్లాల్లోనూ ప్రదర్శించేందుకు సీఎఫ్ఎస్ఐ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. సీఎఫ్ఎస్ఐ అధ్వర్యంలో ఈ చిత్రాలను ఆడిటింగ్ చేసి రేటింగ్ నిర్వహిస్తారు. ఈ రేటింగ్‌లో ముందు వరుసలో నిలిచే పలు చిత్రాలను ప్రభుత్వం, ఫిలిం అభివృద్ధి సంస్థల సాయంతో జిల్లాల్లోని బాలలకోసం అందుబాటులోకి తీసుకొస్తారు. దూరదర్శన్ ఛానెల్‌లోనూ ప్రసారం చేయడానికి సీఎఫ్ఎస్ఐ ఏర్పాట్లు చేస్తున్నట్లు నందిత పేర్కొన్నారు.




సీఎఫ్ఎస్ఐ నిధిలో భద్రపర్చిన ఎన్నో చిత్రాలను ప్రత్యేక సమయంలో ప్రసారం చేయించేందుకు న్యూఢిల్లీ లోని దూరదర్శన్ డైరెక్టర్‌తో సొసైటీ ఇప్పటికే రెండు మూడుసార్లు సంప్రదింపులూ జరిపింది.బాలలంతా చిత్రోత్సవం లోనే పాల్గొనాల్సిన అవసరం లేకుండా ఇక్కడ ప్రదర్శించిన ఉత్తమ చిత్రాలనూ చూసే అవకాశం అందరికీ కల్పించబోతున్నారు. బాలలకు సినిమాపై ఆసక్తి కల్పించేం దుకు సైతం సీఎఫ్ఎస్ఐ పలు ప్రణాళికలు రూపొం దిస్తున్నది. దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో ఫిలిం క్లబ్బులు, ఫిలిం లైబ్రరీలు, ఫిలిం ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నది సొసైటీ ఆలోచన. దీంతో పాటు చిత్రోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న ఫిలిం నిర్మాణం, యానిమేషన్‌లో అవగాహన వంటి వర్క్‌షాపులను కూడా స్కూళ్లలో ఏర్పాటు చేసేందుకు అవకాశముంది. ఇంకా చెప్పాలంటే సినిమా రంగాన్ని పాఠశాల సిలబస్‌లో చేర్చాలని కూడా సినీ ప్రముఖులు గట్టిగానే కోరుతున్నారు. నందిత, నటి రేవతి, ఆశిష్ విద్యార్థి, జర్మన్ దర్శకురాలు ఇన్‌కా ఫ్రీయిస్ ఇంకా మరెందరో దేశ, విదేశీ దర్శకులు ఈ అంశాన్ని చిత్రోత్సవంలో చర్చించారు.



# శోభాయమానంగా ముగింపు కార్యక్రమం

హైదరాబాద్ లలిత కళా తోరణంలో నవంబర్ 20వ తేదీన ఏర్పాటుచేసిన చిత్రోత్సవ ముగింపు, అవార్డుల ప్రదాన కార్యక్రమం అతిథులు, సినీ ప్రముఖుల మధ్య శోభాయమానంగా జరిగింది.

చిత్రోత్సవంలో అంతర్జాతీయ పోటీ విభాగంలో ప్రదర్శించిన జర్మనీ చిత్రం 'ది క్రొకొడైల్స్' మూడు పురస్కారాలు గెల్చుకుంది. ప్రతిష్ఠాత్మక 'బంగారు ఏనుగు' అవార్డుతో పాటు ఉత్తమ స్క్రీన్‌ప్లే పురస్కారాన్ని, బాలల జ్యూరీలో ప్రత్యేక ప్రశంసను ఈ చిత్రం సొంతం చేసుకుంది. 'ఆసియా పనోరమ' విభాగంలో చైనాకు చెందిన




'టూ మెన్స్ క్లాస్‌రూమ్' చిత్రం 'బంగారు ఏనుగు' అవార్డును కైవసం చేసుకుంది. లఘు, ఏనిమేషన్ విభాగాల్లో ఉత్తమ చిత్రాలను, ప్రత్యేక ప్రశంసలు పొందిన బాలల జాబితాను ప్రకటించారు. మన దేశానికి చెందిన 'కిడ్స్' చిత్రం 'ఉత్తమ దర్శకుడు' విభాగంలో అవార్డు సాధించింది.

ఉత్తమ 'బంగారు ఏనుగు'లు గెల్చుకున్న 'టూ మెన్స్ క్లాస్‌రూమ్' చిత్ర దర్శకుడు డాంగ్‌లింగ్, 'క్రొకొడైల్స్' చిత్ర దర్శకుడు క్రిస్టియన్ డిట్టర్‌కు ముఖ్యమంత్రి శ్రీ రోశయ్య పురస్కారాలు అందచేశారు. కేంద్ర సమాచార, ప్రసారశాఖల సహాయ మంత్రి శ్రీ చౌదరి మోహన్ జతువా, రాష్ట్ర సమాచార, పర్యాటక సినిమాటోగ్రఫీ మంత్రి శ్రీమతి గీతారెడ్డి, బాలీవుడ్ నటి శ్రీమతి జూహీచావ్లా, నిర్మాత శ్రీ రామానాయుడు, నటులు శ్రీ రాజేంద్రప్రసాద్, శ్రీ జగపతిబాబు, శ్రీ రామ్‌లు వేర్వేరు విభాగాల్లో ఉత్తమ చిత్రాలకు బంగారు, వెండి ఏనుగు పురస్కారాలను, నగదు బహుమతిని అందజేశారు.



ఈ కార్యక్రమంలో శ్రీ రోశయ్య మాట్లాడుతూ, ఈ చిత్రోత్సవం బాలలకు మరపురాని అనుభూతిని మిగులుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి శ్రీ చౌదరి మాట్లాడుతూ, ఇలాంటి చిత్రోత్సవాలు బాలలకు మంచి విజ్ఞానం అందించడంతో బాటు ప్రపంచ సంస్కృతులు తెలుసుకొనేందుకు దోహదం చేశాయని పేర్కొన్నారు. శ్రీమతి గీతారెడ్డి మాట్లాడుతూ, దాదాపు లక్షా ఇరవై వేల మంది బాలలు ఈ చిత్రోత్సవాలను తిలకించారన్నారు. 'చిల్డ్రన్స్ ఫిలిం సొసైటి ఆఫ్ ఇండియా' అధ్యక్షురాలు నందితాదాస్ మాట్లాడుతూ, తాను పదవిలో చేరిన 3 నెలల్లోనే ఈ చిత్రోత్సవాలు నిర్వహించాల్సి వచ్చిందన్నారు. కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ, ఈ అనుభవాన్ని ఉపయోగించుకొని 2011 చిత్రోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. చిత్రోత్సవం డైరక్టర్ శ్రీ సుషోవన్ బెనర్జి, రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల కమిషనర్, ఎఫ్‌డిసి ఎం.డి. శ్రీ పార్థసారథి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

- టి. సురేష్ కుమార్

## అవార్డులు పొందిన చిత్రాలు

1. **'బంగారు ఏనుగు' అవార్డుకు ఎంపికైన చిత్రాలు**

   ఆసియా పనోరమ విభాగం : **'టూ మెన్స్ క్లాస్‌రూమ్'** (చైనా)

   అంతర్జాతీయ పోటీ విభాగం : **'క్రొకొడైల్స్'** (జర్మనీ)

2. **లఘు విభాగంలో 'వెండి ఏనుగు' చిత్రాలు**

   ఆసియా పనోరమ విభాగం : **'ఐ ఫీల్ పిటీ ఆన్ ఓజోన్ లేయర్'** (ఇరాన్)

   అంతర్జాతీయ పోటీ విభాగం : **'ఎలిఫెంట్స్'** (యుకె)

3. **ఉత్తమ 'స్క్రీన్‌ప్లే' విభాగంలో 'వెండి ఏనుగు' చిత్రాలు**

   ఆసియా పనోరమ విభాగం : **'చైల్డ్ ఏంజిల్'** (ఇరాన్)

   అంతర్జాతీయ పోటీ విభాగం : **'క్రొకొడైల్స్'** (జర్మనీ)

4. **ఉత్తమ 'యానిమేషన్' విభాగంలో 'వెండి ఏనుగు' చిత్రాలు**

   ఆసియా పనోరమ విభాగం : **'ది కన్నింగ్ టైలర్ అండ్ ది యంగ్ మ్యాన్'** (ఇరాన్)

   అంతర్జాతీయ పోటీ విభాగం : **'న్యూ స్పీషీస్'** (లాత్వియా)

5. **ఉత్తమ 'దర్శకత్వం' విభాగంలో 'వెండి ఏనుగు' చిత్రాలు**

   ఆసియా పనోరమ విభాగం : **'కిడ్స్'** (భారత్)

   అంతర్జాతీయ పోటీ విభాగం : **'ఏ విచ్ ఇన్‌ది ఫ్యామిలీ'** (స్వీడన్)

6. **ప్రత్యేక ప్రశంసలు పొందిన చిత్రాలు**

   శ్రీలంక చిత్రం **'సిరి రాజ సిరి'** (బాలల జ్యూరీ)

   జర్మనీ చిత్రం **'ది క్రొకొడైల్స్'** (బాలల జ్యూరీ)

   భారత్‌కు చెందిన **'ప్యూయల్ డ్యూయల్'** (పెద్దల జ్యూరీ)

# వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచిన ఆణిముత్యాలు

## ది క్రొకొడైల్స్

### బంగారు ఏనుగు బహుమతి పొందిన జర్మనీ చిత్రం

పదేండ్ల ప్రాయంలోని హన్నీస్ తన మామ్‌తో పాటు జీవిస్తుంటాడు. "ది క్రొకడైల్స్" గ్యాంగ్‌లో సభ్యుడు కావాలనే అతని స్వప్నం. క్రొకడైల్ కావడానికి ఒక సవాలును కూడా అతను స్వీకరిస్తాడు. అయితే చివరి నిమిషంలో ప్రమాదం నుంచి వీల్‌చైర్‌లో తిరిగే కై అతణ్ణి రక్షిస్తాడు. ఒకరాత్రి కై కంటపడిన దొంగతనాన్ని అతని సహకారంతో క్రొకడైల్ గ్యాంగ్ ధైర్యసాహసాలు, మెనా చతురతలు ప్రదర్శించి ఎలా ఛేదిస్తుందో ఇందులో చూపారు.



## ద లాస్ట్ రెయిన్‌బో

### బాల్యం నాటి ఇంద్రధనుస్సు ఛాయ

బాలల చిత్రాలు బాలల్ని మురిపిస్తే పెద్దలకు తమ బాల్యాన్ని గుర్తుకు తెస్తాయి. అందుకు చక్కని ఉదాహరణ 'ది లాస్ట్ రెయిన్‌బో'. ఇది మరాఠీ చిత్రం. నితిన్, సమీర్ అనే ఇద్దరు అన్నదమ్ముల కథ ఇది. వేసవి శెలవులకి ప్రతి ఏడాది తన నానమ్మ ఇంటికి వెళతాడు సమీర్. ఓ సంవత్సరం నితిన్ కూడా తమ్ముడితో సహా నానమ్మ దగ్గరకు ప్రయాణమవుతాడు. అక్కడ అన్నతో ప్రతి విషయంలోనూ వాదనకు దిగడం, తిరునాళ్లలో అన్న ఎంతో ముచ్చటపడి కొనుక్కున్న రంగు రాళ్ల పెట్టెని సమీర్ దొంగలించడం.. వంటి అంశాలతో చిత్రం సాగుతుంది. తాను ఇష్టపడి కొనుక్కున్న పెట్టెని సమీర్ దొంగిలించినందుకు నితిన్ అలుగుతాడు. అప్పట్నుంచి తమ్ముడితో పొడిపొడిగా మాట్లాడుతుంటాడు. ఈ ఇద్దరు అన్నదమ్ములు పెరిగి పెద్దవాళ్లవుతారు.



ఉద్యోగరీత్యా వేరు వేరు ప్రాంతాల్లో స్థిరపడతారు. కులదైవానికి పూజలు చేయడం కోసం తమ ఊళ్లోకి అడుగుపెట్టిన సమీర్ చిన్నప్పుడు అన్న నుంచి దొంగలించి, చెట్టు తొర్రలో దాచిన రంగు రాళ్ల పెట్టె కోసం వెదుకుతాడు. ముద్దులొలికే తన తనయుడితో ఆ తొర్రలోంచి ఆ పెట్టె తీయించి అన్నకివ్వడంతో కథ ముగుస్తుంది. కథ చాలా చిన్నది. అయితే చిన్న పిల్లల మనోభావాలు ఏ విధంగా ఉంటాయో చెబుతుంది. ఆ భావాలు పెద్దయిన తర్వాత కూడా వెంటాడుతాయని చెప్పే చిత్రం ఇది. కేవలం 22 నిముషాలు పాటు సాగే కథతో ఈ చిత్రాన్ని ధీరజ్ మేశ్రమ్ తెరకెక్కించారు.

## ఐ ఫీల్ పిటీ ఫర్ ద ఓజోన్ లేయర్

### కాలుష్యంపై బుల్లి దర్శకుడి బుల్లి చిత్రం


అమాయకంగానూ, ముద్దు ముద్దుగానూ కనిపించే పూరియ అఖిలి దర్శకత్వం వహించిన లఘు చిత్రం 'ఐ ఫీల్ పిటీ ఫర్ ద ఓజోన్ లేయర్'. ఈ సినిమాకు తానే బొమ్మలు వేసాడు. చిన్న చిన్న మాటలతో తెరవెనుక వ్యాఖ్యానం చెప్పాడు. ఇరాన్ రాజధాని నగరం టెహరాన్ ఒకప్పుడు నందనవనంలా ఉండేదని బామ్మ మాటను ఉటంకిస్తాడు. పొగచూరి పోయిన ప్రస్తుత పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో చూపిస్తాడు. తనకే శక్తి ఉంటే కాలుష్య కారకాలైన వాహనాలను కట్టగట్టి మూలకు పడేస్తాను అని ప్రేక్షకులను నవ్విస్తాడు. ఈ లఘు చిత్రంలో కీలక విషయం ఓజోన్ పొరకు జరుగుతున్న ప్రమాదం. ఇలాంటి జటిలమైన విషయాన్ని కూడా గంభీరమైన ఉపన్యాసాలతో కాకుండా చిన్న చిన్న మాటలతో, సరదా చమక్కులతో చెప్పి మెప్పించవచ్చు అని చిన్నారి పూరియా నిరూపించాడు. దర్శకత్వం: పూరియ ఆఘలి



## ఎ టైం టు లవ్

### లోతైన ప్రేమోద్వేగానికి భాష్యం

భావోద్వేగాలను ఇరాన్ వాళ్లు ఎంత బలంగా చూపుతారో చెప్పడానికి 'ఎ టైం టు లవ్' సినిమా బలమైన ఉదాహరణ. హాల్లోకి వెళ్లే వరకే మనం. దీపాలు ఆరిపోయాక చీకట్లో వెలిగిన 'ఎ టైం టు లవ్' చూస్తున్నప్పుడు మన నించి మనం విడిపోతాం. సినిమాలో భాగమై అనేకానేక సార్లు మనసులోనే దు:ఖిస్తుంటాం.



మోసెన్, పరి దంపతులకు ఇద్దరు మగబిడ్డలు. పెద్దవాడు బాబాక్. రెండో వాడు అఫ్సాని. చిన్నోడితో అప్యాయంగా మాట్లాడే తండ్రికి పెద్దవాడు బాబాక్‌తోనే సమస్య. వికలాంగుడిగా పుట్టడమే ఆ పిల్లాడి దురదృష్టం. "నా ముద్దుల కొడకా" అని తల్లి పరి బాబాక్

మీద ప్రేమ చూపిస్తుంది. ప్రేమ లేదని కాదుగానీ తండ్రి మాత్రం ఈ స్థాయిలో కొడుకు మీద ప్రేమ చూపించలేకపోతాడు. బాబాక్‌ను ఒక గదికి పరిమితం చేస్తాడు. ఒకరోజు బాబాక్‌ను రహస్యంగా తీసుకువెళ్లి కేరింగ్ సెంటర్‌లో చేర్పించి వస్తాడు. చిన్న కొడుకు అఫ్సాని ద్వారా విషయం తెలుసుకున్న పరి కొడుకును వెదుకుతూ పరుగెడుతుంది. ఇంతలో కిందా మీద పడుతూ బాబాక్ ఎక్కడి నుంచో వచ్చి తల్లిని కౌగిలించుకొని భోరుమని ఏడుస్తాడు. ఇది చూసి తండ్రి కూడా కంటతడి పెట్టుకుంటాడు. అప్పటి వరకు ''ఈ తండ్రికి హృదయం లేదు'' అనుకున్న మనం మరో అభిప్రాయానికి వస్తాం. అఫ్సాని పుట్టినరోజుకి ఇంటికి వచ్చిన అతని ఫ్రెండ్ మజీద్ బాబాక్‌ను చూసి ఆశ్చర్యపోతాడు. "మీలాగా నాకు చదువుకోవాలని ఉంది" అంటాడు బాబాక్.

చదువులో వెనుకబడిన అఫ్సానికి ట్యూషన్ చెప్పడానికి మజీద్ తరచుగా ఇంటికి వస్తుంటాడు. మజీద్ రహస్యంగా బాబాక్‌ను కలుసుకొని చదువు నేర్పిస్తుంటాడు. ఇంట్లో ఎవరూ లేనిది చూసి మజీద్ బాబాక్‌ను స్కూలుకు తీసుకెళతాడు. బాబాక్ హావభావాలను చూసి పిల్లలు పెద్దపెట్టున నవ్వుతారు. మజీద్ ద్వారా బాబాక్ దీనస్థితిని తెలుసుకున్న స్కూల్ టీచర్ అతని తల్లిదండ్రులకు దగ్గరకు వెళ్లి మంచిమాటలు చెబుతుంది. రోజూ వాళ్ల ఇంటికి వచ్చి బాబాక్‌కు చదువు నేర్పిస్తుంది. ఇది చూసి తండ్రి నిర్ణయంలో మార్పు వస్తుంది. బాబాక్‌ను స్కూల్లో చేర్పిస్తాడు. ఇది నచ్చని అఫ్సానీ ఇంట్లో నానా యాగీ చేస్తాడు. బాబాక్ మాత్రం తన ప్రేమతో అఫ్సానీని జయిస్తాడు. వాళ్లిద్దరూ ప్రేమగా కలిసిపోతారు. ఈ దృశ్యాన్ని దూరం నుంచి చూస్తూ తల్లి పడే సంతృప్తితో సినిమా ముగుస్తుంది.

## ది బ్లూ అంబ్రెల్లా

### మనిషిలోని ఆశను ఊయలలూపే నీలిగొడుగు

తన సంగీతంతో వీనుల విందు చేసే విశాల్ భరద్వాజ్ 'బ్లూ అంబ్రెల్లా' సినిమాతో కనువిందు చేశారు. బినయ అనే అమ్మాయి తన మెడలో ఉన్న జంతర్ (లాకెట్)ను ఒక టూరిస్ట్‌కు ఇచ్చి ఆమె దగ్గరి నుంచి నీలిరంగు గొడుగు తీసుకుంటుంది. ఆ గొడుగేలోకంగా మారుతుంది.



చిన్న దుకాణం నడిపే నందుచాచా అమ్మాయి దగ్గర ఉన్న అందమైన గొడుగుపై మనసుపడి దాన్ని దొంగిలిస్తాడు. ఆ గొడుగు రంగు మార్చి ఊరివాళ్లను మోసంచేస్తాడు. ఒకరోజు నిజం తెలిసి ఊరివాళ్లు అతనికి కఠినమైన ఆంక్షలు విధిస్తారు. నందకిశోర్... ఛత్రికా చోర్ అయిపోతాడు. అప్పుడు అతని దుకాణంలో వస్తువులను కొనడానికి ఒక్క మనిషి కూడా రాడు. ఎవరూ అతనితో మాట్లాడరు. నందు కన్నీళ్లు బినయ మనసును తాకుతాయి.

తనలో తాను ఒంటరిగా నలిగిపోతున్న నందుచాచా దగ్గరికి వచ్చి మిఠాయి కొంటుంది. మాటలు కలుపుతుంది. తనకు ఇష్టమైన గొడుగును కావాలనే మరిచిపోయి వస్తుంది. బినయ ఔదార్యం నందుచాచాను కదిలించడంతో సినిమా ముగుస్తుంది. కథలో ప్రధానమైన 'నీలి గొడుగు' కేవలం గొడుగు మాత్రమే కాదు. మనిషి చుట్టూ తిరిగే అనేక అంశాలకు అది బలమైన ప్రతీక. ఎక్కడైనా, ఎప్పుడైనా నీలి గొడుగు ఉండనే ఉంటుంది. అది ఏ రూపంలోనైనా ఉండొచ్చు. అంతస్తు, కోరిక, దురాశ, ప్రేమ, క్షమాగుణం, పశ్చాత్తాపం... ఇలా సకల విలువల సారాన్ని ఈ సినిమా అంతర్లీనంగా ప్రతిబింబిస్తుంది.

గొడుగు పోయినప్పుడు బినయ స్పందన, తన కొట్టులో వస్తువులను కొనాల్సిందిగా నందుచాచా పిల్లలను బతిమిలాడే పద్ధతి, పెళ్లి ఊరేగింపులో అతనికి జరిగిన అవమానం మనసును కదిలించే దృశ్యాలు. నందు అసిస్టెంట్ రాజారామ్ మాటలు, పామును చూస్తూ వస్తాదు భయపడే తీరు నవ్వు తెప్పిస్తాయి. గ్రామీణ యాసలో నందుచాచా మాటలు అక్కడక్కడా పొట్టచెక్కలు చేస్తాయి. నందుచాచాగా పంకజ్‌కపూర్ మచ్చ లేని నటన ప్రదర్శించారు. బినయగా చేసిన శ్రేయ శర్మకు నటిగా మంచి భవిష్యత్ ఉంది. గుల్జార్ పాటలు మనకు రెండు రెక్కలు ఇచ్చి మబ్బుల్లోనూ, మంచుకొండల్లోనూ తిప్పుతాయి.

## సిరి రాజ సిరి

### పల్లె పిల్లవాడి ప్రతిభకు ప్రతిబింబం

'సిరి రాజ సిరి' సినిమా మనకు పరాయి చిత్రంలా కనిపించదు. మన తెలుగు సినిమాలా అనిపిస్తుంది. శ్రీలంక ద్వీపంలోని కిరిబందిని అనే మారుమూల పల్లెకు చెందిన బీదింటి పిల్లాడు సిరిమల్ బండారు తన తెలివితేటలతో కొలంబోలోని ప్రసిద్ధమైన స్కూల్‌లో సీటు తెచ్చుకుంటాడు. తొలిసారిగా అమ్మా, నాన్నలకు దూరంగా



ఉండవలసిరావడంతో సిరిమల్ ఒంటరితనానికి గురవుతాడు. షెహన్‌లాంటి గొప్పింటి బిడ్డ తరచు చిన్నచూపు చూస్తుంటాడు. నాటకం కోసం పిల్లలను ఎంపిక చేసుకునే సందర్భంలో రాజు పాత్రకు పిల్లలెవరూ డైలాగ్ సరిగా చెప్పకపోతే సిరిమల్ చెప్పి టీచర్ చేత శభాష్ అనిపించుకుంటాడు. 'రాజు' వేషం వేసే అవకాశాన్ని దక్కించుకుంటాడు. అయితే పాత్రధారులు తమ పాత్రకు సంబంధించిన



డ్రెస్ తామే కొనుక్కోవాలి. ఇందుకయ్యే ఐదు వేల ఐదు వందల రూపాయల 'రాజు' దుస్తులను కొనడానికి సిరిమల్ దగ్గర డబ్బు ఉండదు.

సమస్య నుంచి బయటపడడానికి ఒక ఉపాయాన్ని టీచర్ సిరిమల్‌కు చెబుతాడు. తీరా నాటకం వేసే సమయంలో కిరీటానికి ఆధారంగా పెట్టుకోవల్సిన రింగ్ ఎవరో దొంగిలించడంతో రాజు వేషం వేయాల్సిన సిరిమల్ రాజద్రోషి వేషం వేస్తాడు.

'రాజు' వేషం కోల్పోయినందుకు బాగా ఏడుస్తాడు. అలానే నటిస్తాడు. జడ్జీల మనసులు దోచుకొని బహుమతి గెలుచుకుంటాడు. బహుమతి తీసుకునే సమయంలో అసలు విషయం చెబుతాడు. అది విని అందరూ చలించిపోతారు. తల్లిదండ్రులు, ఊరి వాళ్ల సమక్షంలో సిరిమల్ రాజు వేషం వేసి కోరిక తీర్చుకుంటాడు. తన నట విశ్వరూపాన్ని చూపడంతో సినిమా ముగుస్తుంది. రెండు ప్రపంచాల మధ్య వైరుధ్యాలను బయటపెట్టిన ఈ సినిమా... సౌకర్యాల విషయంలో గ్రామం వెనుకబడి ఉండొచ్చుగానీ ప్రతిభ విషయంలో ఎంత మాత్రం వెనుకబడిలేదని సిరిమల్ పాత్ర ద్వారా చెప్పకనే చెబుతుంది.

పల్లె అందాలను పసందుగా చిత్రీకరించిన ఈ సినిమాలో శ్రీలంక సంప్రదాయ సంగీత రీతులను నేపథ్యంలో వినిపించడం ద్వారా ప్రేక్షకులను మరో లోకాల్లోకి తీసుకువెళ్లారు ముఖ్యంగా 'రాజు' నోట వినిపించే పాట అద్భుతం. 'నా సొంత అనుభవాల్లో నుంచి పుట్టిన కథ ఇది' అని దర్శకుడు సామరత్నే దిశనాయకే చెప్పారు. సిరిమల్ పాత్రకు కోకిల జయసూర్య వన్నె తెచ్చాడు.

## దుర్గి

### దురాచారంపై పిడికిలి

ఆచారాల పేరుతో జరిగే అన్యాయాలు ఎలా ఉంటాయో ఈ సినిమాలో చూడవచ్చు. ఒక గూడెంలో అమ్మవారి జాతర రోజు ఏ అమ్మాయి నుదుట అయినా ఎవరైనా బొట్టు పెడితే, ఆ అమ్మాయిని పెళ్లి చేసుకున్నట్లే. ఆమె ఇష్టాయిష్టాలతో పని లేదు. ప్రశ్నించడానికి వీలు లేదు. ఈ దురాచారానికి 'దుర్గి' అనే అమ్మాయి బలైపోతుంది. 50 సంవత్సరాల పెంచలయ్య జాతర రోజు ఆమె నుదుట బొట్టు పెడతాడు. దుర్గిని తన భార్యగా ప్రకటించుకుంటాడు.



టీచర్ వల్ల వచ్చిన చైతన్యంతో, పోలీస్ ఆఫీసర్ సహకారంతో దుర్గి పోరాడి విజయం సాధిస్తుంది. ఆదర్శంగా నిలుస్తుంది. ఆనంద్ డైరెక్టర్ చేసిన ఈ సినిమాకు అందెశ్రీ అందమైన పాటలు రాశారు. దుర్గిగా బేబీ జ్యోత్స్న నటన బాగుంది.

## హాఫ్ మైన్ ! హాఫ్ యువర్స్ !!

### ఆద్యంతం నాన్‌స్టాప్ నవ్వులు

102 నిమిషాల ఈ ఇరాన్ చిత్రంలో దర్శకుడు వాహిద్ నిక్-ఖా అజాద్ రెండు నిమిషాలు మాత్రం దయతలిచి ఉంటాడు. మిగిలిన వంద నిమిషాలు వెయ్యి నవ్వులు నవ్వుతాం మనం. ఇద్దరు భార్యల బహరం వఫాయి జీవితంలో నిగందరగోళానికి హాస్యం తగిలించి ప్రేక్షకులు మీదికి వదిలారు.



ఆ నవ్వుల పువ్వుల వర్షం సినిమా ముగిసే వరకు మనపై కురుస్తూనే ఉంటుంది. ఇద్దరు భార్యలు మెహ్రి, పర్విన్‌ల మధ్య జరిగే సన్నివేశాలు, పిల్లల ముద్దుమాటలు, బహరం సోదరిని ప్రేమించిన సరాఫి తుమ్ములు, స్కూల్ టీచర్ హార్ట్ ఎటాక్ ఎపిసోడ్... ఒకటి కాదు రెండు కాదు నాన్ స్టాప్‌గా ఈ సినిమా నవ్విస్తుంది. 'రహస్యం ఎప్పుడూ నెత్తి మీద బండలా బరువుగా ఉంటుంది. దాన్ని ఎంత తొందరగా కిందికి దింపితే అంత తేలిక పడతాం' అని ఒక పాత్ర చెబుతుంది. ఈ బండ వల్ల బహరంగపడే బాధలను, దాన్ని కిందికి దింపుకున్నాక సంతృప్తిగా ఊపిరి తీసుకున్న క్షణాలను 'హాఫ్ మైన్! హాఫ్ యువర్స్' హా... హా... హా... అని నవ్విస్తూ చూపుతుంది.

## చైల్డ్ అండ్ ది ఏంజిల్

### అక్క, తమ్ముడు - ఒక యుద్ధం

ఫరెస్తా, ఆమె కుటుంబ సభ్యులు ఆమె సోదరి వివాహానికి వెళ్ళాలని 1980 వేసవిలో సన్నాహమవుతారు. అయితే అక్కడ జెట్ ఫైటర్ల దాడి గురించి తెలుసుకుని ఆమె తండ్రి వారి ప్రయాణాన్ని మార్చివేస్తాడు.



ఫరెస్తా నానమ్మ కోసం బయటకు వెళ్ళిన తరుణంలో ఆమె తండ్రి ఇంటిపై బాబు పడుతుంది.ఈ నేపథ్యంలో ఏకాకి అయిన ఆమె తొలుత తన సోదరుడు ఎక్కడున్నాడో కనుగొనే ప్రయత్నం చేస్తుంది.

- టి.నర్మద



# మరిన్ని పనులకు 'ఉపాధి హామీ'

**ఉపాధి హామీ పథకం పరిధిలో మరికొన్ని పనులను చేరుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రహదారులపై ముళ్ల పొదలు తొలగించే అంశానికి సంబంధించి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించారు.**

రహదారులు, నీటిపారుదల కెనాల్స్, కాలువలు పడిన గండ్లను పూడ్చడానికి కూడా ఉపాధి హామీ పనుల్లో అవకాశం కల్పించారు. ఈ పనులు చేపట్టడానికి నిబంధనలు కూడా విధించారు. రహదారులపై పడిన గండ్లు, గుంటలను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఇంజనీర్ల సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామీణ రహదారుల అనుసంధానం కార్యక్రమం కింద చేపట్టవచ్చని స్పష్టం చేశారు.

చిన్న తరహా నీటి పారుదల శాఖ ఇంజనీర్ల సాంకేతిక సహకారంతో కాలువలు, డ్రెయిన్ల గండ్ల పూడ్చివేత పనులు పంచాయతీలు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ పనులు చేయడానికి విధిగా గ్రామసభ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శ్రీమతి శాంతికుమారి జిల్లాల కలెక్టర్లు, డ్వామా అధికారులకు పంపించిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రహదారుల పక్కన ఉన్న పొదలను తొలగించడానికి ఇదివరికే ఉపాధి హామీ పథకంలో అనుమతించారు. అయితే ముళ్ల కంపలను తొలగించడానికి దీనిని వర్తింపచేయాలని నిర్ణయించి ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతానికి ఇది కేవలం పశ్చిమగోదావరి జిల్లాలో మాత్రమే అమలు చేస్తారు. ముళ్ల పొదల తొలగింపును ఆర్ అండ్ బీ రహదారులు ఉన్న చోట ప్రతిపాదించరాదు. మెటల్ రహదారులపై మాత్రమే తొలగింపునకు అనుమతిస్తారు. సంవత్సరంలో ఒకసారి మాత్రమే ఈ పనిని చేపట్టాలి. రహదారుల పక్కన తొలగించిన ముళ్లపొదలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా వాటిని కాల్చాలని సూచించారు. ఈ పనులు చేపట్టడానికి ముందు, తర్వాత విధిగా ఫొటోలు తీయాల్సి ఉంటుంది.

## నాలుగు జిల్లాల్లో పూర్తి పారిశుధ్యం

నాలుగు జిల్లాల్లో ఎంపిక చేసిన మండలాల్లోని గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం కింద ప్రయోగాత్మకంగా పూర్తి పారిశుధ్యాన్ని చేపట్టాలని గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. ఉపాధి హామీ పథకంలో ఇప్పుడు కూలీకి రూ.100 చెల్లిస్తున్నారు. అయితే పారిశుధ్య పనిలో పాల్గొనే కూలీలకు మాత్రం రోజు కూలీ రూ. 150గా నిర్ణయించారు. 150 రూపాయల్లో 100 రూపాయలు కూలీగా, 35 కలుషిత పర్యావరణ అలవెన్స్‌గా, మరో రూ.15 సబ్బు నూనెల కోసం చెల్లించనున్నారు.

గ్రామ పంచాయతీ జనాభా ఆధారంగా కూలీల సంఖ్యను నిర్ణయించారు. నెలలో ఆరు రోజులపాటు వీరు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. 2,500 జనాభా ఉన్న పంచాయతీల్లో 10 మంది కూలీలు నెలలో ఆరు రోజులు, 2,500–5,000 మంది జనాభా ఉన్న గ్రామాల్లో 15 మంది కూలీలు ఆరు రోజులు, ఐదు వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో 20 మంది కూలీలు నెలలో ఆరు రోజులపాటు పనులు చేపడతారు. చెత్తను తరలించడానికి, ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకోవడానికి కూడా అనుమతినిచ్చారు. పశ్చిమగోదావరి, వరంగల్, రంగారెడ్డి అనంతపురం జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు.

– ఆర్.కె.







# రైతు నేస్తం~ మన వ్యవసాయ విశ్వవిద్యాలయం

**మన రాష్ట్రప్రభుత్వం రైతుల అభివృద్ధే ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. అదే స్ఫూర్తితో ఆచార్య ఎన్. జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తృత పరిశోధనల ద్వారా రైతుకు సాంకేతిక పరిజ్ఞానం అందించడం,ఉత్తమ విద్యార్థులను రూపొందించడమే కాకుండా నేరుగా రైతులకు శాస్త్రవేత్తల ద్వారా సేవలను అందించడం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. వీటిని రైతాంగం అందరూ తెలుసుకొని ఉపయోగించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది.**

*ఏరువాక కేంద్రాలు:* ప్రతి జిల్లాలో జిల్లా స్థాయి మార్కెట్ యార్డ్‌లో ముగ్గురు వ్యవసాయ శాస్త్రవేత్తలను రైతులకందుబాటులో వుండేట్లు చేసింది. వీరు నేరుగా గాని, ఫోన్ ద్వారా గాని రైతులకు సలహాలు అందించడం, శిక్షణ తరగతులను నిర్వహించడం, ఆధునిక పరిజ్ఞానాన్ని రైతులకు చూపేందుకు రైతుపొలాల్లో ప్రదర్శనా క్షేత్రాలను ఏర్పాటు చేయడం, సమస్యాత్మక పొలాలను సందర్శించి సలహాలివ్వడం, జిల్లా వ్యవసాయ అధికారులకు ఎప్పటికప్పుడు విశ్వవిద్యాలయంలో రూపొందించిన పరిజ్ఞానం గురించి వివరించడం, రైతు సమస్యలను పరిశోధనా విభాగానికి అందించి వాటికి పరిష్కారం కనుగొనడం మొదలైన ఎన్నో కార్యక్రమాల ద్వారా రైతులకు సేవ చేస్తున్నారు. జిల్లాలోని వివిధ పంటల మీద ఎప్పటికప్పుడు చేపట్టవలసిన వివిధ యాజమాన్య పద్ధతుల గురించి, చీడపీడల ఉధృతి గురించి స్థానిక వార్తా పత్రికల ద్వారా, దూరదర్శన్ ద్వారా రైతులకు సమాచారం చేరవేస్తున్నారు.



*కృషి విజ్ఞాన కేంద్రాలు:* దాదాపు అన్ని జిల్లా కేంద్రాలలోను కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి, అన్ని శాస్త్రీయ విభాగాలకు సంబంధించిన శాస్త్రవేత్తలను అందుబాటులో ఉంచారు. వీటి ద్వారా రైతుకు స్వయం ఉపాధి పెంపొందించుకొనే దీర్ఘకాలిక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రంలోనే కాకుండా, దేశంలోని వివిధ ప్రాంతాలలో రూపొందించిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వారి దగ్గరవున్న 50 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ప్రదర్శనా క్షేత్రాలుగా ఏర్పాటు చేస్తారు. ఈ కేంద్రాలలో రైతులు బస చేయటానికి హాస్టల్ వసతి, ఉచితంగా భోజన వసతి సౌకర్యం వుంటుంది. కావున రైతులు ఏవైనా వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం కోసం వారికి కావలసిన విషయ పరిజ్ఞానంపైన శిక్షణ పొందవచ్చు.

*కిసాన్ కాల్ సెంటర్:* రైతులు తమ సమస్యలు పరిష్కరించుకోవడం కోసం ఏరువాక కేంద్రాలకు కాని, కృషి విజ్ఞాన కేంద్రాలకు కాని, పరిశోధనా సంస్థలకు కాని ఫోను చేసి నేరుగా శాస్త్రవేత్తలను సంప్రదించి వారి సమస్యకు పరిష్కారం కనుగొనవచ్చు. ఈ సౌకర్యాన్ని మరింత అందుబాటులోనికి తెచ్చేందుకు మన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రెండు ఉచిత ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయడమైనది. 1100, 1551, 1800-180-1551 నంబర్లకు ఫోన్ చేసి శాస్త్రవేత్తలతో, తమ సమస్యల గురించి చర్చించి పరిష్కార మార్గాలు పొందవచ్చు. ఈ ఫోన్ నంబర్లలో నైపుణ్యం కలిగిన, అన్ని విభాగాలకు సంబంధించిన శాస్త్రవేత్తలు రైతులకు ఉదయం నుండి రాత్రి వరకు అందుబాటులో వుంటారు.

*వ్యవసాయ సాంకేతిక సమాచార కేంద్రం (ATIC)*: ఇది యూనివర్సిటీ కేంద్రమైన రాజేంద్రనగర్, హైదరాబాద్‌లో వుంది. ఇందులో విశ్వ విద్యాలయం ద్వారా రైతులకవసరమైన ప్రచురణలు రూపొందించి అమ్మడం, వివిధ పరిశోధనా స్థానాలలో రూపొందించిన విత్తనాలను రైతులకు అందుబాటులో వుంచడం, యూనివర్సిటీకి సంబంధించిన పూర్తి సమాచారం అందించడం, రైతులకు సాంకేతిక సలహాలందించడం మొదలైనవి జరుగుతున్నది. ఈ కేంద్రంలో యూనివర్సిటీ రూపొందించిన,

## ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని జిల్లా వ్యవసాయ సలహా, విస్తరణ కేంద్రాలు

| | | | |
|---|---|---|---|
| వ్యవసాయ మార్కెట్ యార్డ్, అనంతపురం | 08554-277963<br>9989623812 | వ్యవసాయ మార్కెట్ యార్డ్, గుంటూరు | 0863-2246048<br>9989623806 |
| ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం<br>అనకాపల్లి | 08924-221711<br>9989623892 | వ్యవసాయ మార్కెట్ యార్డ్, చిత్తూరు | 08572-245112<br>9989623809 |
| వ్యవసాయ మార్కెట్ యాడ్, అదిలాబాద్ | 08732-230797<br>9989623816 | రుద్రనిలయం, రాయగిరి<br>నల్లగొండ | 08682-226547<br>9989623815 |
| ఆముదాల వలస, శ్రీకాకుళం జిల్లా | 08942-287720<br>9989623800 | వ్యవసాయ మార్కెట్ యార్డ్<br>నిజామాబాద్ | 08462-223575<br>9989623817 |
| వ్యవసాయ మార్కెట్ యార్డ్, ఏలూరు | 08812-248543<br>9989623804 | వ్యవసాయ మార్కెట్ కమిటీ, నెల్లూరు | 0861-2314052<br>9989623808 |
| వ్యవసాయ మార్కెట్ యార్డ్<br>త్రోవగుంట, ఒంగోలు | 08592-220788<br>9989623807 | వ్యవసాయ మార్కెట్ యార్డ్, మచిలీపట్నం | 08672-250629<br>9989623805 |
| వ్యవసాయ మార్కెట్ యార్డ్, కడప | 08562-252389<br>9989623811 | వ్యవసాయ మార్కెట్ యార్డ్<br>మహబూబ్‌నగర్ | 08542-279156<br>9989623820 |
| వ్యవసాయ మార్కెట్ యార్డ్, కరీంనగర్ | 0878-222151<br>9989623818 | వ్యవసాయ మార్కెట్ యార్డ్<br>వరంగల్ | 0870-2445410<br>9989623814 |
| వ్యవసాయ మార్కెట్ యార్డ్, కర్నూలు | 08518-281813<br>9989623810 | వ్యవసాయ మార్కెట్ యార్డ్<br>విజయనగరం | 08922-228812<br>9989623801 |
| నడికుదురు, కాకినాడ,<br>తూర్పుగోదావరి జిల్లా | 0884-2348780<br>9989623803 | వ్యవసాయ పరిశోధనా స్థానం<br>సంగారెడ్డి, మెదక్ జిల్లా | 08455-278277<br>9989623819 |
| వ్యవసాయ మార్కెట్ యార్డ్, ఖమ్మం | 08742-256188<br>9989623813 | కూరగాయల మార్కెట్ యార్డ్<br>గుడిమల్కాపూర్, హైదరాబాద్ | 040-23513182<br>9989623821 |



వివిధ పంట రకాల నమూనాలను, చిత్రపటాలను, వ్యవసాయ పనిముట్లు, ఇతర సాంకేతిక అంశాల ఫోటోలు, నమూనా రూపంలో సమాచార, ప్రదర్శనా కేంద్రంగా తీర్చిదిద్దడం జరిగింది. నూతన పరిశోధనా ఫలితాలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియ పరిచే ఉద్దేశంతో ప్రతినెల 'వ్యవసాయం' పేరుతో ఒక మాస ప్రతికను ముద్రించి, రైతులకు పది రూపాయలకు అమ్మడం జరుగుతుంది. ఈ సమాచార కేంద్రాన్ని 040-24015380 లేదా 9989625242 నంబరు ద్వారా సంప్రదించవచ్చు.

***ఎలక్ట్రానిక్ మీడియా వింగ్ :*** దేశంలో ప్రప్రథమంగా ఇటువంటి కేంద్రాన్ని ఏర్పాటుచేసి రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని దూరవిద్య ద్వారా అందుబాటులోకి తేవడం జరిగింది. ఈ కేంద్రం ద్వారా విశ్వవిద్యాలయం వారు దూరదర్శన్, ఇతర తెలుగు టివి చానళ్ళ ద్వారా వ్యవసాయానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని దృశ్య , శ్రవణ రూపంలో చిత్రీకరించి ప్రసారం చేయడం జరుగుతుంది. ఇంతేకాకుండా ప్రతి పంటకు సంబంధించిన పూర్తి సాగు పద్ధతులను 'సీ.డి' రూపంలో తయారుచేసి రైతులకు అందుబాటులో వుంచడం జరుగుతుంది. ప్రత్యక్ష ప్రసారాల ద్వారా దూరదర్శన్‌లో ప్రతి బుధ శుక్ర వారాలలోను, టీవీ-5 ఛానల్‌లో ప్రతి గురువారం వివిధ పంటలకు సంబంధించిన శాస్త్రవేత్తలతో రైతులు తమ సమస్యల గురించి నేరుగా మాట్లాడవచ్చు.

రైతులు ఫోన్ చేయవలసిన నంబర్లు - దూరదర్శన్ 040-27031431/27031432/33; టీవీ 5-9959555116, 9959555117. ఇవేకాక రేడియో ద్వారా ప్రతిరోజూ సాయంత్రం 6.50 నుండి 7 గంటల వరకు 'వ్యవసాయ సూచనలు' అనే కార్యక్రమం ద్వారా రైతులు దినవారి చేయవలసిన పనుల గురించి వివరాలు తెలుసుకోవచ్చు.

ఇంతేకాకుండా ఈ విశ్వవిద్యాలయం ద్వారా రైతుసదస్సులు, ఆదర్శ రైతులకు శిక్షణా తరగతులు, గ్రామ దత్తత కార్యక్రమాలు, రైతు పొలాల్లో శాస్త్రవేత్తల సందర్శన, కిసాన్ మేళాలు, రైతు చైతన్య యాత్రలు మొదలైన ఎన్నో విస్తరణా కార్యక్రమాల ద్వారా ఆచార్య ఎన్. జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతునేస్తమని నిరూపించుకుంటున్నది.

***- డా॥ వి. అనిత, ఆర్. బాలాజీ నాయక్,***

*ఎలక్ట్రానిక్ మీడియా వింగ్, ఎఆర్ఐ, ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్*

# గుర్తించని త్యాగానికి గుడ్‌బై

## - శీలా వీర్రాజు

**"ఓ మహారాణీ! తీరిగ్గా ఆ తర్వాత చదువుకుందువుగానిలే. ముందా డాబామీద ఎండబెట్టిన వడియాలు పట్టుకురా, వర్షం వచ్చేట్టు వుంది".**

**తలెత్తి చూసింది కస్తూరి. నోటితో వేసిన ఆజ్ఞని కళ్ళతో ఖాయపరుస్తున్నట్టుగా చూస్తూ నిల్చుంది తల్లి.**

**'నిజమే. తను మహారాణియే. విశాల హృదయ సామ్రాజ్యానికి తను మహారాణిననే సంగతి అమ్మకు తెలిసుండదు. తెలిసుంటే ఇలా అనుండేది కాదు' -అనుకుంది కస్తూరి.**

**"చేసేవాళ్ళుంటే కాలెలా కదువుతుందీ. గుళ్ళో దేవతలాగా కూచోబెట్టి చేసేవాళ్ళున్నారుగా" చెల్లెలు దమయంతి విసుక్కుంటూ ఎంతకీ కదలని కస్తూరిని కొరకొరా చూస్తూ డాబా మీదకు వెళ్ళింది వడియాలు తీసుకురావడానికి.**

కస్తూరి తనలో తనే నవ్వుకుంది.

'నిజమే. తను దేవతే. తనని గాఢంగా అభిమానించి, ఆరాధించే భక్తుడు ఒకడు వున్నాడనీ, నిజంగా గుళ్ళో దేవతలాగే అరాధిస్తుంటాడనీ, అవసరమైతే ప్రాణాల్ని సైతం తనకు నైవేద్యంగా అర్పిస్తాడనీ చెల్లెలికి తెలీదు. తెలిస్తే అలా అనుండదు' అనుకుంది కస్తూరి.


మెల్లగా లేచి డాబా మీదకు వెళ్ళింది. అప్పటికే దమయంతి వడియాలన్నిటినీ పోగేస్తోంది. కస్తూరి కూడా తనూ చెయ్యివేసి సాయం చేయబోయిందిగాని "ఇంతటి పనిని యిద్దరు చేయాలా. అక్కర్లేదులే, నువ్వెళ్ళు. నేను చేసుకోగలను" అని చెల్లెలు అనేసరికి మారు మాటాడకుండా నిల్చుండిపోయింది.

దమయంతి వడియాలు తీసుకుని కిందకు వెళ్ళిపోయింది.

డాబామీద కస్తూరి ఒక్కర్తే వుంది.

సాయంకాలం మబ్బుల్తో వాతావరణం చల్లగా, ఆహ్లాదకరంగా వుంది. ఆ డాబా అంటే ఆమెకు చాలా యిష్టం. ఆ యింట్లో అమె ఎక్కువగా ప్రేమించేది ఆ డాబానే. అక్కలకన్నా. చెల్లెలికన్నా. తమ్ముడికన్నా, తల్లిదండ్రులకన్నా, ఆమెకు ఆ డాబా అంటేనే ఎక్కువ యిష్టం. ఆ డాబా మీదనుంచి ఆకాశంలోని అందమైన మబ్బుల్ని చూడొచ్చు. నక్షత్రాల్ని చూడొచ్చు. సంతోషం ఎక్కువైతే ఏకాంతంగా కూనిరాగాలు తీసుకోవచ్చు. దు:ఖం ముంచుకొస్తే తనివితీరా ఒంటరిగా ఏడవొచ్చు. అందుకే ఆ డాబా అంటే అమెకు అంత యిష్టం.

కస్తూరి సన్నగా కూనిరాగాలు తీస్తోంది. సంతోషమే తప్ప, సంగీతంలేని కంఠంతో పాటలు పాడ్డం చేతకాని కస్తూరి, కూనిరాగాలు తీస్తోంది! మనసుకు రాగాలతాళ్ళు కట్టి, ఆనందపు ఉయ్యాలవేసి ఊపుతోంది.




డాబా పిట్టగోడదాటి, గోడపక్క బాదంచెట్టు చిటారు కొమ్మదాటి, తెల్లని మేఘాల నల్లంచులు దాటి నీలాకాశంకి ఆ ఉయ్యాల ఊగుతోంది.

ఆమె ఆకస్మాత్తుగా కూనిరాగం ఆపేసింది.

రమణరావు నిజంగా తనని అతని హృదయసామ్రాజ్యానికి మహారాణిని చేసుకుంటాడా? తనని దేవతలా చూసుకుంటాడా? తనది కేవలం భ్రాంతి కాదు కదా?

మూడేళ్ళుగా అతను చూపుతున్న అభిమానాన్ని కస్తూరి గుర్తు చేసుకుంది. అతని కళ్ళల్లో అరాధన,




అభిమానం, అతని మాటల్లో ఆత్మీయత, గౌరవం; అతని చేతల్లో నిజాయితీ, సాన్నిహిత్యం-యివన్నీ ఆమె గుర్తుచేసుకుంది.

క్రితంరోజున అతను యిచ్చిన న్యూ ఇయర్ గ్రీటింగ్ కార్డులో అతను ఏం రాశాడో ఆమెకు కంఠతా వచ్చు. పదిహేనుసార్లన్నా ఆమె దాన్ని చదువుకుంది.

"ఈ నూతన సంవత్సరం అన్ని విధాలా మీకు శుభకరం కావాలనీ, మన పరిచయానికి ఒక అర్థాన్నీ, నిండుదనాన్నీ కలిగించాలనీ హృదయపూర్వకంగా కోరుతూ-

*మీ శ్రేయోభిలాషి,*

*ఎం.వి.బి.రమణరావు"*

ఆ మాటల్లోంచి చూస్తే అతని మనసు కెలిడియోస్కోపులో కనిపించినట్టు అన్ని కోణాల్లోనూ అతి మనోహరంగా, అత్యంత ఆకర్షణీయంగా కనిపించింది. పదేపదే ఆ వాక్యాల్ని ఆమె చదువుకుంది. అవి ఆమెకు కంఠతా వచ్చేశాయి కూడా.

'జీవితాన్ని అసహ్యించుకోవడానికి కాదు, ప్రేమించడానికి, మిమ్మల్ని మీరు ప్రేమించుకోకపోతే, యితరుల్ని మాత్రం మీరెలా ప్రేమించగలరు?' అని చెప్పి తనను తాను అసహ్యించుకోవడం మాన్పి ప్రేమించగలగడం నేర్పాడు. జీవితం మీద నిరుత్సాహాన్ని పోగొట్టి, ఆశగా జీవించడం అలవాటు చేశాడు. తనని ప్రేమించే హృదయం, అభిమానించే చల్లని మనసు ఒకటి వుందని మెల్లమెల్లగా తెలిసి వస్తున్నప్పుడు తన చుట్టూ పాతుకున్న నిరాశముళ్ళ కంచెల్ని ఒక్కొక్కటే తీసిపారేసి, నచ్చిన పూల మొక్కల్ని నాటుకుంది. వాటికి ఆత్మీయానురాగాల్ని ఎరువులుగా వేసి ఏపుగా పెంచింది. ఎప్పుడో అవి అందమైన రంగుల పూలను పూయడం మొదలెడతాయి. ఆహ్లాదకరమైన రకరకాల సువాసనల్ని వెదజల్లుతాయి. ఆ రోజు గురించే ఆమె ఆశగా ఎదురుచూస్తోంది.

నిజానికి ఆమె నిరీక్షణకు ఆవిడే పూర్తిగా బాధ్యురాలు. ఎన్నోసార్లు రమణరావు ఆమెను "మీతో ఓ ముఖ్యవిషయం మాట్లాడాలి. మీకు వీలెప్పుడో చెప్పితే ఎక్కడికైనా వెళ్ళికూచుని మాట్లాడుకుందాం" అని అడిగాడు. అతను చెప్పదలచుకున్నదేమిలో ఆమె ఊహించగలదు గనుక అలాగేలెండి అంటూ దాటేస్తూ వచ్చింది.

అలా దాటేయడానికి కారణం ఆమె పరిస్థితులే.

వర్షం ప్రారంభమైంది. ఒకటీ ఒకటీ చొప్పున చినుకులు రాలుతున్నై.

కస్తూరి వెళ్ళిపోదామని వెనక్కు తిరిగింది. మెట్ల దగ్గర పైమెట్టుమీద నిలుచుని వుంది కస్తూరి చిన్నక్క-రేవతి.

"అయిపోయిందా ఊహావిహారం. అరడజను సార్లయినా పిలిచాను. పలికితేనా? ఏ రాకుమారుడి ధ్యాసలో వున్నావో మరి, వెంటనే వినిపించుకోడానికి. సరేగాని అమ్మ పిలుస్తోంది పద."

కిందకు దిగిపోయింది కస్తూరి. తల్లి దగ్గరకు వెళ్తే-

"మరేం లేదు, నీకు పండక్కు అడ్వాన్సు యిస్తారు గాబోలు, దాని గురించి దరఖాస్తు పెట్టలేకపోయావా. పెద్దపండగ దగ్గర పడుతోందికదా, మీ చిన్న బావకి పండక్కి డబ్బు పంపించాలి" అంది తల్లి.

పెళ్ళి కాకుండానే యిలా పెట్టుపోతలవీ ఎందుకో అర్థంకాలేదు కస్తూరికి. ఏమన్నా అంటే చిన్నక్క అన్నం తినడం మానేస్తుంది. అంతటితో సరిపెట్టే రకం కూడా కాదు. తనని చూసి అసూయపడిపోతున్నావ్ అని ముఖం ఎదుటే అనేస్తుంది. మూడు నాలుగుసార్లు అలా అనేసిందికూడా. నిజానికి ఆ సంబంధం స్థిరపడడానికి తనే కారణం అనే సంగతి చిన్నక్కకీ తెలుసు. తల్లికి యిష్టం లేకపోతే తనే నచ్చజెప్పి ఒప్పించిన విషయం చిన్నక్కకి తెలుసు. ఆ విషయం తెలిసికూడా తను ఆమెను చూసి అసూయపడి పోతోందని అనుకోవడం, అలా నిర్మొహమాటంగా బైటికే అనేయడం ఏమిటి?

అందుకే తల్లి పండగ అడ్వాన్సు గురించి చెప్తే మరోమాట మాట్లాడకుండా "అలాగేలే, రేపు అప్లయి చేస్తాను" అనేసింది కస్తూరి.

నిజానికి ఆమె ఆ డబ్బు గురించి మూడు రోజుల కిందటే అప్లయి చేసింది. ఇంట్లో ఆడపిల్లలున్నారుకదా, కుట్టుమిషను ఒకటి వుంటే బావుంటుందని వాయిదాలమీద కొనుక్కుందామనుకుంది. దానికి ముందుగా డబ్బు కట్టాలంటే ఫెస్టివల్ అడ్వాన్సు గురించి పెట్టింది. ఇప్పుడీ విషయం చెప్పినా ఎవరూ వినరు. కాబోయే చిన్నల్లుడికి బట్టలే ముఖ్యం అంటారు. మాటజారి, అందర్లోనూ చెడ్డదాన్ని కావడం ఎందుకులే అనుకుంది కస్తూరి.

ఆ రాత్రి భోజనం చేశాక వారపత్రిక చదువుదామని తీసి కూచుంది గాని ఆమె ధ్యాసంతా యింట్లోవాళ్ళ చర్చమీదే వుంది. ఆ చర్చ వాళ్ళ నాన్నగారికి వచ్చిన ప్రావిడెంట్ ఫండు గురించి. ఎంట్రీలు సరిగాలేక

రిటైరైన ఏణ్ణర్ధానికి ఆ డబ్బు చేతికివచ్చింది. ఆ డబ్బును ఏం చేయాలా అని చర్చ.

"పెద్దది ఉత్తరం రాసింది కదండీ అల్లుడు హడావుడి చేస్తున్నాడని. ఎలాగూ అతనికి యివ్వాలికదా, ఓ రెండు వేలు పంపించి మిగతాది రెండోదాని పెళ్ళికని బ్యాంకులో వెయ్యండి" అంది కస్తూరి తల్లి.

"దాని పెళ్ళికి ఆ మాత్రం చాలుతుందా, ఎలాగూ వూళ్ళోవున్న ఆ యిల్లు కాస్తా అమ్ముకోక తప్పదు" అన్నాడు కస్తూరి తండ్రి.

"ఏదో దాని పెళ్ళికాస్తా అయిపోతే కాస్తంత ఊపిరి తీసుకోవచ్చు. కస్తూరి గురించి అట్టే ఆలోచించనక్కర్లేదు. ఎలాగూ ఉద్యోగం చేస్తోంది కదా, నెల నెలా నాలుగురాళ్ళు వెనకేసుకోమంటే సరి. ఎటొచ్చీ దమయంతి గురించే చింత అంతాను" అంది తల్లి.

"ఇప్పటినుంచీ ఎందుకే బెంబేలు పడిపోతావ్. దాని చదువు పూర్తయి పెళ్ళిచేయాల్సి వచ్చేసరికి సూరిగాడు చేతికి అందొస్తాడుకదా, మరేం ఫర్వాలేదు" అన్నాడు తండ్రి.

తండ్రికి పెద్ద కూతురంటే యిష్టం. తల్లికి రెండోదీ, నాలుగోదీ అంటే యిష్టం. తమ్ముడంటే నలుగురి ఆడపిల్లల తర్వాత పుట్టాడని యింటిల్లిపాదికీ యిష్టమే. ఎటొచ్చీ తనంటేనే ఎవరకీ యిష్టంలేదు అనుకుంది కస్తూరి. ఉక్రోషంతో అక్కడి నుంచి లేచివెళ్ళి నిద్ర పోదామని పక్కపరచుకుని పడుకుంది.

పడుకుందేగాని ఆమెకు మాటిమాటికీ తల్లిమాటలే గుర్తుకొస్తున్నాయి. తను ఉద్యోగంచేస్తోంది గనుక తన గురించి యింట్లోవాళ్ళు అట్టే పట్టించుకోనక్కర్లేదా? మూడేళ్ళబట్టి ఉద్యోగం చేస్తోంటే ఐదురూపాయలైనా తన గురించి వెనకేసుకోలేకపోయిందే. చిన్నక్కకి చూసిన సంబంధంలాంటిది తనకు రావాలంటే పదివేలు ఎప్పటికి కూడబెట్టుకోగలదు తను? జీతం రాగానే తన ఖర్చుకి పాతిక రూపాయలు తీసుకుని మిగతాది అమ్మచేతుల్లోనే పెడ్తున్నట్టు ఆమెకి తెలుసుకదా. తనెలా దాచుకోగలదని అమ్మ అనుకొంటోంది?

కస్తూరికి తల్లిమీద కోపం వచ్చింది కాని అంతలోనే అది ఎగిరిపోయింది. యింటిపరిస్థితులు తలచుకొన్నప్పుడు తన మీద తనకే జాలేస్తుందికానీ ఎవరి మీదా కోపం రాదు.

రెండేళ్ళ క్రిందట తండ్రి గవర్నమెంటు ఉద్యోగంచేసి రిటైరై ఓ చిన్న ప్రయివేటు ఫర్మ్‌లో చేరాడు. కస్తూరి పెద్దక్క పెళ్ళయి సంసారం చేసుకుంటున్నా, ఆరోగ్యం బాగోలేక తరచు పుట్టింట్లోనే వుంటోంది. కస్తూరి చిన్నక్క టైపిస్టుగా ఉద్యోగం చేసేది. కానీ ఆమెకు పెళ్ళి స్థిరపడ్డాక కాబోయే బావగారు ఆమెను ఉద్యోగం మానిపించేయమన్నారు. అందుకని మానేసింది. వెంటనే పెళ్ళి చేసెయ్యడానికా, అతనికన్నా పెద్దతనికి పెళ్ళికాలేదు. అతనికి అయితేగాని ఈయనకు చేయరు. నాలుగో అమ్మాయి దమయంతి బి.యస్.సి. చదువుతోంది. ఆఖరివాడు సూర్యం, పాలిటెక్నిక్ చదువుతున్నాడు. మరో రెండేళ్ళు పోతేగాని అతను చేతికి అందిరాడు. సంసారం ఖర్చులు ఎక్కువ, ఆదాయం తక్కువ.

'నిజమే అమ్మ చెప్పినట్టు నెలనెలా కొంత బ్యాంకులో వేసుకుని జాగ్రత్త పడ్డం అవసరమే. తనకి కాకపోతే చెల్లెలికైనా ఆ డబ్బు ఉపయోగిస్తుంది. ఇంట్లో ఎంతిచ్చినా మిగలదు' అనుకుంది కస్తూరి.

రేపు జీతం అందుకోగానే ఆ పని చేయాలి-అని నిర్ణయించుకుంది.

మర్నాడు ఆఫీసుకు వెళ్ళినప్పుడు సేవింగ్స్ బాంక్ అకౌంట్ ఎలా ఓ పెన్ చేయాలో ఆ వివరాలవీ రమణరావుని కనుక్కుంది. అతను నవ్వుతూనే "ఏమిటండోయ్ విశేషం . డబ్బు దాస్తున్నారంటే ఏదో స్వార్థం వుందన్న మాటే" అన్నాడు.


"అవసరానికి యింట్లో ఉపయోగిస్తుందనీ" అంది.

ఇంటికొస్తూ అతని మాటల్నే తలచుకొని నవ్వుకుంది. భలే ఊహించేశాడే అనుకుంది.

తల్లికి డబ్బు యిస్తున్నప్పుడు, తన ఖర్చుకి పాతికకాక మరో పాతిక కూడా అట్టే పెట్టుకొని మరీ యిచ్చింది. రేపు ఆఫీసుకి ఓ గంట లేట్ పరిమ్షన్ పెట్టి బ్యాంకుకి వెళ్లాలే అనుకుంది.

తీరా భోజనాల దగ్గర "అక్కా ఓ ఇరవై రూపాయలుంటే యిస్తావా, అర్జంటుగా కావాలి" అని తమ్ముడు అడిగితే "అలాగేరా" అంది.

తమ్ముడంటే ఆమెకు చాలా అభిమానం. స్కూల్ ఫైనల్ అయ్యాక ఇక చదువు ఆపించేసి ఏ టైపో నేర్పి ఉద్యోగంలో పెట్టేద్దామని వాళ్ళ నాన్నగారు అనుకున్నప్పుడు "ఆడపిల్లని చదివిస్తున్నారు కదా, వీడ్నీ చదివించండి" అని చెప్పి, పట్టుపట్టి పాలిటెక్నిక్‌లో చేర్పించింది. చదువుకు అయ్యే ఖర్చులన్నీ



తండ్రే సర్దుకుంటూ వస్తోన్నా చిల్లర ఖర్చులవీ కస్తూరేఖాదుకుంటోంది.

బ్యాంకులో అకౌంటు ఓపెన్ చేయడం వచ్చే నెలకి వాయిదా వేసుకుంది కస్తూరి.

నాలుగైదు రోజుల తర్వాత ఆఫీసులో రమణరావు, మాటల సందర్భంలో "ఇంతకీ బ్యాంకులో ఎంత దాచేరు?" అని అడిగితే-

"ఎక్కడండీ, అనుకోకుండా ఏవో ఖర్చులొచ్చాయి, కుదరలేదు. ఏమిటో ఏదనుకున్నా జరగడం లేదండీ" అంది.

అతను ఆశ్చర్యంగా చూశాడు.

అంత నిరుత్సాహంగా, నిరాశగా యీ మధ్య ఆమె మాట్లాడలేదు. ఆమె కూడా అలా అనాలనుకోలేదు. పొద్దున్న ఆఫీసుకు టైము అయిపోయిందని, వంట కాకపోతే అలాగే వచ్చేసిందేమో మనసంతా చికాగ్గా వుంది.

ఆ రోజంతా ఆమె డల్‌గా కూచోవడం రమణరావు చూశాడు.

సాయంకాలం ఆఫీసు విడిచిపెట్టిన తర్వాత ఇంటికి బయల ్దేరుతుండగా మెట్ల దగ్గర ఎవరూ లేకుండా చూసి మడతపెట్టిన ఓ కాగితం ఆమెకిచ్చాడు రమణరావు. ఎన్నోసార్లు ఎంతో సన్నిహితంగా అతనితో మాట్లాడినా ఎప్పుడూ కలగని భయం ఆనాడు ఆమె ఆ కాగితం అందుకొంటుంటే కలిగింది. దాన్ని హేండ్‌బ్యాగ్‌లో పడేసుకుని గబగబా బస్‌స్టాపుకు వెళ్లింది. బస్సు ఎంతకీ రాకపోతే, వచ్చికూడా ఖాళీలేదని ఎవరినీ ఎక్కించుకోకుండా వెళ్ళిపోతే మరో బస్సు గురించి ఎదురుచూడలేక రిక్షా కట్టించుకుని యింటికి చేరుకుంది. కాళ్ళూ చేతులూ కడుక్కుని హడావుడిగా టిఫిన్ తీనేసి ఆ ఉత్తరం డాబా మీద చదువుకుందామని ఓ వారపత్రికలో పెట్టుకుని వెళ్లింది గానీ, ఆమె వెనకనే చెల్లెలు రావడంతో వీలుపడలేదు. ఇంట్లో ఏకాంతంగా చదువుకునే స్థలం లేకపోవడంవల్ల, వాళ్ళ చిన్నక్క కళ్ళబడకుండా వుండడం కష్టం గనుక అందరూ పడుకునే వరకూ ఆమె ఉత్తరాన్ని విప్పలేకపోయింది.

ఆ ఉత్తరాన్ని విప్పుతున్నప్పుడు ఆమె చేతులు వణికాయి. గుండె గబగబా కొట్టుకుంది.

"కస్తూరిగారూ!

మీతో ముఖ్యమైన విషయం ఒకటి మాట్లాడాలని ఎన్నిసార్లు అడిగినా మీరు దాటేస్తూ వస్తున్నారు. ఈ సారి అలా దాటేయడానికి వీల్లేదు. ఈ విషయం నాకు చాలా ముఖ్యమైనది. చాలా కాలంగా మీకు చెప్పాలనుకుంటున్నది. మీకు చెప్పి, వివరంగా మీతో మాట్లాడాల్సినది.

నేనేం చెప్తానో బహుశా మీరు ఊహించే వుంటారనుకుంటాను.

నా గురించి మీకు బాగా తెలుసు. మూడేళ్లుగా నన్ను చూస్తూనే వున్నారు. నా అంతట నేను ఎవరికీ సన్నిహితంగా వెళ్ళను. కాని ఎందువల్లనో నాకు తెలియకుండానే మీకు సన్నిహితంగా వచ్చేశాను. ప్రేమను గురించి ప్రతివాడూ తేలిగ్గా మాట్లాడే యీ రోజుల్లో నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానని చెప్తే మీరు నవ్వుకోవచ్చు. కాని నేను మాత్రం మిమ్మల్ని చిత్తశుద్ధితో ప్రేమిస్తున్నాను. ఈ విషయం చాలా రోజులకిందటే చెప్పాలనుకున్నా యిప్పటికిగాని వీలుపడలేదు. చాలాసార్లు మీతో తీరిగ్గా మాట్లాడాలని పిలిస్తే మీరు పట్టించుకోకపోవడం వల్ల మీకు యిష్టమో కాదో తెలీక యిలా వుత్తరం రాస్తున్నాను.

రేపు సాయంకాలం వీలుచూసుకుని మీరు వస్తే తీరిగ్గా మాట్లాడుకుందాం. ఆఫీసు ఐపోయాక రామకృష్ణా మిషన్ దగ్గరకు రండి. ఇద్దరు కలిసి బయల ్దేరితే ఆఫీసులో ఏడ్చేవాళ్ళు చాలామంది వున్నారు. ఒకవేళ యిబ్బందనిపిస్తే కొద్దిగా చీకటిపడుతుండగా రండి. మీ గురించి ఎనిమిదింటి వరకు అక్కడే ఎదురు చూస్తుంటాను. ప్రేమను గురించి మాట్లాడుకోడానికి కాదు మిమ్మల్ని అక్కడికి రమ్మనడం, అంతకన్నా ముఖ్యమైన విషయాల్ని గురించి మాట్లాడుకోడానికి. ఇది చాలా అర్జంటు విషయం. ఆలస్యం చెయ్యరని భావిస్తాను. రేపు వీలుంటే, మన బూతద్దం కళ్ళద్దాల సూపర్నెంటు సెక్షనులో లేకుంటే, మరోసారి యీ విషయం మీకు గుర్తుచేస్తాను. తప్పక వస్తారు కదూ!

మీ

రమణరావు

కస్తూరి ఆ వుత్తరాన్ని అలాగే చేత్తో పట్టుకుని చాలాసేపు కూచుండిపోయింది. తొలిసారి నడకనేర్చిన పసిపాప కళ్ళల్లోలాంటి ఆనందం, పడిపోతాననే భయం ఆమె కళ్ళల్లో అల్లుకున్నాయి. ఇంద్రధనస్సు విరిసిన ఆకాశంవేపు ఎగిరిపోతున్న ఊహల్ని భయం పగ్గాలువేసి గట్టిగా బిగించి పట్టుకుంది. పగ్గాలు తెగిపోయాయి. ఊహలు ఎగిరిపోయాయి.

మరోసారి ఉత్తరం చదువుకుని నిద్రపోయింది.

ఉదయం అందమైన కలల పురిటి వాసనల్లోంచి ఒళ్ళు విరుచుకుని లేచింది.

ఎప్పుడూ లేనిది ఆ రోజు ఆఫీసుకు వచ్చేటప్పుడు ఏం చీర కట్టుకోవాలా అని అయిదు నిమిషాలు తటపటాయించింది.

ఆఫీసులో సమయం చూసుకుని రమణరావు "సాయంకాలం వస్తున్నారా?" అని అడిగాడు.

ఆమె సమాధానంగా చిరునవ్వు నవ్వింది.

ఆఫీసు విడిచిపెట్టడానికి పావుగంట ముందుగానే రమణరావు వెళ్ళిపోయాడు, వెళ్ళేముందు వస్తారు కదూ అన్నట్టు కళ్ళతోనే అడిగి మరీ వెళ్ళాడు.

ఆఫీసు విడిచిపెట్టగానే కస్తూరి అక్కడికి బైలుదేరలేదు. ఆలస్యం చేద్దామని బజార్లో పనిచూసుకుని తీరిగ్గా అతను చెప్పిన చోటుకి వెళ్ళేసరికి చిరుచీకటి పడింది. అక్కడ ఆమె గురించిఎదురు చూస్తున్నాడతను.

ఇద్దరూ యిసకలోకెళ్ళి కూర్చున్నారు. సముద్రం మీదనుంచి విరిగిన కెరటాల తుంపర జల్లుజల్లుగా ఎగిరొస్తోంది. గాలి ఒకటే అల్లరి పెడ్తోంది. ఆమె వస్తూ వస్తూ కొనుక్కుని తలలో పెట్టుకున్న సింహాచలం సంపెంగల వాసనలు వాళ్ళ చుట్టూ వలయాలు తిరుగుతూ ఆలోచన్ల ఆటకట్టిస్తున్నాయి.

"ఉదయం ఎప్పుడో భోంచేసి వచ్చారు. ఆకలేస్తోందేమో, ముందు ఈ టిఫిన్ తినండి. తర్వాత తీరిగ్గా మనం మాట్లాడుకుందాం" అన్నాడు రమణరావు టిఫిన్ పొట్లాలు విప్పుతూ.

నిజమే. ఆమెకు ఆకలిగానే వుంది. అందుకే రమణరావంటే ఆమెకు యిష్టం. చాలా ప్రాక్టికల్‌గా ఆలోచిస్తాడతను.

సభ్యతికి 'ఎందుకండీ యివన్నీ' అని అన్నా, అతను ఎదుట పెట్టినప్పుడు మాట్లాడకుండానే తీసుకుంది.


"ఎప్పటినుంచో మిమ్మల్ని యిక్కడకు రప్పిద్దామనుకుంటే చివరికి యివ్వాళ్టికి వచ్చారు" అన్నాడు రమణరావు, తమ చెప్పబోతున్న దానికి నాందిగా.

ఆమె టిఫిన్ తీసుకుంటూ ఆలకిస్తోంది.

"మూడు రోజుల కిందటే యింటి దగ్గరనుంచి వుత్తరం వచ్చింది. 'ఓ

పదిహేను రోజులు సెలవు పెట్టి వస్తే అరడజను వరకు పెళ్ళి సంబంధాలు వచ్చివున్నాయి, చూసుకోవచ్చు' అని మా నాన్నగారు వుత్తరం రాశారు. గత ఏడాది నుంచీ ఆయన వుత్తరాలు రాయడం, నేను సెలవు దొరకలేదనీ, అదనీ యిదనీ చెప్పి దాటేయడం జరుగుతోంది. కాని ఈసారి మాత్రం చాలా ఘాటుగా రాశారాయన. నేను రాకపోతే తనే ఏదో ఒకటి స్థిరపరుస్తారట. అందుకనే నాకూ కంగారు పుట్టింది. మీ నిర్ణయమేమిటో వీలయినంత తొందరగా తెలసుకొని, మీతో వివరంగా మాట్లాడాలని చెప్పి యిలా యిక్కడికి రప్పించాను.

నా విషయాలు యించుమించు అన్నీ మీకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తెలియజేసేవున్నాను. ఈ రెండుమూడేళ్ళ పరిచయంలోనూ మీరు నన్ను చాలా సన్నిహితంగా పరిశీలించే వుంటారు. నా మనస్తత్వం మీకు బాగా అర్థమైవుంటుంది. నన్ను పెళ్ళిచేసుకోవడానికి మీకు ఏమైనా అభ్యంతరం వుంటే చెప్పండి."




కస్తూరి పలబారి దగ్గుతుంటే అతను సోడా కుర్రాడ్ని కేకేసాడు. ఆమె సోడా తాగింతర్వాత ఏం చెప్తుందా అని ఎదురుచూస్తూ కూచున్నాడు. ఆమె ఏమీ చెప్పకపోయేసరికి అతనే మళ్ళీ చెప్పడం మొదలు పెట్టాడు.

"ఈ పెళ్ళికి మొదట్లో మా యింట్లో అభ్యంతరం చెప్పినా ఒకటి రెండేళ్ళలో వాళ్ళే సర్దుకుపోతారు. మావాళ్ళ మనస్తత్వం నాకు బాగా తెలసు. ఒక వేళ వాళ్ళు సర్దుకుపోకపోయినా యిబ్బందేమీ లేదు. వాళ్ళమీద నేనేమీ ఆధారపడి లేను, నా కాళ్ళమీద నేను నిలబడ్డాను. వాళ్ళు కూడా ఆర్థికంగా నా మీద ఆధారపడిలేరు. ఏమంటారు? మనం వివాహం చేసుకోవడం మీకు యిష్టమేనా?"

ఆమె వెంటనే ఏం మాట్లాడలేదు. ఆ మసక వెలుతుర్లో ఆమెనే చూస్తూ మళ్ళీ అదే ప్రశ్న అడిగాడు.

"ఇష్టం లేకపోవడం అంటూ లేదనుకోండి. కాని నా పరిస్థితులే నన్నేమీ మాట్లాడనివ్వడంలేదు.. మీకు తెలీదు రమణగారూ, నాకు చాలా బాధ్యతలన్నాయి" అంది ఆమె.

"బాధ్యతలు ప్రతీవారికీ వుంటాయి. ఆ బాధ్యతల పేరుతో మిమ్మల్ని మీరు కష్టపెట్టుకోవడం బాగోలేదు" అన్నాడు అతను

"అలా కాదులెండీ, నాపెళ్ళికీ వాటికీ సంబంధం వుంది. ఇప్పుడు నేను పెళ్ళి చేసుకుంటే నా స్వార్థాన్నే చూసుకున్నదాన్నవుతాను గానీ నా మీద ఆశలు పెట్టుకున్న యింట్లో వాళ్ళ శ్రేయస్సు ఆలోచించినదాన్ని కాను. మా నాన్నగారు రిటైరై ఏదో చిన్న ప్రయివేటు జాబ్ చేస్తున్నారు. చెల్లెలూ, తమ్ముడూ చదువుకుంటున్నారు. వచ్చే ఎండల్లో మా చిన్నక్క పెళ్లి చేయాలనుకుంటున్నాం. మా పెద్దక్కకి ఎప్పుడూ అనారోగ్యమే. ఇలాంటి పరిస్థితుల్లో నేను పెళ్ళి చేసుకుని, ఆ యింటిని ఎలా గాలికి వదిలేయగలను చెప్పండి? కనీసం రెండేళ్ళపాటయినా నేను యింటిని ఆదుకోవాలి. అప్పటికి మా తమ్ముడు చేతికి అందివస్తాడు. మా చెల్లెలి చదువు పూర్తవుతుంది."

"మీరు ఎంతకాలం ఆగమన్నా ఆగటానికి సిద్ధంగానే వున్నాను. అందుకే మీరు ఎన్నిసార్లు దాటేసినా తొందరపెట్టలేదు. కాని యిప్పటి పరిస్థితివేరు. సంగతంతా మీకు వివరించాను కదా. ఎంతమాత్రం ఆలస్యం చేయడానికి వీల్లేని పరిస్థితి. అందువల్లనే మిమ్మల్ని యిలా తొందరపెట్టి యిరకాటంలో పెట్టాల్సివస్తోంది."

"రమణరావుగారూ! మిమ్మల్ని నేను దూరం చేసుకోవాలనుకోవడంలేదు. మీ అంత మంచివారిని, నన్ను యింతగా అభిమానించే మిమ్మల్ని నేను కలలోకూడా దూరం చేసుకోలేను. కాని ఒక్క విషయం. నా గురించి ఒక్క రెండేళ్ళు మీరు ఓపిక పట్ట లేరూ?"

రమణరావు ఏమీ మాట్లాడలేకపోయాడు, మంచి మాటలతో బంధించేసినట్లుగా అతను యిబ్బందిగా కాస్సేపు కూచుని –

"ఇంతకీ మీరు పెళ్ళిని వాయిదావేయడానికి కారణం మీ బాధ్యతలే కదా. ఓ పని చేయండి. పెళ్ళిచేసుకున్నా రెండేళ్ళపాటు మీ బాధ్యత మీరు నెరవేరుస్తూనే వుండండి" అన్నాడు.

కస్తూరి అర్థంకానట్టు చూసింది.

"మీ తమ్ముడు అందొచ్చేవరకు మీ జీతం మీ వాళ్ళకే యిచ్చేయండి. నా జీతం వుండనే వుందికదా. మనిద్దరికీ ఆ మాత్రం చాలదా?"

"రమణగారూ!...." ఆమె కంఠం బొంగురుపోయింది. భక్తితో, పారవశ్యంతో కంఠం మూగపోయినట్టు ఆమె మాట్లాడలేకపోయింది. ఆముదపు దీపాల మసకవెలుతురులో గర్భగుడిలోని మూలవిరాట్టును చూసినట్టు కళ్ళు పొడుచుకుని మరీ చూసింది అతన్ని.

"ఏమంటారు, అలా చెయ్యొచ్చుకదా, రెండు సమస్యలూ తీరిపోతాయి" అన్నాడు రమణరావు.

"చెయ్యొచ్చుననుకోండి. కాని నా బాధ్యతలు తీరడం ఒక్కటే సమస్య కాదుకదా. ఇంకా ఆలోచించాల్సిన విషయాలు చాలా వున్నాయి. మా చిన్నక్కకి యీ ఎండల్లో పెళ్ళి చేయాలనుకుంటున్నాం. సంబంధం నిశ్చయమైంది. మన పెళ్ళివల్ల అది ఆగిపోయినా ఆగిపోవచ్చు. నాకన్నా పెద్దదానికి పెళ్ళికాకుండా నేనెలా చేసుకుంటాను? అదీగాక యీ పెళ్ళిచేసుకోవడానికి మా వాళ్ళు ఒప్పకోకపోవచ్చు. అలాంటప్పుడు నేనిచ్చే డబ్బు మాత్రం వాళ్ళెందుకు పుచ్చుకుంటారు? పుచ్చుకోరు. అందువల్ల వాళ్ళు చాలా యిబ్బంది పడాల్సి వస్తుంది. మా తమ్ముడు, చెల్లెలు మధ్యలోనే చదువు

ఆపేయాల్సి వస్తుంది. మా తమ్ముణ్ణి బలవంతం చేసి పాలిటెక్నిక్‌లో చేరి ్పించాను. వాడు వృద్ధిలోకి వస్తాడని కొండంత ఆశ పెట్టుకున్నాను. మా చెల్లెలు చాలా తెలివైంది. కాలేజీలో ఎప్పుడూ దానికి ఫస్టు మార్కులు వస్తుంటాయి. వాళ్ల చదువులు మధ్యలోనే ఆగిపోతే వాళ్ళ తెలివితేటలు ఎందుకూ కొరగాకుండాపోతాయి. మా పెద్దక్క రోగిష్టిది. మా బావగారి కి పేకాట, నాటకాలు తప్ప యింటి విషయాలు అక్కరలేదు. అందువల్ల మా అక్క ఎప్పుడూ మా యింట్లోనే వుంటుంది. ఆమె మందులకే బోల్డు ఖర్చవుతుంది. మా నాన్నగారి ఆర్జన యిల్లు గడవడానికే చాలుతుందిగాని పై ఖర్చులకు చాలదు. ఇంకా మా చిన్నక్క పెళ్ళొకటి వుంది. చూశారా ఎన్ని సమస్యలో. ఇవన్నీ నాకు సంబంధించినవి కావులే అని నా స్వార్థం నేను చూసుకోనా? రమణరావుగారూ నన్ను మరోలా అర్థం చేసుకోవద్దు. ఒక్క రెండేళ్ళు నా గురించి ఓపికపట్టండి. ఆ తర్వాత పెళ్ళి చేసుకుందాం. ఏదో విధంగా మీ వాళ్ళకు సర్ది చెప్పండి. ఇటు చూడండి.... నా గురించి ఆ మాత్రం కష్టపడేలేరూ....ప్లీజ్"

రమణరావు కొద్దిసేపు నిదానించి చూసి 'అలాగేలెండి' అన్నట్టు తల వూపాడు.

"మీరు ఎంత మంచివారండీ! మీకు చాలా యిబ్బంది కలిగించాను. క్షమించాలి" అంది కస్తూరి.

"అంత మాటనకండి. మీ పరిస్థితులు కూడా ఆలోచించాలికదా. నేను రేపే యింటికి వుత్తరం రాసేస్తాను.-యిప్పుడప్పుడే పెళ్ళిచేసుకోనని. ఆలోచిస్తే కారణమే దొరక్కపోతుందా" అన్నాడు రమణరావు.

"అన్నట్టు ఈ చాక్‌లెట్స్ తీసుకోండి" అంటూ కస్తూరి హేండ్‌బ్యాగ్‌లోంచి చాక్‌లెట్లు తీసి అతనికిచ్చి, తనొకటి నోట్లో వేసుకుంది.

"మీకింకా చిన్నతనం పోలేదండోయ్" అన్నాడు నవ్వుతూ, ఆమె కూడా నవ్వింది.

దూరంగా సముద్రం మీద లైట్ల వెలుగుల్లో ఓడ ఒకటి అందంగా అలంకరించిన పెళ్ళిపందిరిలా వుంది. ఆకాశంలో నక్షత్రాలు పందిట్లో చాందినీకి వేలాడదీసిన పూలలా వున్నాయి. ఒడ్డున జనం పెళ్ళివారిలా బీచ్ అంతా నిండిపోయారు. దగ్గర్లోనే ఎవరో ట్రాన్సిస్టర్ పట్టుకొచ్చారు గాబోలు, సన్నాయిమేళం సముద్రఘోషలో కలిసిపోయి మరీ సన్నగా వినిపిస్తోంది. ఉండి ఉండి తుంపర్లు అక్షింతల్లా ఎగిరొస్తున్నాయి.

ఆ కబురూ ఈ కబురూ చెప్పుకుంటూ మరో అర్థగంట కూచుని, ఇంటికి వెళ్ళిపోదామని బయలుదేరారు. తన రూము అక్కడికి దగ్గరేనని, నడిచి వెళ్ళిపోతానని చెప్పి ఆమెను రిక్షా ఎక్కించి రమణరావు ఆగిపోయాడు.

అక్కడనుంచి అంతా పల్లమే కావడంవల్ల గాలిలో తేలిపోతున్నట్టు పోతోంది రిక్షా. ఆ రిక్షాలోని కస్తూరి మనసు కూడా అలాగే తేలిపోతోంది.

ఇంటిముందు రిక్షా దిగేసరికి తమ్ముడు వీధిలోనే వున్నాడు.

"సినిమాకు వెళ్ళావా అక్కా, ఏం సినిమాకి?" అని అడిగాడు.

"ఇప్పుడేం సినిమారా. ఇంత తొందరగా ఏం సినిమా విడిచి పెట్తారు. పనుండి ఓ ఫ్రెండ్ దగ్గరికి వెళ్ళాను" అంది కస్తూరి.

"రావడం ఆలస్యమైతే ఏ సినిమాకో వెళ్ళావేమో అనుకున్నాలే" అన్నాడు అతను.

కస్తూరి ఇంట్లోకొచ్చి బట్టలు మార్చుకుందామని అవతలి గదిలోకి వెళ్ళబోతోంటే "ఇవాళ మీ ఫ్రెండ్ అరుణకుమారి కనిపించిందేమిటి? ఇంతకీ ఆ జిగురు కుమారి ఇంత తొందర్లో నిన్ను వదిలిపెట్టిందటే ఆశ్చర్యంగానే వుందే" అంది వాళ్ళ చిన్నక్క.

ఆమె నవ్వేసి గదిలోకి వెళ్ళిపోయింది. తిరిగి తలుపులు తెరుచుకొని యివతలికి వచ్చేసరికి ఇంట్లో వాళ్ళంతా సమావేశమైనట్టుగా నట్టింట్లో ఆమె గురించే చూస్తున్నారు.

"ఎక్కడికెళ్ళావే యింతాలస్యమైంది?" అంది తల్లి

" ఫ్రెండ్ దగ్గరికి వెళ్ళానమ్మా కలిసి చాలారోజులైందని, ఆఫీసునుంచి అలా వెళ్ళాను" అంది కస్తూరి.

"ఎవరా ఫ్రెండ్?" అని అడిగిందామె.

కస్తూరి నోరు తెరిచేలోగానే "ఆఫీసు ఫ్రెండ్ గాబోలు, అవునా అక్కా?" అంది చెల్లెలు.

"ఊ" అంది కస్తూరి, అక్కడ్నుంచి కదిలి ముఖం కడుక్కుందామని దొడ్లో బావిదగ్గరకు వెళ్ళబోతూ.

"మాట్లాడుతుంటే అలా వెళ్ళిపోతావేం. ఎందుకా కంగారు? ఇప్పటిదాకా ఆ బీచ్‌లో షికార్లు చేయగా లేనిది ఇప్పుడు ఎందుకా తొందర?" అంది తల్లి గట్టిగా.

కస్తూరి గతుక్కుమంది. అయినా ఆమె ఆగకుండా దొడ్లోకి వెళ్ళిపోయింది. ముఖం కడుక్కుని తిరిగి వచ్చేసరికి యింకా అందరూ అక్కడే వున్నారు.

"చెప్పవే ఎవరా రమణరావు. వాడితోనేనా యింతసేపూ బీచ్‌లో షికార్లుచేసి వచ్చావ్?"

కస్తూరి ఏం మాట్లాడలేకపోయింది.

"ఏదీ ఆ వుత్తరం ఎక్కడ పెట్టావో పట్టుకు రారా సూర్యం" అంది తల్లి కొడుకును ఉద్దేశించి. సూర్యం అక్కవైపు నవ్వుతూ చూస్తూ వుత్తరం జేబులోంచి తీసిచ్చాడు.

''ఏమిటా వుత్తరం?'' అంది కస్తూరి అదేమిటో స్పష్టంగా తెలిసిపోతున్నప్పటికీ.


"ఏ వుత్తరమా, నువ్వు పుస్తకంలో పెట్టి మర్చిపోయావ్ చూడు -ఆ వుత్తరం" అంది కస్తూరి అక్క.

"సిగ్గులేదటే. ఇదా నువ్వు చేస్తున్న నిర్వాకం. నీకేం పోయేకాలం వచ్చిందని ఇలాంటి పాడుబుద్ధి పుట్టింది. మమ్మల్ని నలుగుర్లోనూ తలెత్తుకు తిరగనియ్యవా. తిండికివున్నా లేకున్నా గౌరవంగా, బ్రతుకొస్తున్నాం. నీ పుణ్యమా అని యిప్పుడు అది కూడా లేకుండా చెయ్.ఇంట్లో పెళ్ళికావలసిన ఆడపిల్లలు వున్నారన్న ధ్యాసయినా వుందా నీకు. వుంటే ఇలా బరితెగిస్తావా. ఛీఛీ, నా కడుపున చెడబుట్టావుకదటే. వాడికెవడికో సిగ్గులేకపోతే నీకయినా సిగ్గు వుండొద్దూ. బుద్ధిలేక వాడు పిలిస్తే కుక్కలా వాడివెనక వెళ్ళడమేనా. నువ్వు అలుసివ్వకపోతే వాడెందుకు ఇలా బరితెగించి వుత్తరం రాస్తాడు. అసలు నన్ననాలి. ఉద్యోగం చేస్తానంటే నాలుగురాళ్ళు తెచ్చి ఇల్లు ఉద్ధరి స్తావనుకున్నాను గాని, ఇలా గౌరవం మంటగలుపుతా వనుకోలేదు.."

కస్తూరి అక్కడ నిలుచోలేకపోయింది. మారుమాట్లాడకుండా డాబా మీదకు వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోయినా తల్లి కంఠం వుండి వుండి భగ్గుమంటోంది. బహుశా ఏ తమ్ముడో, చెల్లెలో, అక్కో ఆజ్యంపోసి రగుల ్చుతున్నారు గాబోలు!

కస్తూరికి తల దిమ్మెక్కి పోయినట్లు అనిపించింది.ఎదురుచూడని దెబ్బ తగిలి తల మొద్దుబారి ఏదీ ఆలోచించలేని మందకొడితనంతో అలా మోకాళ్ళలో తల దూర్చుకుని కూచుంది. ఎంతసేపు కూర్చుందో తెలీదు, కిందనుంచి తండ్రికేక వినిపించి లేచి వెళ్ళింది.

గదిలోకి అడుగు పెడుతూంటే కోర్టు హాల్లోకి కాలెడుతున్న ముద్దాయిలా అనిపించింది. తండ్రి నిప్పులు కక్కుతున్న న్యాయమూర్తిలా వున్నాడు.




తల్లి గుమ్మం దగ్గర పోలీసు జవాన్లా నిలుచుంది. అక్కా, చెల్లెలూ, తమ్ముడూ ప్రేక్షకుల్లాగా, సాక్షుల్లాగా వున్నారు. వాళ్ళందరి చూపులూ ఆమె మీదనే వున్నాయి.

హంతకుడ్ని ఏ మాత్రం జాలీ, సానుభూతీ లేనట్టు చూసే కరకు చూపుల్లా వున్నాయవి. అమాంతం విరుచుకుపడి పొడిచేద్దామన్న విరోధి కసిచూపుల్లా వున్నాయ్. ఆ మూల బైటికొచ్చిన ఎలకను పట్టుకోవడానికి పొంచి పొంచి చూపే గండుపిల్లి దొంగ చూపుల్లా వున్నాయి.

కస్తూరిని చూస్తూనే తండ్రి ఇల్లెగిరిపోయేలా అరిచాడు.

"ఎవడే ఆ రమణరావు? పెళ్ళికాని పిల్లకు ఇలా ప్రేమలేఖలు రాస్తాడా రాస్కెల్. అయినా వాడ్ని ఏం లాభం, నిన్ననాలిగాని, మన బంగారం మంచిదైతే బైటవాన్ననడం దేనికి. ఇలా అడ్డమైన వాడితోనూ షికార్లు కొట్టడానికటే నువ్వు ఉద్యోగం చేస్తున్నది.

ఈ సంసారాన్ని పోషించలేక కాదు నిన్ను ఉద్యోగం చేయిస్తూంట. ఇంట్లో తీరిగ్గా తినికూచోడం ఎందుకులెమ్మని ఉద్యోగం చేయిస్తుంటే నువ్వు వేసే వేషాలు యివన్నమాట. ఇవ్వాళ బీచికి పిలిస్తే వెళ్ళావు. రేపు రూముకి రమ్మంటే వెళ్ళవనేముంది? ఇలా తిరిగి తిరిగి రేప్పొద్దున్న తల మీదకి తెచ్చుకుని నా కొంప నిలువునా కూలుస్తావు కదటే. అంతగా నీకు పెళ్ళే చేసుకోవాలని వుంటే నాతో చెప్పలేకపోయావా, ఆ మాత్రం సంబంధం తెచ్చి చేయలేకపోయేవాడినా, ఇలా అడ్డగాడిదలా వీధిన పడ్డానికి నేనింకా చావలేదే, బతికేవున్నాను."

తండ్రివైపు తలెత్తుకు చూడలేకపోయింది కస్తూరి. ఎంత ఆపుకుందామన్నా ఆమెకు కన్నీళ్ళు ఆగలేదు. ఊరికే పొర్లిపోతున్నాయి.

"అలా నంగనాచిలా ఏడుస్తావెందుకు. చేసింది చాలక ఇదొకటా. చాల్లే ఆ నాటకం. ఇంకెప్పుడైనా ఇలా తిరిగావంటే చూడు ఉద్యోగం మానిపించి ఇంట్లో కూచోబెడతాను"

కస్తూరి అక్కడనుంచి వెళ్ళిపోయి మంచం మీద వాలిపోయి వెక్కివెక్కి ఏడ్చేసింది. ఎక్కిళ్ళు కూడా వస్తున్నాయి. కన్నీటితో తలగడ అంతా తడిసిపోయింది.

"ఇంక చాల్లే ఏడుపు, వచ్చి అన్నం తిను" అంది తల్లి. కస్తూరి లేవలేదు. అలాగే వుండిపోయింది. తల్లి చూసి చూసి "సరే నీయిష్టం, తినాలకుంటే వంట యింట్లో వుంది తిను, నాకు నిద్రవస్తోంది, పడుకోవాలి" అని వెళ్లిపోయింది.

కస్తూరికి ఆకలేస్తున్నా భోజనం చెయ్యాలనిపించలేదు. పక్కమీద అలాగే వుండిపోయింది ఆలోచిస్తూ.

"బాగుంది సంబడం. మొగుడ్ని కొట్టి మొగసాలకెక్కి ఏడ్చిందట –ఇలాటిదే"

"ఆ మధ్య ఓ సారి వాళ్ళాఫీసుకి వెళ్లాను ట్రూకాపీలమీద సంతకాలు పెట్టిస్తానంటే, అప్పుడు చూశాను, వాడితో మాట్లాడుతూ ఒకటే ఇక ఇకలూ, పకపకలూను."

"నేనూ చేసాను ఉద్యోగం. దీనిలా ఊళ్ళేలలేదెప్పుడూ."

"ఒక రోజెప్పుడైనా కాలేజీనించి ఆలస్యంగా వచ్చేసరికి పావుగంట ఉపన్యాసం దంచి శ్రీరంగనీతులు చెప్తుందికదా, ఇప్పుడేమయ్యింది."

అక్కా తమ్ముడూ, చెల్లెలూ, గుసగుసలాడ్డం వినిపిస్తూనే వున్నాయి కస్తూరి కి. ఆమె హృదయం కాలిపోతోంది. బాధతో ఆమె విలవిల్లాడిపోతోంది. ఆ బాధ అమ్మా నాన్నలు గుచ్చిన ముళ్ళబాధ కాదు. తమ్ముడూ, చెల్లీ, అక్కా దించిన గునపాలబాధ అది. ఆ తిట్లముళ్ళకన్నా యీ నిందల గునపాలే గుండెల్లోకి దిగిపోయి ప్రాణం తీసేస్తున్నాయి. ఆ బాధకు ఆమె తట్టుకోలేక మెలికలు తిరిగిపోతుంది.

రాత్రంతా ఆ బాధకి ఆమెకు నిద్రపట్టలేదు.

ఉదయం ఆఫీసుకి వెళ్ళడానికి బద్ధకంగావున్నా లేని వుత్సాహాన్ని తెచ్చుకుని మరీ వెళ్ళింది.

లంచ్ టైమప్పుడు సెక్షన్‌లో అంతా బైటికి వెళ్ళడం చూసి రమణరావు ఓ కవరు పట్టుకొచ్చి "ఇంటికి ఉత్తరం రాస్తున్నానండి. ఒంట్లో నీరసంగా వుంటోందనీ, డాక్టరుగారికి చూపిస్తే ఎక్స్‌రేతీసి ఓ రెణ్ణెలపాటు రెస్టు తీసుకోమన్నాడనీ, మందులూ ఇంజక్షన్లూ వాడుతున్నాననీ, వీలయితే, ఆఫీసుకికూడా సెలవు పెట్టాలని చూస్తున్నాననీ రాస్తున్నాను. ఈ దెబ్బతో మావాళ్ళ ఆటకట్టు. రెండేళ్ళవరకు ఈ నాటకం ఆడొచ్చు" అన్నాడు.

"రాయక్కర్లేదులెండి" అంది కస్తూరి.

"ఏం" అన్నట్టుగా చూశాడు అతను.

"మనం పెళ్ళి చేసేసుకుందాం" అంది కస్తూరి చాలా దృఢంగా నిర్భయంగా.

సూటిగా, తీక్షణంగా చూస్తున్న ఆమె అంతలోకే ప్రసన్నంగా, చల్లగా చూపుల్ని మార్చి చిరునవ్వుతో తియ్యగా "నిజమే, మనం వెంటనే పెళ్ళి చేసేసుకుందాం" అంది

☆

**క్రీస్తుశకం 1852 నాటికి గోదావరి నదిపై ఆనకట్టల నిర్మాణం పూర్తయింది. పంటకాల్వల నిండా నీళ్ళు పొలాలను సస్యశ్యామలం చేస్తున్నాయి. ఒక వేదపండితుడు ఉదయమే స్నానం చేస్తూ, కింది శ్లోకం చదువుతున్నాడు.**

*"నిత్య గోదావరీ స్నాన పుణ్యదోయో మహామతి*
*స్మరామ్యాంగ్ల దేశీయం కాటనం తం నయామి"*

అదే సమయంలో ఒక తెల్లదొర దుబాసతో పాటు అక్కడికి వచ్చాడు. ఆ శ్లోకంలో 'కాటన్' అన్న పదం విని, దొర అక్కడే ఆగి, ఆ పండితుడేదో శ్లోకం చదువుతూ వున్నాడు. దాని అర్థమేమో చెప్పమన్నాడు.

"అయ్యా, పవిత్ర గోదవరీ జలాల్లో రోజూ స్నానం చేసే భాగ్యం ప్రసాదించిన, తెల్లదొర' 'కాటన్'కు నమస్కరిస్తున్నాం అన్నాడు. తెల్లదొర ఆశ్చర్యంతో 'ఏముందీ, ఆనకట్టలు కట్టడం నా ఉద్యోగం. కాలువలకు నీళ్ళు అందించటం మా ధర్మం' అన్నాడని చెప్పాడు దుబాసి.

# ఆంధ్రుల పాలిటి అన్నదాత

## సర్ ఆర్థర్ కాటన్

అందుకు పండితుడు – "అయ్యా గోదావరి నదీ జలాలతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి, మాకు అన్నపానాలు సమకూర్చినవాడు కాటన్‌దొర మాకు ప్రత్యక్షదైవం" అన్నాడు. అయితే ఆ కాటన్ దొర వీరే అని పండితుడికి చూపిస్తాడు. పండితుడు పరమానందంతో, కాటన్ పాదాల పై పడ్డాడు.

తాను వడిన శ్రమకు తగిన గుర్తింపు లభించినందుకు, కాటన్ సంతోషంతో కళ్ళనీళ్ళు కార్చాడు.



కాటన్ దొర ఆంధ్రుల పాలిటి 'అన్నదాత' జనరల్ ఆర్థర్ కాటన్ 1803 మే 15వ తేదీన ఇంగ్లండులోని 'కాంబర్‌మీర్ అబి' అన్న పట్నంలో జన్మించాడు. తండ్రి హెల్వెలీ కాటన్. తల్లి హెల్వెలి కాటన్. ఈ దంపతులు పదవ కుమారుడు ఆర్థర్ కాటన్.

1821లో, తన 18వ ఏట ఈస్టిండియా కంపెనీ ఉద్యోగిగా నియమింపబడ్డాడు. 1841 అక్టోబర్ 29న ఆర్థర్, ఎలిజబెల్‌ల వివాహం జరిగింది. ఆమె సంపన్న కుటుంబంలో జన్మించి, ప్రజలసేవే పరమాత్మ సేవగా భావించిన మహిళ.

1832–33లో తీవ్రమైన కరువు వచ్చింది. ప్రజల బ్రతుకు దుర్భరమైంది. లక్షకు పైగా ప్రజలు మరణించారు. ఇక్కడున్న ఆస్తులను తెగనమ్మి వేలాది కుటుంబాలు మద్రాసు మొదలగు ప్రాంతాలకు వలసపోయారు. గోదావరి జిల్లా నుండి గుంటూరు జిల్లా వరకు అదీ పరిస్థితి. ప్రభుత్వానికి ఆదాయం బాగా పడిపోయింది.

తంజావూరు జిల్లా కలెక్టరు, ఆర్థర్ కాటన్ మిత్రుడు. కాటన్ కావేరి నదిపై ఆనకట్టలు కట్టి జిల్లా ప్రజలకు చేసిన మేలు గుర్తించి, గోదావరి డెల్టా బాగు పడాలంటే, తాగునీరు, సాగునీటి సౌకర్యం కల్పించటం అవసరం. అందుకు ఆర్థర్ కాటన్ ఒక్కడే సమర్థుడు అని ప్రభుత్వానికి సిఫారస్ చేశాడు.

1847 జనవరిలో ఆనకట్ట నిర్మాణానికి మద్రాస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1847 ఏప్రిల్‌లో గోదావరిపై ఆనకట్ట నిర్మాణం ప్రారంభమైంది. వెంటనే 1300 మంది కూలీలను నియమించారు. మగమనిషి కూలీ అణా (నేటి 6 పైసలు), ఆడమనిషి కూలి 4 1/2 పైసలు. క్రమంగా 500 మంది కమ్మరులు, 1000 మంది రాతిచెక్కుడు పనివారు నియమింపబడినారు. వీరి దిన కూలి 14 పైసలు. పనులు ముమ్మరం కావటంతో కాటన్ దొర నిర్మాణ స్థలంలోని బంగళాకు మారాడు. నిర్మాణ స్థలం ధవళేశ్వరం, రాజమండ్రికి 4 మైళ్ళ దూరంలో వుండేది.

కాటన్ దంపతులున్న బంగళా చుట్టూ పని సందడి ఎక్కువైంది. నిరుపేద స్త్రీలు కాళ్ళకు చెప్పులు లేక పని చేస్తుండటం గమనించింది. పసిపిల్లల కోసం ప్రత్యేకంగా పందిళ్ళు వేయించింది కాటన్ భార్య ఎలిజబెత్.


కాటన్ దొర ఇంటిపనికి, వంటపనికి, తోటపనికి వేర్వేరు పనివారుండేవారు. బంగళాలో 'లచ్చి' అనే ఇల్లూడ్చే పనిమనిషి వుండేది. ఒకనాడు లచ్చి, ఎలిజబెత్ దొరసానిని కలుసుకొంది. "అమ్మగారూ, ఒక అర్ధరూపాయి ఇవ్వండి" అని వేడుకొన్నది. ఎందుకని అడిగితే జవాబు చెప్పలేదు. లచ్చి నెల జీతం 3 రూపాయలు. ఇట్లా అడ్వాన్సు తీసుకొంటే నెలాఖరుకు నీకేమి వుంటుంది. లచ్చి మరీమరీ బతిమాలుకోగా అర్ధ రూపాయి ఇచ్చింది. రాజమండ్రి వెళ్ళి లచ్చి, ఒక పాపను అర్ధ రూపాయికి కొనింది. అమ్మగారు, ఒంటరిగా వుండలేక ఈ పాపను తెచ్చుకొన్నానంటూ పాపను దొరసానికి చూపింది. ఎలిజబెత్ చాలా బాధతో పసికూనలను అమ్మే దుస్థితికెంతగానో విచారించింది.

కాటన్‌తో పని చేసిన ఇంజనీర్లు సమర్థులు. ఓవర్‌సర్ వేణం వీరన్న వేలాది కూలీలను సమీకరించి, ఆనకట్ట పనులు సకాలంలో పూర్తి కావటానికి ఎంతో సహకరించాడని, కాటన్ వీరన్నకు సబ్ ఇంజనీర్‌గా ప్రమోషన్ ఇప్పించాడు. ప్రభుత్వం వీరన్నను 'రావు బహదూర్' బిరుదుతో గౌరవించింది.

నాలుగు కిలోమీటర్ల పొడవు గల కాలువలు, 2000 మైళ్ళ పొడుగుల పంట కాలువలో 1847-1852లో అంటే ఐదు ఏళ్ళలో పూర్తి అయినాయి. పది లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం ఏర్పడింది. సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన గన్నవరం జలవాహక మార్గం ఇండియాలో వెలసిన అద్భుత నిర్మాణం.

1852లో, కాటన్ ఛీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొంది, మద్రాసులో వుండి ఎన్నో కొత్త పథకాలు రూపొందించాడు. అలా నిర్మింపబడిందే కడప-కర్నూలు కాలువ.

1860లో ఆర్థర్ కాటన్ ఇండియాలో పదవీ విరమణ చేసి ఇంగ్లాండు వెళ్ళాడు.



1861లో బ్రిటిష్ ప్రభుత్వం అతనికి 'సర్' బిరుదునిచ్చింది. 1866లో విక్టోరియా మహారాణి కాటన్ ఇండియాలో చేసిన విశిష్ట సేవలను గుర్తించి 'నైట్ కమాండర్ ఆఫ్ ద స్టార్ ఆఫ్ ఇండియా' అన్న అత్యున్నత బిరుదునిచ్చింది.

ఇండియాలో తాండవించే బీదరికాన్ని పారదోలటానికి బ్రిటిష్ పాలకులకు త్వరలో కనువిప్పు కలిగించమని భగవంతుని వేడుకొన్న ఉదార చరితుడాయన.

తెలుగువారు తమిళులు ఆయనను 'అపర భగీరథుడని కొనియాడారు. కాని ఇంగ్లండులో, కొందరు కాటన్ పై ఈర్ష్యతో ఎన్నో అభియోగాలు మోపారు. విచారణ జరిగింది. కాటన్ నిర్దోషిత్వం వెల్లడైంది. అతని కీర్తి, ప్రతిష్ఠలు మరింతగా ఇనుమడించాయి.


నిరంతరం భారతదేశ ప్రజల సంక్షేమాన్ని కోరేవాడు. బీదప్రజల నుండి ఉప్పు పన్ను వసూలు చేయటం అన్యాయమని, బ్రిటిష్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించాడు. గాంధీజీ 1930లో ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించడానికి 50 ఏళ్ళకు పూర్వమే కాటన్ నాటి ప్రభుత్వాన్ని విమర్శించాడు.

కాటన్ ఎంత సమర్థుడైన ఇంజనీరో అంతకుమించిన ఉదాత్తుడైన వ్యక్తి 84 ఏళ్ళ వృద్ధాప్యంలో వ్యవసాయంలో పరిశోధనలు చేసి కొత్త గోధుమ వంగడాలను సృష్టించాడు. జీవితాంతం భారతదేశానికి మేలు జరగాలని ఆశించిన మహనీయుడు. ఇండియాను గురించిన ఎన్నో వ్యాసాలను పత్రికలకు పంపేవాడు.

డార్కింగ్‌లోని 'ఉడ్‌కాట్' భవనంలో, నిరంతరం బైబిలు చదివేవాడు. 96 ఏళ్ళు నిండినా కంటిచూపు నశించలేదు. వినికిడి లోపించింది. జులై 14, 1899 ఆర్థర్ కాటన్ జ్వర పీడితుడయ్యాడు. క్రమంగా శక్తి క్షీణించింది. తుదకు 1899 జులై 24వ తేది తుదిశ్వాస వదిలాడు.

***'ఉదార చరితానాంతు వసుధైవ కుటుంబకమ్'*** అన్న సూక్తి మేరకు విశ్వ మానవుడుగా కీర్తినందుకున్నవాడు సర్ ఆర్థర్ కాటన్.

***-జానమద్ది హనుమచ్ఛాస్త్రి***



# ఎడ్లదానం

మచ్చుకైనా ప్రశాంతత కానరాని పట్టణ వాతావరణానికి దూరంగా, పైరుపచ్చని పొలాల మధ్య, ప్రకృతి ఒడిలో కుదురుగా ఒదిగిపోయిన పాలపిట్ట లాంటి కుగ్రామం గోపవరం. ఆ గ్రామానికి నడిఒడ్డున ఓ దేవాలయంలో వేణుగోపాలస్వామి కొలువు తీరగా, దానిపక్కనే గల శివాలయంలో నటరాజ స్వామి వెలసి వుండడం ఆ గ్రామం ప్రత్యేకత. గోపవరం జనాభా ఐదారువేల గడపదాటదు. అంత చిన్న గ్రామమైనా, అక్కడి గ్రామస్తులంతా చక్కటి కట్టుబాటుతో, నిజాయితీగా, ఐకమత్యంగా వుంటూ, ఆదర్శవంతమైన స్థానికపాలన నిర్వహించుకోగలుగుతున్నారు. అలాగని అక్కడున్న వారందరూ మహానుభావులో, మహా మంచివాళ్లో అనుకుంటే పొరబాటే. అన్ని చోట్లా వున్నట్టే, ఇక్కడ కూడా అన్నిరకాల వాళ్ళూ నీళ్ళూ నూనెల్లా కలిసిపోయి కాలం వెళ్ళబుచ్చేస్తున్నారు.





బ్రతకనేర్చిన లౌక్యం కొందరికుంటే, బరితెగించిన స్వార్థపు పోకడ ఇంకొందరిది. అదృష్టంతో గెలుచుకుపోయేవారు కొందరైతే, దేవుడి మీద భారంవేసి కొనసాగేవారు ఇంకొందరు. వీళ్ళకి జీవితపు విలువల్ని బోధించి, వీళ్ళలో పారమార్థిక చింతన పెంచే సదుద్దేశంతో ఈ గ్రామపెద్దలు అడపాదడపా పై వూళ్ళనుంచి పేరెన్నిక గల పండిత ప్రకాండుల్ని, ప్రవచనా వాచస్పతుల్ని గోపవరానికి ఆహ్వానించి, వాళ్ళతో కొన్ని హితబోధనా కార్యక్రమాల్ని నిర్వహించడం, ఆ కార్యక్రమాలు ఇక్కడి దేవాలయ ప్రాంగణాల్లోనే జరగడం పరిపాటి.

అంతా బాగానే వుంది గానీ, ఉన్నట్టుండి ఓ కొత్త విషయం, -అదే-తమ గ్రామ ప్రజల నైజం గురించి బయటపడిన ఓ విచిత్ర పరిణామం గోపవరం గ్రామపెద్దల్ని విపరీతంగా కలవర బెట్టింది. ఓ పక్క అకస్మాత్తుగా ఊపిరి సలపనివ్వని అకాల వర్షాలతో, ఉప్పెనలా ముంచెత్తిన వరద బీభత్సంతో రాష్ట్రంలోని ఓ ప్రాంతంలో జనజీవనం అతలాకుతలమైపోతే, తమ వంతు తక్షణసాయంగా, తమ చుట్టు పక్కల గ్రామాలవాళ్ళు లేచి నిలబడి, ఆయా బాధిత కుటుంబాల్ని ఆదుకునే యత్నంగా స్వచ్ఛంద సేవల్ని, విరాళాలని అందించగలిగాయి. ఆ స్థాయిలో ముందుకు రాక, దాదాపు నిక్షిప్తంగా వుండిపోయిన తమ గ్రామప్రజల తీరు వారిని తలదించుకునేలా చేసింది.




తమ గ్రామస్థులకు వితరణ బుద్ధి అడుగంటిపోడం అంత అభిలషణీయం కాదని గోపవరం గ్రామపెద్దలకు తోచింది. ఐతే, ఆ పెద్దల్లో కొందరు దీనితో ఏకీభవించక, ఇలా జరగడానికి్కారణం తమ కృషి లోపమే గానీ గ్రామస్థుల తప్పిదం కాదని వాదించబోయారు, ఏదేమైతేనేం, అసలు 'దానగుణం యొక్క విశిష్టత గురించి, పరోపకార బుద్ధికున్న పవిత్రత ఆవశ్యకతల గురించి తమ గ్రామ ప్రజలు వివరంగా తెలుసుకోడం ఎంతో అవసరమని మాత్రం అందరికీ అనిపించింది. ఈ విషయంమీద ఓ ప్రవచనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడానికి పిఠాపురం నుంచి అవధాన పీఠాధిపతిగా ఉపన్యాస ధురీణుడిగా పేరొందిన గోవిందాచారిగారిని తమ వూరికి ఆహ్వానించారు. తమ ప్రచారోద్యమ వ్యూహం ఏమో గానీ దానధర్మానికి వెనకడుగేసిన గ్రామస్థులు ఈ ఉచిత కాల




క్షేప కార్యక్రమానికి మాత్రం పెద్దసంఖ్యలోనే హాజరయ్యారు.

తన ఆధ్యాత్మిక కార్యక్రమానికి విశేషంగా ప్రేక్షకాదరణ లభించినందుకు ఉప్పొంగిపోయిన గోవిందాచారి, తన ప్రసంగాన్ని ఇలా ప్రారంభించారు.

"ఓం నమో వెంకటేశాయ–

"మహాజనులారా –దైవానుగ్రహపాత్రులారా, ఆత్మజ్ఞాన సంపన్నులారా– ఈ రోజు చాలా సుదినం – ఎందుచేతనంటే, మీ వంటి మహానుభావులంతా 'దానగుణం' గురించి తెలుసుకోవాలని ఇలా ముందుకు రావడం ఓ శుభపరిణామం కాబట్టి. ఈ సందర్భంగా, మీ ఊరి పెద్దల ఆహ్వానం మీద ఇలా వచ్చిన నేను ఈ 'దాన గుణం' గురించి నాకు తెలిసిన నాలుగు మంచిమాటలు చెప్తాను. శ్రద్ధగా వినండి!"

అందరూ సర్దుకొనికూర్చున్నారు. శ్రద్ధగా వినసాగారు.

"అసలు 'దానమనగా ఏమి? అంతో ఇంతో కలిగిన ప్రతి ఒక్కరూ, తమకున్న దానిలో ఓ చిటికడైనా తమది కాదనుకుంటూ, ప్రతి ఫలాపేక్ష లేకుండా, పరోపకార వినియోగార్థం ఆనందంగా దాన్ని వదులుకోగలగడమే దానగుణమని తెలుసుకోండి! ఐతే, ఈ విషయం మీద మరింత లోతుగా వెళ్ళేముందు, అసలు మనలో ఈ 'దానగుణం' అనేది ఏ స్థాయిలో వుందో కాస్త తెలుసుకునే ప్రయత్నం చేద్దాం! దీనికోసం ఇక్కడ హాజరైన మీలో కొందరి 'దానగుణాన్ని' పరిశీలిద్దాం! " అంటూ గోవిందాచారి తనకెదురుగా కూచ్చున్న వారిని ఓసారి అటూ ఇటూ చూశాడు. ఐతే, ముందువరసలో కూర్చున్న గ్రామ పెద్దలు ఒకరి మొఖాలొకరు చూసుకుంటూ, కర్చీఫులతో మొహం తుడుచుకుంటూ, గోవిందాచారి దృష్టి తమ మీద ఎక్కడ పడుతుందోనన్న ఇబ్బందిని ప్రకటించారు.

ఆ ఇబ్బందిని అర్థం చేసుకున్న గోవిందాచారి తన దృష్టిని కాస్త దూరంగా సారిస్తూ, వెనక వరసల్లో కూర్చున్న వాళ్ళనుద్దేశించి, "నాయనా–మీలో ఎవరన్నా నేనడిగే ఓ నాలుగైదు ప్రశ్నలకి సమాధానం చెప్పగల రా?" అనడిగాడు – ప్రత్యేకించి కాస్త పెద్దతలపాగా పెట్టుకున్న ఓ నడివయసు రైతుని చూస్తూ 'ఏం నాయనా – నీ మాటేమిటి? నువ్వు నాకు సమాధానాలు చెప్పగల వా?" అంటూ ప్రాధేయ పూర్వకంగా అడిగాడు.

దానికి ఆ రైతు – " దానిదేవుందీ – తప్పకుండ చెప్తానండీ. మీ పెశ్నన్లు మీరడగచ్చు!" అన్నాడు భరోసా ఇస్తున్న ధోరణిలో.

*గోవిందాచారి:* ఇంతకీ నీ పేరేమిటన్నావ్ రైతన్నా?

*రైతు:* ఈరధర్మయ్యండి ! అంతా ఈరడని పిలుస్తారండి!

*గోవిందాచారి:* ఆహా ఎంత చక్కటి పేరు నాయనా నీది! అసలు నీ పేరులోనే ధర్మం చోటు చేసుకుంది – ఇంక నీలో ఎంత గొప్ప దానగుణం దాగివుందో నేనర్థం చేసుకోగలను – కానీ, ఈ గ్రామప్రజకి ఆ విషయం కాస్త తెలియ జెప్పడానికి నేను నిన్నో నాలుగు ప్రశ్నలడుగుతాను – సరేనా?


*ఈరధర్మయ్య:* తప్పకుండా అడగండి పంతులుగోరూ–సమాధానా లిస్తానంటున్నాగా!

*గోవిందాచారి:* ఐతే విను! కాలం కలిసిరాక, కరువొచ్చో, కాటకమొచ్చో –ఆకలితో అలమటించే బీదా బిక్కీ నిన్ను సాయమడిగితే, నీకున్న రెండు ధాన్యం కోష్ఠాల్లో ఒకదాన్ని, దాన్లో పాతరవేసిన ధాన్యంతో సహా, వాళ్ళకోసం వదులుకోగలవా?

*ఈరధర్మయ్య:* ఓ– వదులుకుంటానండీ!

*గోవిందాచారి:* ఆహా! ధర్మయ్యా – నీదెంత గొప్ప మనసయ్యా! ఐతే, మరొక్క ప్రశ్న!

*ఈరధర్మయ్య:* సరే కానిండీ!



***గోవిందాచారి:*** ఏంలేదు ! మీ గ్రామానికి దూరంగా, బొత్తిగా వూరి పొలిమేరల్లో బతుకుతూ దీనావస్థలో వున్న దళిత కుటుంబాల బాగుకోసం, నీకున్న ఐదెకరాల భూమిలో ఓ రెండు ఎకరాలను, వాళ్ళకోసం వదులు కోగలవా?

***ఈరధర్మయ్య:*** హాయిగా వదులుకుంటానండీ!

*(చప్పట్లు)*

***గోవిందాచారి:*** నాకు తెలుసయ్యా! నీ ఉదార బుద్ధి ఎంత గొప్పదో మీ గ్రామ ప్రజకి ఇప్పుడు బాగా అర్థమౌతోంది – సరే –ఇంకొక్క ప్రశ్న అడగనా!

***ఈరధర్మయ్య:*** అడగండి సామీ!

***గోవిందాచారి:*** ఏం లేదు ధర్మయ్యా! పాపం ఊరవతలి కాలవగట్టున కాలం వెళ్ళబుచ్చే ఆ బీద ప్రజానీకం, ఉన్నట్టుండి రాత్రికి రాత్రి ఉప్పెనెలా ముంచెత్తిన వరదతాకిడికి నిలువనీడ పోగొట్టుకొని, కట్టు బట్టల్తో నీ ఇంటికి పరిగెత్తుకొస్తే, వాళ్ళకి ఆసరా కల్పించేందుకు నీకున్న రెండిళ్ళలో ఒకదాన్ని వాళ్ళ కోసం వదులుకోగలవా? నీ దయాగుణంతో దాన్ని వాళ్ళకి దానం చేసెయ్యగలవా?

***ఈరధర్మయ్య:*** తప్పకుండా ఇచ్చేస్తానండీ! ఆలోచించే పెశ్నే లేదు!

(జనం చప్పట్లతో హోరెత్తించేశారు)

***గోవిందాచారి:*** శెభాష్ ధర్మయ్యా! ఆదర్శ పురుషుడు వంటే నువ్వయ్యా! చివరిగా ఇంకొక్క ప్రశ్న!

***ఈరధర్మయ్య:*** ఊ! కానీండి!

***గోవిందాచారి:*** ఈ గుడిమాన్యాన్ని నేను ఉచితంగా సేద్యం చెయ్యడానికి ముందుకొస్తే, దానికి సాయపడేందుకు నీకున్న నాలుగుఎడ్లలో రెండింటిని నాకు దానం చెయ్యగలవా ధర్మయ్యా!

***ఈరధర్మయ్య:*** నా ఎడ్లనా? మీకా? కుదరదు! అది మాత్రం నా వల్ల కాదండీ!

ఈ సమాధానంతో అక్కడున్న వారందరూ ఒక్క క్షణం అవాక్కయిపోయారు. వూహించని ఈ సమాధానంతో గోవిందాచారి కూడా నిశ్చేష్టుడైపోయాడు.


***గోవిందాచారి:*** పోనీ, నేను కాకుండా, మీవూరివారే ఎవరైనా మీ గుడిమాన్యాన్ని ఉచితంగా సేద్యం చెయ్యడానికి ముందుకొచ్చారనుకో అప్పుడైన నీకున్న నాలుగు ఎడ్లలో రెండింటిని వారికి దానం చెయ్య గలవా?

***ఈరధర్మయ్య:*** చెప్పాగదండీ! ఎవరైనా సరే –నాకేం అభ్యంతరంలేదు! కానీ, నేను మాత్రం నా ఎడ్లని ఎవరికీ దానం చెయ్యనుగాక చెయ్యను!

అందరి మొహాన ఆశ్చర్యం, అయోమయం అలుముకుంది. అసలు విషయం అర్థంగాక గోవిందాచారి ఇలా అడిగాడు–

***గోవిందాచారి:*** అది కాదు ధర్మయ్యా? ఇందాకటి వరకు నీలో వున్న విశేష దానగుణం వున్నట్టుండి ఎందుకు హరించుకుపోయిందిప్పుడే? ఎందుకు హరించుకుపోయింది? చెప్పగలవా?

***ఈరధర్మయ్య:*** చెప్పమన్నారా సామీ?




***గోవిందాచారి:*** చెప్పమనేగదా అడుగుతూంట!

***ఈరధర్మయ్య:*** సరే ఇనండి! ఇందాక మీరన్న ధాన్యం కోష్ఠాలు, ఎగస్ట్రా ఇళ్ళూ, ఐదెకరాల పొలాలూ నిజంగా నాకు లేవండి! కానీ – ఓ నాలుగెడ్లు మాత్రం నిజంగా నాకున్నాయండి? అవి గనక మీకిచ్చానో – నేను చచ్చానే! అంచేత ఆటిని మాత్రం ఎవరికి ఇచ్చేది లేదుగాక లేదు!

ఆ దెబ్బతో విషయం అర్థమైన జనాలందరూ గొల్లున నవ్వారు. అంతవరకు బహు ఉదారంగా మాట్లాడిన వీరధర్మయ్య వీరధర్మగుణం ఇలా బయట పడేసరికి ఒక్కోసారి దంగైపోయిన గోవిందాచారి, ఓ మూడు క్షణాల మౌనంతో కాస్త తెప్పరిల్లి ఇలా బదులిచ్చారు–జనాంతికంగా అందుకు అన్నారు–

*"దాతకానివాని దఱచుగా వేడిన*
*వాడు దాతయగునే వసుధనెందు*
*నవురు దర్భయగునె యబ్ధిని ముంచిన*
*విశ్వదాభిరామ వినురవేమ'* అని

అనగా, దాత కానివానిని ఎన్ని విధముల వేడినను వాడు దానము చేయడు. సముద్రమున ముంచినను అవురుగడ్డి ఎంతమాత్రము దర్భ కాజాలదుగదా! లోభి దాత కాదునుట స్పష్టము!" – అని వివరించి, ఆ తర్వాత 'దానగుణం' యొక్క ఆవశ్యకత మీద తన ప్రసంగాన్ని కొన సాగించారు.

"మహానుభావులారా – ఇందాక మీరంతా నవ్వింది ఈ ధర్మయ్యని చూసికాదు–మనలో దాగివున్న– అంటే మన ప్రతి ఒక్కరిలో దాగివున్న వీరధర్మయ్యల్ని చూసి మాత్రమే అని గ్రహించండి!" అంటూ కొనసాగింది ఆయన ప్రసంగం. దాంతో ఆ మర్నాటి నుంచీ ఆ గ్రామప్రజ మనో ప్రవృత్తిలో మార్పు చోటుచేసుకోడం మొదలైంది. ఆ గ్రామం త్వరగానే 'ధర్మగోపవరం'గా మార్పు చెందగలిగింది.

☆

# పల్లెలకు కళ 'మల్లన్న పండుగ'

**తెలుగువారి పురాతనసంస్కృతి జానపదులలోనే నేటికీ భద్రంగా ఉంది. ఎంత నవనాగరికత వ్యాపిస్తున్నా జానపదులు తమ సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను పదిలంగా కాపాడుకుంటూనే వున్నారు. తెలంగాణలోని పల్లెలలను నేటికీ ఆనందంలో ఓలలాడిస్తున్న జానపద కళాప్రక్రియ 'ఒగ్గు కథ' అని మనకు తెలుసు. ఈ ఒగ్గుకథలను చెప్పేవారిని 'ఒగ్గోళ్ళు' లేక 'బీరన్నలవారు' అని వ్యవహరిస్తారు. వీరు 'కురుమ' కులానికి చెందినవారు. ఈ బీరన్నల వారు పురోహితులుగా కురుమలు ఐదు సంవత్సరాలకోసారి వైభవోపేతంగా జరుపుకునే పర్వం 'మల్లన్న పండుగ'.**

మల్లన్న పండుగనే 'మల్లన్న కళ్యాణం' అని కూడా అంటారు. శని, ఆది, సోమవారాలలో జరుపుకునే పండుగ ఇది. కార్తీకమాసం మొదలు శుభదినాలలో దీనిని జరుపుకుంటారు. మల్లిఖార్జునుడే మల్లన్నగా అవతరించాడని కురుమల విశ్వాసం. మల్లన్నను తను కులదైవంగా కురుమలు, గొల్లలు ఆరాధిస్తారు.

## మల్లన్న వృత్తాంతం

భద్రకాళి వీరభద్రుల అనుగ్రహంతో నీలమాదేవి, హాదిరెడ్డి దంపతులకు ఏడో సంతానంగా మల్లన్న జన్మించాడు. అతడు ఎదిగి ఎడ్ల సంగన్న వద్ద నాగలికాని సిద్ధం చేయించుకుని జంగాల మాన్యం దున్నుతుండగా ఏడు పుట్టల నడుమ నాగలి కుర్రు నడిమి పుట్టకు తగలగా దానిలో నుండి బంగారు గొర్రె, వెండి తగరు (పొట్టేలు) బయటికి వచ్చాయి. మల్లన్న ఆ సమయంలో పార్వతీ పరమేశ్వరులను ప్రార్ధించాడు. అదే పనిగా గొర్రెలు పుట్ట నుండి బయటికి రావడం ప్రారంభించాయి.

పదకొండు ఆమెడలన్నర దూరం అలా వెనకకు చూడకుండా మల్లన్న ముందుకు పోయాడు. బంగారు గొర్రె, వెండి తగరుతోపాటు గొర్రెలు ఆయన వెంట అసంఖ్యాకంగా పుట్టనుండి తనదాకా బారులు కట్టి వచ్చాయి. అప్పుడు మల్లన్న వెనకకు తిరిగి చూడగానే పుట్టలోంచి గొర్రెలు పుట్టి రావడం ఆగిపోయింది. వచ్చిన చాలా గొర్రెలు తిరిగి పుట్టలోకి వెళ్ళిపోయాయి. కొన్ని గొర్రెలు మాత్రమే మిగిలాయి. వాటిని కాపాడేందుకు పార్వతీపరమేశ్వరులు ఆదిబయ్యన్న, ఒగ్గు పోచమ్మ అనే దంపతులను సృష్టించారు. వారు ఈశ్వరానుజ్ఞ ప్రకారం సంజీవి కొండలలో ఆ దంపతులు ఆ గొర్రెలను మేపుకుంటూ కాపాడుకున్నారు. రానురాను వాని సంతానం పెరిగి గొర్రెల సంపద పెరిగింది.

## పుట్టపూజ

పుట్టలోంచే గొర్రెలు వచ్చాయి కాబట్టి కురుమలు, గొల్లలు మల్లన్న పండుగ కార్యక్రమాన్ని 'పుట్టపూజ' తోనే ప్రారంభిస్తారు. పండుగ తొలినాడు ఇంటిల్లిపాదీ, వచ్చిన బంధువులు ఉషోదయంతోనే అభ్యంగన స్నానాలు చేస్తారు. కార్యక్రమాన్ని నిర్వహించే పూజారులు బీరన్నలు (వీరినే కొన్ని ప్రాంతాలలో 'వీరకొడుకులు' అంటారు) ముందు నడుస్తుండగా స్త్రీ పురుషులు కాళ్ళకు పసుపు పూసుకొని గజ్జెలు కట్టుకొని ఐదు కడవల నిండా నీళ్ళు తలలపై పెట్టుకొని ధూపం కాల్చుకుంటూ పుట్టవద్దకి ఒగ్గుడోలు వాద్యాలు మ్రోగుతుండగా కదలిపోతారు. అప్పుడు 'బీర్నలు' లేక 'బీర్లోళ్ళు' పుట్టపాటలు – మల్లన్న పాటలు గళమెత్తి ఈ విధంగా పాడుతుంటారు.




## మల్లన్న స్తుతి

'శరణుమల్లేశా / శరణు మల్లేశా
శరణయ్యనీశేష / సేతు మల్లేశా
ఏదొక్కా పనికైనా / నీవేకలవ్వ సామి
శీకటి కురుమలో/శివలీల శంబుడవ్వ
కులదైవమని నిన్ను / మొక్కుదుము మల్లేశా

## పుట్టగూర్చి

'తల్లిబదేవత / శరణు జేతుమమ్మ
మాకు ఆదారము / గొర్రెలనిచ్చిన మాతల్లి
మముగన్న తల్లి
ఎప్పటికీ నీ పూజ / ఏమారక జేతుమమ్మ
పుట్టలోన మన్ను దెచ్చి

మా యింటిలోన మల్లన్న కళ్యాణం జేతుమమ్మ
కూడిన పద్మాక్షి / ఎడమన రత్నాంగా
ఆస్థాన కంకణము / నొష్ట బాశింగము గనుడూనా తండ్రి
మల్లన్నకు కళ్యాణము జేతుమమ్మ
సారెలు చీరెలు పసుపులు కుంకుమలు
మాతల్లి రత్నాంగి పద్మాక్షికి అర్పింతుమమ్మ
మొక్కెద బూదేవత
మోక్షము నివ్వుమమ్మ
గంగవృతకంబు దెచ్చి / బిందెల్ల నింపె
జలకడపవల బూదేవికి
స్నానము జేయింతుమమ్మ
పాలు పెరుగులు నీకు అర్పింతుమమ్మ'




అంటూ బీర్లోళ్ళు పాడిన తరువాత పుట్టకు అందరూ ప్రదక్షిణ చేస్తారు. తెచ్చిన ఐదు బిందెల నీళ్ళు పుట్టలోను, చుట్టూరా పోసి ఆ నేలను శుభ్రపరుస్తారు. అలికి ముగ్గులు పెడతారు. బీరన్నలు అలికిన ప్రదేశంపై పటం వేస్తారు. దీపం వెలిగిస్తారు. కొబ్బరికాయ కొట్టి ఆ జలాన్ని పుట్టచుట్టూతా చల్లుతారు. చీర, రైక, నల్లపూసలు, గాజులు అక్కడ ఉంచి వానిపై కొత్త గంపను బోర్లిస్తారు. దీనిని వారు 'పుట్టకమ్ముదు' అంటారు. భక్తి శ్రద్ధలతో పుట్టకు దండం పెట్టి అంతా ఇంటిదారి పడతారు. సాయంత్రం మళ్ళీ అదే రీతిగా పుట్టవద్దకు వస్తారు. ధూపదీప నైవేద్యాలు అర్పించిన తరువాత పండగను చేసే ఇంటి యాజమాని గొంగడి 'కొప్పెర' పెట్టుకొని జాగ్రత్తగా 'దీపం' తీసుకువస్తాడు.


ఐదుగురు పుట్టమట్టిని గంపలకెత్తుతారు. 'శివసత్తులు' (వచ్చిన బంధువులంతా) తలా పిడికెడు మట్టి గంపల్లో వేస్తారు. పుట్టలో పాలు, నీరు పోసి, గంపలు ఇంటివారు తలలపై కెత్తుకోగా ఇంటికి తిరిగి వస్తారు. మార్గమధ్యంలో 'కోడి'ని కోస్తారు. దీనిని కురుమలు 'మిత్తి' తీయడం అంటారు. వండి తెచ్చిన 'అన్నాన్ని' అటు ఇటు చల్లుతారు. ఇక ఇంటికి పయనం కొనసాగుతుంది. ఆ సమయంలో బీరన్నలు పాడుతుండగా అందరూ బృందగానంలా ఇలా పాడతారు.

'ఆనందమానందమాయెనూ
మన జనులకు ఆనందమాయెనూ
రత్నాంగి పెండ్లికూతురాయెనూ
పద్మాక్షి పెండ్లికూతురాయనూ'

ఇలా పాడుకుంటూ సర్వాంగ సుందరంగా అలంకరించిన ఇంటికి చేరుకుంటారు. 'దేవునింటి'లో పుట్టనుండి తెచ్చిన దీపాన్ని ఉంచుతారు. మండలం అంటే నలభై రోజుల దాకా మలగకుండా వెలిగేటట్టు చేస్తారు.

## మల్లన్న కళ్యాణం


సిద్ధం చేసిన వేదికపైన రత్నాంగి పద్మాక్షులు వధువులుగా, మల్లన్న వరుడుగా కళ్యాణం జరుగుతుంది. ధనాల కోటకు వెళ్ళి ధనమైసమ్మను ఓడించి పద్మాక్షిని బంగారు గంజెల పందిరి కింద మల్లన్న కళ్యాణమాడినట్లు మల్లన్న కథలో ఉంది. మల్లన్న కళ్యాణాన్ని 'బీరన్న'లు పెండ్లిగా జరిపిస్తారు. వినాయక, నవగ్రహ ఊరిదేవతల పూజతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం నాగవెల్లి శంకుతీర్థంతో ముగుస్తుంది. విభూతి గంధం, గంధంపాలు పంపిణీతో కళ్యాణం పరిసమాప్తి అవుతుంది. ఎక్కువగా ఇండ్లలో వివాహాలకు ముందుగా ఆపద సమయాలలో వాటిని దాటేందుకు మల్లన్న కళ్యాణాన్ని జరుపుకుంటారు.




మన వివాహ సంప్రదాయరీతిలోనే ఇంటి యజమాని, ఆయన భార్య మల్లన్న కళ్యాణం జరిపిస్తారు. కళ్యాణంలో మంగళ సూత్రధారణ ముగిసిన పిదప 'అక్షింతలు' వేయడంతో మల్లన్న కళ్యాణం పరిపూర్తవుతుంది. తరువాత కులదేవతలకు ఇంటి దంపతులు 'దండం' పెట్టిన తరువాత వివాహాభోజనాలూ వగైరా, బంధువులతో ఇంకా రెండు రోజులు ఒగ్గు కథాకాలక్షేపంతో గడుపుతారు. కాపుల ఇండ్లలో పద్మాక్షి, మల్లికార్జునులకు మాత్రమే కళ్యాణం. కురమల ఇండ్లలో పద్మాక్షి, రత్నాంగి, మల్లన్నలకు కళ్యాణం, గొల్లల ఇండ్లలో కేతమ్మ, మల్లన్నలకు కళ్యాణం జరుగుతుంది.

ముచ్చటగా మూడు రోజులు జరుపుకునేది మల్లన్న

పండుగ. తెలంగాణాలోని అన్ని జిల్లాలలో ఎంతో వైభవంగా జానపదులు జరుపుకునే పండుగ ఇది. వైభవం ఎంతో వున్నా ఈ కళారూపంపై ఆధారపడి జీవించే కళాకారుల బ్రతుకులు, ఆ కళారూపం ఇంతవరకు అనుకున్నంత వెలుగు చూడకపోవడం విచారకరం.





## మల్లెల బీరప్ప వివరణ

ప్రముఖ ఒగ్గు కళాకారుడు మల్లన్న కథలను రాష్ట్ర వ్యాప్యంగా చెబుతూ వాటిని సభ్యసమాజం దృష్టికి తీసుకోచ్చేందుకు ప్రయత్నిస్తున్న చుక్కా సత్తయ్య, మల్లెల ఈ వ్యాసకర్తతో మాట్లాడుతూ, ఐదుగురు బీరన్నల బృందంతో నడిచే మల్లన్న కథ తెలంగాణాలో చెప్పబడడమే కాకుండా వారే కళ్యాణం నిర్వహించడం అపురూపమైన కార్యంగా వర్ణించారు.

రంగారెడ్డి, నల్లగొండ, వరంగల్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ మొదలైన జిల్లాల్లో ఎంతో ఘనంగా మల్లన్న పండుగ జరుగుతుందని చెప్పారు. కురుమలు అత్యంత భక్తిభావంతో జరుపుకునే ఈ పండుగ వారి సంస్కృతికి ప్రతీక అని వారు అన్నారు. ఇతర కులాల వారు మల్లన్నను ఆరాధ్యదైవంగా భావించి, బీరన్నలతో పండుగ చేయించుకుంటారని వారు తెలిపారు. కళ్యాణం జరిపించిన 'ఒగ్గోళ్ళు' (బీరన్నలు) ఆయా ఇంటి యజమానుల నుండి సంభావనలు పొందుతారని చెప్పారు. దేవుని పేర 'పాగసెల్లా' బండారు సంచిలో వొడిబియ్యం, కుంకుమ బొట్టు, కట్నం చేతికిస్తారు. గొర్రెలను, ఆవులను, డోళ్ళు కడియాలు, గొలుసులను కానుకలుగా ఇస్తారని తెలిపారు. సంతోషంతో తిరిగి వెళ్ళే 'బీరన్నలు' ఇంటి యజమానులకు

**'సగరంతో స్వాగరి**
**సబందు బాగ్యాగలి**
**ఆచారకరణ**
**నుందువర్య**
**నూరందు వర్య**
**గౌడమానికి లక్షాదిక**
**రూదు రుద్రాక్ష**
**మానికీ దారుల్తైన**
**మల్లన్న మానవ సంపన్నుల్తైన**
**సబండారు వారుల్తైన**
**చండీయ గోత్రమ్తైనా**
**శమాన బీరుల్తైన**
**ఆదిరెడ్డి గారి**
**అధిక సంపన్నులు'**

అని స్వస్తి వాచకం పలికి బయలుదేరుతారని ఆయన వివరించారు.




## ప్రాచుర్యానికి నోచుకోని మల్లన్న పండుగ

జానపదుల ఒగ్గుకథ ప్రాచుర్యానికి వచ్చింది కాని వారి సంప్రదాయపర్వం మల్లన్న పండుగ (మల్లన్న కళ్యాణం) గూర్చి చాలా మందికి తెలియదు. కురుమలు, గొల్లలేకాక, కాపులు, గౌడలు లాంటి ఇతర వర్గాల వారు కూడా జరుపుకునే కళారూప ప్రక్రియాపర్వం మల్లన్న పండుగ. ఈ కళాకారులు పేదస్థితిలో తమ అస్తిత్వాన్ని వెదుక్కో వలసిన పరిస్థితులలో ప్రసుత్తం వున్నారు.

అన్ని రకాల అనువైన కళారూపమైన ఈ మల్లన్న పండుగను ఒక ప్రక్రియగా తీసుకొని ప్రభుత్వం, ఆకాశవాణి, దూరదర్శన్‌లు ప్రోత్సహించి ఆదరించాలని పలువురు ఈ కళారూపాన్నే నమ్ముకున్న వృద్ధులు, యువకళాకారులు అంటున్నారు. తప్పకుండా తమ కళారూపం ఏనాటికైనా ఆదరణకు నోచుకొని జానపద కళాప్రక్రియల స్థానాన్ని చేరుకోగలదని ఈ కళాకారులు ఆశిస్తున్నారు.

*- ఎ.ఎమ్. ఫీచర్స్*

# మహనీయుల చతురోక్తులు

– పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

## మా శ్మశానం మీరుపయోగించుకుంటారా?

**వేంకట రామకృష్ణ కవులకూ, తిరుపతి వెంకట కవులకూ ఆ రోజుల్లో పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. అందువల్ల రామకృష్ణ కవుల శిష్యుడైన కథా చక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారన్నా మంటే, తిరుపతి వెంకట కవులకు.**

అందులో ముఖ్యంగా చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారికి. దానికితోడు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, తిరుపతి వెంకట కవుల పాణిగ్రహీత, శ్రవణానందం కావ్యాలమీద పాణిగృహీత శ్రవణానంద శృంఖలం అనే విమర్శక వ్యాసం ఒకటి వ్రాశారు. అది చదివి చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు, సుబ్రహ్మణ్యశాస్త్రిగారి మీద మరీ అగ్గిమీద గుగ్గిలం అయిపోయారు. ఓ మారు రాజమండ్రి ఇన్నీసుపేట వీధిలో ఇద్దరూ తలపడ్డారు కూడా. ఇద్దరి మధ్యా పరుష వాక్యాలు కూడా దొర్లాయి. అయినా వెంకట శాస్త్రిగారికి సుబ్రహ్మణ్య శాస్త్రిగారి మీద కోపం పోలేదు.

ఇలా వుండగా సుబ్రహ్మణ్యశాస్త్రిగారు 'శ్మశాన వాటిక' అని ఓ నవల వ్రాశారు. దాంతో వెంకట శాస్త్రిగారికి కొంటె ఆలోచన వచ్చింది. పాలమూరు వెడుతున్న కళా సూర్యనారాయణ గారనే వ్యక్తి ద్వారా "సుబ్రహ్మణ్యశాస్త్రిగారూ! మీ శ్మశానం చూశాను" అని కబురు చేశారు.

సుబ్రహ్మణ్య శాస్త్రిగారికి ప్రాణం చివుక్కుమంది. నన్ను ఇంత మాట అంటాడా అని కోపం కూడా వచ్చింది. వెంటనే ఆ వ్యక్తి ద్వారానే వెంకటశాస్త్రిగారికి కడియం సమాధానం పంపారు. "ఆ శ్మశానం నిర్మించింది నేనే. అయితే దాని యెడల శ్రద్ధాసక్తులు గల మీ బోటివారు దాన్ని స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు" అని.

అవును మరి! ఇద్దరూ సాహితీ సుసంపన్నులే! మాటల్లో ఎవరికి ఎవరు తీసిపోతారు?

☆

## మందా ? సంగీతం విందా?

**కథా చక్రవర్తులుగా పేరుగాంచిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. కావ్యాలు చదివారు, కవిత్వాలు వ్రాశారు. కథలతో బాటు నవలలూ, నాటకాలూ కూడా రచించారు. సంగీతంలో కృషి చేసి ఫిడేలు వాయించేవారు. కాస్తో కూస్తో ఆయుర్వేద వైద్యంలో కూడా ప్రవేశం సంపాదించారు.**

కళాభివర్ధినీ పరిషత్తు ద్వారా తన రచనల్ని తానే ప్రచురించుకుంటూ శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారు రాజమండ్రి ఇన్నీసుపేటలో కొన్నాళ్ళు ఆయుర్వేదం మందుల షాపు కూడా నడిపారు.

ఆయన మందుల షాపులో మందుల హడావిడి కంటే, అక్కడి వచ్చి చేరే కళాకోవిదుల కారణంగా సంగీత సాహిత్య గోష్ఠుల సందడీ తత్సంబంధమైన చర్చల హడావిడీ ఎక్కువగా ఉండేది.

ఒక రోజున ప్రసిద్ధ భావకవి శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రిగారు వచ్చి మందుల కొట్లో కూర్చుని "అయ్యా! ఆనంద భైరవి అందుకోండి" అన్నారు. వెంటనే శ్రీపాదవారు ఫిడేలు తీసి ఆనంద భైరవి రాగాలాపన ప్రారంభించబోయారు.

వెంటనే వేదులవారు పకపక నవ్వి "అయ్యా నాకిప్పుడు కావలసింది సంగీతం కాదు–మందు" అన్నారు. శ్రీపాదవారు కూడా నవ్వుకుని ఫిడేలు పక్కన పెట్టి ఆనంద భైరవి మందు సీసా అందుకున్నారు. "ఇందుకే అన్నారు సంగీతము చేత బేరసారములుడి గెన్ అని" అన్నారు, మందు అందిస్తూ, సవ్యసాచిలా–అటు ఆరోగ్యాన్నీ ఇటు ఆహ్లాదాన్నీ అందించగల సమర్థులైన శ్రీ శ్రీపాద.

☆

## శిరస్థదారుగారి శిరఃకంపన

**కమ్మని కథల్ని తెలుగువారికి అందించి, నవ్యాంధ్ర సాహిత్యంలో కథానికా చక్రవర్తిగా సుప్రతిష్ఠులైన శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రికి కొన్నాళ్ళు అష్టావధానం చేసి పేరూ డబ్బూ గడించాలని కోరిక బయలుదేరింది. తనతో నేత్రావధానం చేసే మల్లాది సత్యనారాయణ శాస్త్రిగారిని కూడా తీసుకుని ఆంధ్రదేశ పర్యటన ప్రారంభించారు- ఇద్దరూ కలిసి అష్టావధాన, నేత్రావధానాలు చెయ్యడానికని.**

ఆ సందర్భంలో ఓ ఊళ్ళో ఓ పెద్ద మనిషిని కలుసుకోవలసి వచ్చింది వాళ్ళిద్దరూ. ఆ పెద్ద మనిషి శిరద్దారు. ఆ రోజుల్లో శిరద్దార్లన్నా తహసీల్దారులన్నా పెద్ద గవర్నమెంటు ఆఫీసర్ల క్రింద లెక్క. ఆ శిరద్దారు, తను అక్కడ వుండగానే, తనుగా సుబ్రహ్మణ్య శాస్త్రిగారితోనూ సత్యనారాయణ శాస్త్రిగారితోనూ మాట్లాడకుండా, మరో గుమస్తాలాంటి మధ్యవర్తి ద్వారా మాట్లాడ్డం ప్రారంభించారు.

ఆ పద్ధతి చాలా చిరాకుగానూ, ఇబ్బందిగానూ తయారైంది. "ఏమిటి ఇతని అహంకారం? మాతో మాట్లాడితే అగౌరవం అనుకుంటున్నాడా? ఈ వ్యవహారం ఏదో తేల్చి ఇతని గొప్ప ఏమిటో ఊడగొడదాం" అనుకున్నారు సత్యనారాయణ శాస్త్రి. అనుకొని, మధ్యవర్తితో "ఇంతకీ అయ్యగారి ఉద్యోగం ఏమిటి?" అన్నారు. "శిరస్తదారు" అన్నాడు గర్వంగా మధ్యవర్తి. వెంటనే సత్యనారాయణ శాస్త్రిగారు పకపకా నవ్వి "ఇంట్లో అయితే కావచ్చు–అది పది మందికీ చెప్పడం ఏమిటండీ? సిగ్గు కాదూ?" అన్నారు. ఈ మారు శిరస్థదారు పెదవి కదిపి కల్పించుకుంటూ "సిగ్గెందుకూ? అది ఉద్యోగం" అన్నారు.

శాస్త్రిగారు తొణక్కుండా "క్షమించాలి. దాని అర్థం వేరే వుంది. శిరస్థదారు అంటే నెత్తిమీద భార్యను కూర్చోబెట్టుకొనేవాడు అని అర్థం" అన్నారు. 'దార' అంటే భార్య. అటువంటి భార్యని కలిగి వున్నవాడు దారు అనే అర్థం స్ఫురించి, శిరద్దారుగారు గర్వం తగ్గి మామూలుగా మాట్లాడారు శాస్త్రి ద్వయంతో.

☆

# కరువు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ. 4771.46 కోట్లు విడుదల



**రాష్ట్రంలో కరువు ప్రాంతాల్లో పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా చెల్లించేందుకు 471.46 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు విపత్తుల శాఖ కమిషనర్ (ఇన్‌చార్జి) ఎస్.బాల సుబ్రహ్మణ్యం నవంబర్ 2 ఉత్తర్వులు జారీ చేశారు.**

కరువు కారణంగా ఖరీఫ్‌లో ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, నెల్లూరు, కర్నూలు, ఆదిలాబాద్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, పశ్చిమగోదావరి, కృష్ణా, చిత్తూరు, అనంతపురం, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, కడప, వరంగల్ జిల్లాల్లో చిన్న, మధ్యతరగతి రైతులకు చెందిన 12,10,144,60 హెక్టార్లలో 50 శాతానికి పైగా పంటలు ఎండిపోయినట్లు, నష్టపోయినట్లు వ్యవసాయశాఖ నిర్ధారించింది.

దీంతో వీరికి ఇన్‌పుట్ సబ్సిడీగా చెల్లించేందుకు వీలుగా విపత్తుల శాఖ 471.46 కోట్ల రూపాయలను వ్యవసాయ శాఖకు విడుదల చేసింది. ఇన్‌పుట్ సబ్సిడీ పొందే చిన్న, మధ్యతరగతి రైతులు ఏడు లక్షల మంది ఉంటారని అధికార వర్గాలు తెలిపాయి. ట్రెజరీ, త్రైమాసిక ఆంక్షలను మినహాయించి మరీ ఈ మొత్తాన్ని విడుదల చేస్తున్నట్లు విపత్తుల శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇన్‌పుట్ సబ్సిడీని రైతులకు చెక్‌ల రూపంలో అందచేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

– ఆర్.కె.

**కరువు ప్రాంతాల్లో పంటల వారీగా హెక్టార్‌కు ఇస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ వివరాలు ఈ విధంగా ఉన్నాయి.**

| పంట పేరు | హెక్టార్‌కు (రూపాయల్లో) | మొత్తం దెబ్బతిన్న హెక్టార్లు | మొత్తం ఇన్‌పుట్ సబ్సిడీ(రూ.కోట్లలో) |
|---|---|---|---|
| వరి | 4,500 | 82222.17 | 36.99 |
| మొక్కజొన్న | 3,750 | 308361.38 | 115.64 |
| జొన్న | 3,000 | 65422.37 | 19.63 |
| సజ్జలు | 3,000 | 6635.73 | 1.99 |
| రాగులు | 3,000 | 104.38 | 0.03 |
| చెరకు | 4,500 | 4658.18 | 2.09 |
| కంది | 3,750 | 34159.00 | 12.80 |
| పెసర | 3,750 | 141465.63 | 53.04 |
| మినుము | 3,750 | 44251.91 | 16.59 |
| ఆలసంద | 3,750 | 1950.00 | 0.73 |
| పత్తి | 4,500 | 138979.21 | 62.54 |
| వేరుశనగ | 4,500 | 161801.40 | 72.81 |
| సోయాబీన్ | 3,750 | 116083.57 | 43.53 |
| ఆముదం | 3,000 | 77507.70 | 23.25 |
| నువ్వులు | 3,000 | 3356.99 | 1.00 |
| సన్‌ఫ్లవర్ | 3,750 | 22899.89 | 8.59 |
| పొగాకు | 6,000 | 285.00 | 0.17 |
| **మొత్తం** | **-** | **12,10,144.60** | **471.46** |



# ఆసక్తి, స్ఫూర్తి కలిగించిన ఆదర్శ పంచాయితీల సందర్శన

## మహారాష్ట్ర లోని ఆదర్శ పంచాయితీలు హివ్రే బజార్, రాలేగావ్ సిద్ధిలను సందర్శించిన రాష్ట్ర సర్పంచులు

**నవంబర్, 2009 నెల స్థానికపాలనలో పేర్కొన్న విధంగా మహారాష్ట్రలోని ఆదర్శ పంచాయితీలను మన రాష్ట్ర సర్పంచులు సందర్శించే కార్యక్రమం ప్రారంభమైంది. పారిశుద్ధ్యం, ఆరోగ్యం, అక్షరాస్యత, మద్య నియంత్రణ, ప్రణాళికారచనలో, పాలనలో ప్రజల భాగస్వామ్యం మొదలైన లక్షణాలుగల "హివ్రేబజార్" పంచాయితీని, నీటి నిల్వలు పెంచే పద్ధతులు అవలంబించడం ద్వారా వర్షాభావ ప్రాంతాన్ని నీటి తెన్నెలుగా మార్చిన "రాలేగావ్ సిద్ధి" పంచాయితీలు సందర్శించటమే కాక ఆ పంచాయితీల నాయకులు పోపట్‌రావ్ పవార్, అన్నా హజారేలతో మాట్లాడి స్ఫూర్తి పొందటానికి ఏర్పాట్లు జరిగాయి.**

ఎ.యం.ఆర్. అపార్డ్ ఈ బృహత్త కార్యక్రమాన్ని రూపొందించి, జాతీయ సామర్థ్యాల పెంపు కార్యక్రమంలో భాగంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (బి.ఆర్.జి.ఎఫ్) మార్గదర్శకాలలో ఆదర్శ పంచాయితీల సందర్శన ఏర్పాటు చేసింది. ఆదర్శ పంచాయితీలను సందర్శించటం ద్వారా స్ఫూర్తిని పొంది, అటువంటి ఆదర్శవంతమైన మార్గాలను తమ పంచాయితీలలో ఆచరించడానికి, తమ గ్రామాలను కూడా అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్ళేందుకు ఈ కార్యక్రమం సర్పంచులకు, ఇతర ప్రజాప్రతినిధులకు ఎంతో స్ఫూర్తి దాయకం కాగలదు. ఆదర్శ పంచాయితీలను సందర్శించేటప్పుడు క్రింది అంశాలను దృష్టిలో ఉంచుకొని వారి కృషిని పరిశీలించాలని చెప్పటం జరిగింది. 1. సామాజిక అడవులు, ప్రకృతి సంపదల నిర్వహణ, 2.త్రాగునీటి సంరక్షణ, సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 3. ప్రజా ఆరోగ్యం గురించి అవగాహన కల్పించటం, 4. సార్వత్రిక, ప్రాథమిక విద్య, 5. పాలనలో పారదర్శకత, నిబద్ధత, 6. పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచటంలో పాత్ర.

ఈ కార్యక్రమాన్ని అపార్డ్ ప్రాంతీయ విస్తరణ శిక్షణ కేంద్రాల (ఇ.టి.సి.) ద్వారా నిర్వహించాలని సంకల్పించటం జరిగింది. రాష్ట్రంలోని 22 జిల్లాలలో పంచాయితీరాజ్ ప్రజా ప్రతినిధులు మొత్తం 2 లక్షల 60 వేలు ఉన్నారు. అందులో ముందుగా సర్పంచులకు ఆదర్శ పంచాయితీలను సందర్శించే ఏర్పాట్లు చేయటం జరిగింది. ఒక్కో ఇ.టి.సి. పరిధిలో గల 4 లేక 5 జిల్లాల సర్పంచులను హివ్రే బజార్, రాలేగావ్ సిద్ధితో పాటు వివిధ రాష్ట్రాలలో గల ఇతర ఆదర్శ పంచాయితీలను సందర్శింపజేయాలని కార్యక్రమ రూపకల్పన చేయటం జరిగింది.

ముందుగా ఇ.టి.సి. రాజేంద్రనగర్ పరిధిలో గల 5 జిల్లాలలో ప్రజాప్రతినిధులను పంపేందుకు కార్యక్రమం రూపొందించబడింది.

### ఆదర్శ పంచాయితీల సందర్శనా కార్యక్రమ రూపకల్పన

విస్తరణ శిక్షణా సంస్థల ప్రిన్సిపాల్సు, ఫ్యాకల్టీ సభ్యులతో అపార్డ్‌లో ఒక వర్క్‌షాపు నిర్వహించి, కార్యక్రమ రూపకల్పన చేయటం జరిగింది. ఒక్కొక్క జిల్లాకు ఒక్కొక్క ఫ్యాకల్టీ మెంబర్‌ను బాధ్యులుగా నియమించటం జరిగింది. వివిధ జిల్లాలలో ఉత్తమ గ్రామ



పంచాయితీ సర్పంచులు, పాలనలో మెరుగైన పద్ధతులు అవలంబించిన సర్పంచుల వివరాలను జిల్లా పంచాయితీ అధికారుల నుండి తెప్పించి, వారిలో జిల్లాకు 40 మంది సర్పంచులుగల టీంను ఆదర్శ పంచాయితీల సందర్శనకు తీసుకెళ్ళేందుకు నిర్ణయించటమైనది. మార్గమధ్యలో కూడా ఆదర్శ పంచాయితీలుంటే అవికూడా సందర్శించేలా కార్యక్రమ రూపకల్పన చేయబడింది.

రాజేంద్రనగర్ ఇ.టి.సి. పరిధిలో గల 5 జిల్లాలు ఆయా జిల్లాల సర్పంచ్‌లు కేంద్రాల నుండి మహారాష్ట్రలోని హివ్రే బజార్, రాలేగావ్ సిద్ధి వెళ్ళేలా ఏర్పాటు చేయబడింది. మొదటి బ్యాచ్ రంగారెడ్డి జిల్లా సర్పంచులకు ఏర్పాటు చేయబడింది. రూపొందించిన కార్యక్రమం ప్రకారం 23-10-2009 ఉదయం 11.00 గం.లకు సర్పంచులంతా ఇ.టి.సి. రాజేంద్రనగర్‌కు చేరుకున్నారు. పరస్పర పరిచయాలు అయ్యాక కార్యక్రమ ఉద్దేశ్యాల్ని, మార్గ మధ్యలో పాటించాల్సిన నియమాల్ని సమన్వయ కర్త డా॥ అనురాధ వివరించారు. మధ్యాహ్న భోజనానంతరం ప్రతినిధులు అపార్డు కమీషనర్ శ్రీ ఫణికుమార్ గార్ని కలుసుకున్నారు. "ప్రతిరోజూ వందలాది సర్పంచుల్ని, విదేశీ ప్రతినిధుల్ని ఆకర్షిస్తున్న హివ్రేబజార్ సర్పంచ్ పోపట్‌రావ్ పవార్‌లోని ప్రతిభను గుర్తించి, అటువంటి స్ఫూర్తిదాయకమైన సర్పంచ్‌గా ఎదగటానికి కృషి చేయాలని" శ్రీ ఫణికుమార్ ప్రతినిధులకు పిలుపునిచ్చారు.

తరువాత ప్రతినిధులు జాతీయ గ్రామీణాభివృద్ధి అకాడమీ (యన్.ఐ.ఆర్.డి.)లో డైరెక్టర్ జనరల్ శ్రీ బి.కె. సిన్హా, ఐ.ఎ.ఎస్. గారిని కలిసారు. డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ, ఆదర్శ పంచాయితీల సందర్శన వంటి కార్యక్రమాలు సర్పంచులలో అవగాహన పెంచటంలో చాలా ఉపయోగపడతాయని అన్నారు. ఆయా పంచాయితీలు చేపట్టిన విధానాలను అనుకరించి, మన పంచాయితీలను కూడా అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు. తరువాత శ్రీ బి.కె. సిన్హా పచ్చ జెండా ఊపి లాంఛనంగా ఆదర్శ పంచాయితీల సందర్శనా యాత్రను ప్రారంభించారు. రాజేంద్రనగర్ నుండి సంగారెడ్డి మీదుగా వెళుతూ మొదటి మజిలీగా జహీరాబాద్‌లోని "దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ"ని సందర్శించటం జరిగింది.

## దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డి.డి.యస్)

డి.డి.యస్. మెదక్ జిల్లాలో దాదాపు 75 గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల చైతన్యం కోసం, మహిళలు, దళితుల అభివృద్ధి, హక్కుల కోసం కృషి చేస్తోంది. తమ సంఘాలు వివిధ అంశాలలో స్వయం ప్రతిపత్తికై పని చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు చెప్పారు. 1985 నుండి దాదాపు 10 వేల ఎకరాలలో పంటలు పండించటం ద్వారా 3 లక్షల కిలోల పంటల్ని పండించారు. అలాగే 1996 నుండి ప్రత్యామ్నాయ ప్రజా పంపిణీ విధానాన్ని కూడా స్వయంగా రూపొందించారు. ఈ విధానం వల్ల స్థానిక ఉత్పత్తి, స్థానిక నిల్వ, స్థానిక పంపిణీ విధానాన్ని ఏర్పాటు చేశారు. ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల సాధించారు. విత్తనాలకై మార్కెటుకు వెళ్ళకుండా తమ గ్రామాల్లోనే ఉత్పత్తి కవసరమైన విత్తనాన్ని పండిస్తున్నారు. డి.డి.యస్. సంఘాలు వివిధ పద్ధతులు అవలంబించటం ద్వారా ప్రకృతి వనరులపై కూడా నియంత్రణ సాధించారు. అందరికీ సంబంధించిన భూమిని అభివృద్ధి చేయటం, చెట్లు నాటడం, వృక్షమిత్ర వంటి నినాదాల్ని ప్రచారం చేయటం, వైద్య మూలికల చెట్లను పెంచటం, వాటర్‌షెడ్ కార్యక్రమాలు చేపట్టడం ఇందులో ముఖ్యమైనవి. ప్రపంచీకరణ కాలంలో మార్కెట్ నియంత్రణ అనేది సంఘాల ద్వారా అమలు చేయటం గుర్తించదగింది. స్వంత మార్కెట్‌ను తమ 2000 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. మొబైల్ వాహనం ద్వారా ఉత్పత్తుల్ని చుట్టు ప్రక్కల గ్రామాల్లో విక్రయిస్తున్నారు. సభ్యులలో కొందరికి వీడియో, కెమెరా, ఫొటోగ్రఫీ వంటివి నేర్పించారు. స్వంతంగా మీడియా ట్రస్టు ఏర్పాటు చేసుకున్నారు. ప్రకృతి వనరులు, వ్యవసాయం, మహిళలు మొదలగు అంశాలపై డాక్యుమెంటరీలు నిర్మించారు. బాల్వాడిలో రాత్రి పాఠశాలలు నిర్వహించటం ద్వారా అక్షరాస్యతను పెంచారు. నిరంతర పరిశోధన, ప్రచురణల ద్వారా ప్రజలలో విజ్ఞానాన్ని పెంచే కృషి కూడా జరుగుతోంది. డి.డి.యస్.లో రాత్రి భోజనం పూర్తి చేసుకుని, ప్రతినిధులు హివ్రేబజార్ కు బయలుదేరారు.

రెండో రోజు ఉదయం 6 గం.లకు హివ్రే బజార్ దగ్గరలోని జిల్లా కేంద్రమైన అహ్మద్‌నగర్‌లో స్నాన పానాదులు ముగించుకొని హివ్రేబజార్ పంచాయితీ వెళ్ళటం జరిగింది.

## హివ్రేబజార్

ఆ గ్రామ సర్పంచ్ శ్రీ పోపట్‌రావ్ పవార్ మనరాష్ట్ర సర్పంచులను సాదరంగా ఆహ్వానించారు. పరిచయాల తర్వాత హివ్రే బజార్ ఈ స్థాయికి రావటంలో ప్రజల విశ్వాసం, పాత్ర, తన వంతు కృషి మొదలైనవి వివరించారు. వారు చెప్పిన వివరాలు ఇలాగ ఉన్నాయి.

1985-86 ప్రాంతంలో హివ్రే బజార్ ఒక ఎడారి. నీళ్ళు లేవు, పంటలు లేవు, పశువులు తరచూ చనిపోయేవి. ప్రజలు పనులకోసం వలసలు పోతుండేవారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు రావటానికి

ఆసక్తి చూపేవారు కాదు. గ్రామంలో మద్యం ఏరులై పారేది. ఆ సమయంలో పోపట్‌రావు పవార్ విశ్వవిద్యాలయంలో ఎం.కాం. చదువుతుండేవారు. క్రీడల్లో ఛాంపియన్. ఉన్నత విద్య తరువాత తన గ్రామానికి తిరిగి రాగానే దుర్భర పరిస్థితులను గమనించి, గ్రామాన్ని మార్చాలంటే ప్రజల్లోనే మార్పు తేవాలని గుర్తించారు. గ్రామ సభలో సమస్యలపై స్పందించేవారు. ఉద్యోగ ప్రయత్నం చేయలేదు. తన జీవితాన్ని గ్రామీణాభివృద్ధికే అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు.

పంచాయితీ ఎన్నికలలో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై, గ్రామ సభ నిర్వహించి, గ్రామాభివృద్ధికి ఉద్దేశాన్ని వివరించి ప్రజల అభీష్టాన్ని కోరాడు. జనం, జలం, జంతువులు, జంగల్ (అడవి) : ఈ నాలుగు గ్రామంలో సమృద్ధిగా ఉండాలంటే ఏం చేయాలో ఆలోచించాలన్నాడు. చెప్పగా చెప్పగా, ప్రజల ఆలోచనల్లో మార్పు వచ్చింది. దాదాపు 50 లక్షల మొక్కల్ని గ్రామంలోనూ, చుట్టు ప్రక్కల నాటారు. పశువుల కోసం సమిష్టిగా గడ్డి పెంచారు. మూడు వాటర్‌షెడ్‌ల నిర్మాణం చేపట్టి వాటి ద్వారా 1000 ఎకరాలలో పంటలు పండించసాగారు. డైరీ సహకార సంఘాల ద్వారా పాల ఉత్పత్తి పెంచి రోజుకు 3000 లీటర్లు ఉత్పత్తి చేయగలుగుతున్నారు. భవిష్యత్తులో ఈ ఉత్పత్తిని 10 వేల లీటర్లకు పెంచాలని ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను హైస్కూలు స్థాయికి పెంచారు. విద్యార్థులలో 99 శాతం హాజరు ఉండేటట్లు చేసారు. ప్రజల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఎవరూ లేకుండా చేయగలిగారు. అందరి ఇళ్ళలో మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాలకు వెళ్ళే ముందు విద్యార్థులే వారి వాడలను ఊడ్చుతారు. మద్యం మచ్చుకైనా గ్రామంలో కనిపించకుండా చేసారు. గ్రామంలో 60 వేల లీటర్ల సామర్థ్యంగల ఓవర్‌హెడ్ ట్యాంకు కట్టించగలిగారు. గ్రామంలో కొత్త బోర్‌వెల్స్ నిషేధించారు. నీళ్ళ ట్యాంకును నెలకోసారి శుభ్రం చేస్తారు. ప్రతి రోజూ నీరు సరఫరా చేస్తారు.

ప్రజలందరికీ నెల కొకసారి రక్త పరీక్షలు నిర్వహిస్తారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించేలా ప్రచారం చేస్తారు. వివాహానికి ముందు హెచ్.ఐ.వి పరీక్షలు స్వచ్ఛందంగా చేయించుకోవాలని గ్రామ సభ తీర్మానించింది. గుట్కా, పాన్‌లు, పొగత్రాగటం లాంటివి గ్రామంలో నిషేధం. అన్ని గృహాలకూ విద్యుత్ సౌకర్యం కల్పించబడింది. విధిగా గ్రామస్థులంతా మరుగుదొడ్లను వినియోగించాలి. బహిరంగ ప్రదేశాలలో మల విసర్జన చేయరాదు.

గ్రామంలో జొన్నలు, గోధుమలనే ఎక్కువగా పండిస్తారు. ఉల్లి పంట పండిస్తారు. చెరకు పంట నిషేధం. భవిష్యత్తులో 10 వేల లీటర్ల పాల ఉత్పత్తికవసరమైన వంటలను ఏర్పాటు చేయటానికి వ్యూహరచన చేస్తున్నట్లు సర్పంచ్ పోపట్‌రావ్ చెప్పారు. సర్పంచ్ పవార్ గారితో సందేహ నివృత్తి కార్యక్రమం ముగిసిన జరిగిన తర్వాత మన సర్పంచులు గ్రామం అంతా తిరిగి సర్వే చేశారు. వీధులన్నీ శుభ్రంగా ఉండటాన్ని గమనించారు. గ్రామ ప్రజలంతా తమని స్నేహ పూర్వకంగా పలకరించడాన్ని గమనించి సంతోషించారు. మనవాళ్ళు కూడా గ్రామంలోని విద్యార్థుల్ని, వృద్ధుల్ని, మహిళల్ని పలకరించారు.

గ్రామంలో ప్రజలందరూ ఒకే తాటిపై నిలబడి, ఒకేమాటపై నిర్ణయాలు చేయగలగటానికి దారితీసిన పరిస్థితులు, ఐక్యత వల్ల గ్రామానికి ఒనగూరుతున్న ప్రయోజనాన్ని వారి ద్వారానే విని మన సర్పంచులు స్ఫూర్తి పొందారు. తమ పంచాయితీల పరిధిలో కూడా ప్రజల్ని ఒకే తాటిపైకి తేవటానికి గల మార్గాలేమిటని చర్చించుకోవటం ప్రారంభించారు. వాటర్‌షెడ్‌లను సందర్శించారు. కొండల్లో, గుట్టల్లో నీటి చెలమలని పెంచటానికి ఎటువంటి శ్రమ తీసుకున్నారో గుర్తించారు. మన ప్రాంతంలో, మన రాష్ట్రంలో గల వాతావరణ పరిస్థితులతో తులనాత్మకం చేసే ప్రయత్నం చేశారు. హివ్రేబజార్ అందుకున్న పురస్కారాలు: 1. ఆదర్శపంచాయితీ, 1995; 2. యశ్వంత్ రావ్ గ్రామ వికాస్ అవార్డు-2000; 3. నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డు - 2007; 4. జాతీయ జల మండలి అవార్డు-2007; 5. ఉత్తమ సర్పంచ్ అవార్డు-2006, 2007, 2008. మన గ్రామాలు కూడా ఇటువంటి పురస్కారాలు అందుకోవాలనే తపన మన సర్పంచులలో కనిపించింది. భవిషత్యత్ కార్యక్రమాలు కూడా శ్రీ పవార్ వివరించారు. వాటిలో ముఖ్యమైనవి:

1. ఉత్పత్తి, మార్కెటింగ్ రంగాలలో వ్యూహాలు, 2. ప్రతి ఇంటిలో ఒక్కరికైనా కంప్యూటర్ విద్యను అందించటం ద్వారా ఇ-నాలెడ్జి సొసైటీ నిర్మాణం, 3.పది వేల లీటర్ల పాల ఉత్పత్తి 4. కోటి రూపాయల ఉల్లి పాయల ఉత్పత్తి గ్రామసభ, పంచాయితీ స్వయం ప్రతిపత్తితో వ్యవహరించేలా ఏర్పాట్లు.

తర్వాత సర్పంచులు వాటర్‌షెడ్‌లకు ప్రసిద్ధి చెందిన రాలేగావ్ సిద్ధికి ప్రయాణమయ్యారు.

## రాలేగావ్ సిద్ధి

రాలేగావ్ సిద్ధి ప్రముఖ సంఘసేవకులు, పర్యావరణవేత్త, శ్రీ అన్నా హజారే స్వగ్రామంగా ప్రసిద్ధి చెందింది. అతి తక్కువ కాలంలో భూగర్భ



ఉపరితలాల నీటి నిల్వలు పెంచటం ద్వారా అత్యంత రాళ్ళు, గుట్టలు మయమైన రాలేగావ్ సిద్ధి గ్రామాన్ని సస్యశ్యామలంగా మార్చటంలో శ్రీ అన్నా హజారే కృషి , పట్టుదల, గ్రామాన్నంతా ఒకే తాటిపైకి తేగల నాయకత్వ పటిమ ఈ కాలపు సర్పంచులందరికీ స్ఫూర్తి దాయకం. ఎడారి ప్రాంతాలైన రాలేగావ్ సిద్ధి లాంటి గ్రామాలు స్వయంప్రతిపత్తిగల, స్వయం సంపన్నంగా ఎలా పరిణామం చెందిందో అడ్డంకిగా నిలుస్తాయి. అయితే ప్రతికూల వాతావరణం ఎప్పుడూ కార్యకర్తకు పరీక్షలాంటిదే. జీవితంలో లక్ష్యాన్ని ఏర్పర్చుకోని వ్యక్తి జీవించినా మరణించినట్లే లెక్క. వాక్కు, ఆచరణ ఒకటై ఉండాలి. పిల్లలు రోడ్లపై మల మూత్రాలు విసర్జించతే అది తల్లి దండ్రుల శిక్షణ వైఫల్యంగానే భావించాలి. అలాగే గ్రామంలో ప్రజలు సత్ప్రవర్తనతో లేకపోతే, అది గ్రామ నాయకుడు అంటే సర్పంచుదే



అన్నా హజారే మాటల్లోనే తెలుసుకుందాం. రాలేగావ్ సిద్ధి జనాభా 2000. వార్షిక వర్షపాతం 400-500 మి.మీ (15"- 20"). పంటలు సరిగా పండేవి కావు, త్రాగునీరు లేదు, పశుగ్రాసం కూడా సరిగా పెరగదు. నాటు సారాయి వంటివి ప్రజల్ని నిర్వీర్యం చేశాయి. ఇదంతా 1975 ముందు సంగతి. ఆ నాటికి అన్నాహజారే సైన్యంలో పనిచేస్తున్నారు. 1975 లో అన్నా హజారే సైన్యం నుండి గ్రామానికి తిరిగిరాగానే, గ్రామ దుర్భర పరిస్థితిని అర్థం చేసుకున్నారు. తక్షణమే 5 బావులు తవ్వించి, పాఠశాల, హాస్టలు, గ్రామస్థులకు నీటి సరఫరా ఏర్పాట్లు చేశారు.

ప్రారంభంలో అన్నా హజారేకు గ్రామస్తుల సహకారం అంతగా లభించలేదు. అధికారులు కూడా తమ ఆధిపత్యం జారిపోతుందేమోనని భయంతో సహకరించలేదు. ఒకటి రెండు సార్లు ఉత్తర ప్రత్యుత్తరాలతో పని కానప్పుడు పై అధికారులను కలవటం, కొన్ని సందర్భాలలలో నిరసన తెలపటం కూడా చెయ్యాల్సి వచ్చింది. అన్నాహజారే అనుభవం ప్రకారం సామాజిక కార్యకర్తలకు ఎన్నో అడ్డంకులు, అవరోధాలు ఉంటాయి. మొదట్లో గ్రామస్తులు, స్వంత కుటుంబ సభ్యులు కూడా సహాయ నిరాకరణ చేస్తారు. గ్రామంలోని ఆచారాలు, సంప్రదాయాలు బాధ్యత. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా సంక్రమించిన అధికారాలు గ్రామాలకివ్వాలి. అలాగే ప్రజలకు సమాచార హక్కును ఇవ్వాలి. చాలా ఆడ్డంకులన్ని అధిగమించి అన్నా హజారే చేసిన కృషి వల్ల రాలేగావ్ సిద్ధి నాడు - నేడు ఎలాగ ఉందో ఈ క్రింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

| వివరాలు | 1975 | 2008 |
|---|---|---|
| సాగుభూమి | 150 | 1700 |
| పశుగ్రాసం (టన్నులు) | - | 500 |
| వార్షిక పనిదినాలు | 15 | 200 |
| పాఠశాల స్థాయి | 4వ తరగతి | 12వ తరగతి |
| పంటలు | ఖరీఫ్ (ఒక్కటే) | ఖరీఫ్, రబీ |
| పాల ఉత్పత్తి (రోజుకు) | 150 లీటర్లు | 3,000 లీటర్లు |
| తలసరి ఆదాయం (రూ.) | 200-225 | 2000 |
| మహిళా సంఘాలు (సంఖ్య) | - | 17 |
| పొదుపు (లక్షల రూ.) | - | 50 |
| మద్యపానం | చాలా ఉండేది | పూర్తి నిషేధం |

రాలేగావ్ సిద్ధి పర్యటన తరువాత దారిలో మహారాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించటం జరిగింది. వ్యవసాయ రంగంలో వస్తున్న అనూహ్య మార్పులు, వంగడాలపై పరిశోధనలు మొదలైన అంశాలతో పాటు, సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారా కలిగే లాభాలను గూర్చి సర్పంచులకు అక్కడ ఆచార్యులు వివరించారు. హైదరాబాద్ తిరిగివచ్చిన తరువాత, సర్పంచులు తమ అభిప్రాయాల్ని అపార్డు కమీషనర్ గారికి ఈ విధంగా తెలియజేసారు.

1. ప్రజలలో చైతన్యం తీసుకురావటంలో శ్రీ పోపట్‌రావ్ పవార్ పాత్ర ఎంతో స్ఫూర్తి దాయకమైనది. ప్రజలకు శుభ్రత పట్ల అవగాహన, చైతన్యం కల్గించటం, గ్రామాభివృద్ధి పట్ల అంకిత భావంతో పని చేయటం నాకు ఎంతో స్ఫూర్తి నిచ్చింది. ఇక నుండీ నేను నా గ్రామంలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత కల్పిస్తూ బహిర్భూమిని బహిష్కరించేలా కృషి చేస్తాను. మద్యపాన నిషేధం, ప్లాస్టిక్ వాడకం నియంత్రణ చర్యలు చేపడతాను.

- **శ్రీ యం. దేవయ్య, సర్పంచ్,**
ఏక్ మామిడి, నవాబ్‌పేట మండలం

2. గ్రామాభివృద్ధిలో ప్రజల అభిప్రాయాలకు, నిర్ణయాలకు ప్రాముఖ్యత ఇవ్వబడుతుంది. గ్రామ అభివృద్ధికి గ్రామ సభను శక్తివంతం చేయటం మినహా మరో మార్గం లేదు. ఇక నుంచి గ్రామంలో అక్షరాస్యత పెంచటం, సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయటం నా ప్రధాన కార్యక్రమాలు.

- **శ్రీ మదన్ మోహన్, సర్పంచ్,**
మంఖాల్, మహేశ్వరం మండలం

3. మా గ్రామాన్ని కూడా హివ్రే బజార్ లాగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తీర్చిదిద్ది ప్రభుత్వ భూమిలో చెట్లు నాటించి, సస్యశ్యామలం చేస్తాను.

- **శ్రీమతి లక్ష్మమ్మ, సర్పంచ్,**
**ముజాహిద్‌పూర్ , కులకచర్ల మండలం**

4. చెక్‌డ్యాంల నిర్మాణం బాగుంది. పారిశుద్ధ్యం, కుటుంబ నియంత్రణ మొదలగు అంశాలు ఆసక్తిదాయకంగా ఉన్నాయి. మా పంచాయితీలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించి దోమలులేని గ్రామంగా తీర్చి దిద్దుతాను.

- **శ్రీమతి నాగమణి, సర్పంచ్,**
**కొత్తగూడెం, నల్గొండ జిల్లా**

5. హివ్రే బజార్ ప్రజల్లో క్రమ శిక్షణ చాలా గొప్పగా ఉంది. అదే మనలో లోపించింది. నీటి నిర్వహణ ఎంతో మార్గదర్శకంగా ఉంది. నేను ఇక ముందు ఈ రెండు అంశాలలో కృషి చేయటంతో పాటు ప్రజల్లో శ్రమదానం పట్ల సానూకూలంగా ప్రేరేపిస్తాను.

- **శ్రీమతి కె. అరుణ, సర్పంచ్,**
**నాచారం, యాదగిరిగుట్ట మండలం**

6. పారిశుద్ధ్యం, నీటి నిర్వహణ, వాటర్‌షెడ్‌ల నిర్మాణం ఎంతో బాగుంది. పెళ్ళికి ముందు హెచ్.ఐ.వి. పరీక్షలు నిర్వహించాలన్న గ్రామ సభ తీర్మానం చాలా బాగుంది. నా పంచాయితీలో గ్రామ సభను శక్తివంతం చేయటం, గ్రామ సభకు అధిక శాతం హాజరు మొదలైనవి నా భవిష్యత్తు కార్యక్రమం.

- **శ్రీ ప్రకాష్, సర్పంచ్, బెజ్జోర్,** భీంగల్ మండలం

7. గ్రామంలో డైరీ అభివృద్ధి ఎంతో బాగుంది. నా గ్రామంలోని డైరీని అభివృద్ధి చేస్తాను. మరింత సమాచారం కోసం మా గ్రామం నుండి మళ్లీ ఒక టీంను హివ్రే బజార్ పంచాయితీని సందర్శించేలా ఏర్పాటు చేస్తాను.

- **శ్రీ డి. రవి**

8. వాటర్‌షెడ్‌ల నిర్వహణ బాగుంది. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. మా పంచాయితీలో కూడా అటువంటి ఆదర్శవంతమైన పనులు చేపట్టి పోపట్‌రావు లాంటి నాయకత్వాన్ని అందిస్తాను.

- **శ్రీమతి బాలమణి, సర్పంచ్, పాలకొండ,**
మహబూబ్‌నగర్ మండలం

9. నాయకులలో పట్టుదల ఉంది. దూరదృష్టి ఉంది. ప్రజల్ని ప్రేరేపించే శక్తి ఉంది. మనం ప్రజలకు మన పట్ల విశ్వాసం కల్గించాలి. వ్యక్తిగత జీవితంలో ఆదర్శంగా ఉండాలి. నాయకులుగా ఎదగాలి.

- **శ్రీ భూపతి రెడ్డి, సర్పంచ్, వెల్చండ,** మహబూబ్‌నగర్

10. ప్రజలతో మమేకం కావటం అనేది ఎంతో ఆసక్తిదాయకం, ఆదర్శకరం. మద్య పానం, మత్తు పదార్థాలను పాలద్రోలటం మొదలైనవి వ్యక్తిగత క్రమ శిక్షణా ద్వారా మాత్రమే సాధించగలం. ఇటువంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయటం ద్వారా అపార్డు వారు మాకు ఎంతో చైతన్యాన్ని అందించారు. ఈ చైతన్యాన్ని ప్రజలకు చేరవేయటం అనేది మాముందున్న కర్తవ్యం.

- **శ్రీ బాలగౌడ్, గుడిమల్కాపూర్,** హన్వాడ మండలం

ప్రాంతీ విస్తరణ శిక్షణా కేంద్రం రాజేంద్రనగర్ పరిధిలోని రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్ జిల్లాల సర్పంచులకు కనీసం ఒక్కొక్క జిలా నుంచి ఒక్కొక్క టీం సందర్శనా కార్యక్రమాలు పూర్తయ్యాయి. హసన్‌పర్తి కేంద్రం నుండి ఖమ్మం, వరంగల్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాలు, బాపట్ల కేంద్రం నుండి గుంటూరు, కృష్ణా, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుండి ఆదర్శ పంచాయితీ యాత్రలు ప్రారంభమైనాయి. శ్రీ కాళహస్తి కేంద్రం పరిధిలోని చిత్తూరు, అనంతపూర్, కడప, కర్నూలు జిల్లాల నుండి కర్నాటక, తమిళనాడు ప్రాంతాలు. సామర్లకోట కేంద్రం పరిధిలోని ఉభయ గోదావరి జిల్లాల నుండి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలు తమిళనాడు, మహారాష్ట్రలకు బయలుదేరనున్నాయి.

ఈ సందర్శనా కార్యక్రమాల వల్ల సర్పంచుల పరిపాలనా విధానంలో వచ్చిన మార్పులపై అపార్డు పరిశోధన చేస్తుంది.

- **ఎ. గవర్రాజు,** ఫ్యాకల్టీ, సిడిపి & ఎ, అపార్డు
- అనురాధ, ఫ్యాకల్టీ, ఇ.టి.సి., రాజేంద్రనగర్

# అపార్డ్‌ను సందర్శించిన శ్రీ ఆర్. సుబ్రమణ్యం


గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తరువాత శ్రీ ఆర్. సుబ్రమణ్యం, ఐ.ఏ.ఎస్., అపార్డ్‌ను 06-11-2009 నాడు సందర్శించారు. వీరు గ్రామీణాభివృద్ధి శాఖలో బాధ్యతలు చేపట్టక ముందు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టరుగా పనిచేసారు. అంతకు ముందు రాష్ట్రంలో ఉట్నూరు ఐటి.డి.ఏ. ప్రాజెక్టు అధికారిగా, జిల్లా కలెక్టరుగా కేంద్రప్రభుత్వంలో ఉన్నత పదవులు లాంటి ఎన్నో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించారు.

'అపార్డు' సందర్శనలో భాగంగా మొత్తం శిక్షణ సౌకర్యాలు, లైబ్రరీ, ఐ.టి. సెంటర్ చూసారు. తరువాత ప్రాంతీయ విస్తరణ శిక్షణా కేంద్రాలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి అక్కడ జరిగే కార్యక్రమాల



గురించి తెలుసుకున్నారు. అపార్డులోని వివిధ విభాగాలలో పనిచేసే ఫ్యాకల్టీలతో వారు చేపట్టే కార్యక్రమాల గురించి తెలుసుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సమీక్షలు చేయాలని సలహా ఇచ్చారు. దీని కోసం ఆయా ప్రభుత్వ శాఖలతో నిత్య అనుసంధానం ఏర్పరచుకుని తగిన సలహాలు ఎప్పటికప్పుడు ఇవ్వాలని సూచించారు. ఆయా శాఖలలోని శిక్షణా అవసరాలను కూడా గుర్తించి తగిన శిక్షణా కార్యక్రమాలను రూపొందించాలని కోరారు. ఈ శిక్షణల్లో అనుభవజ్ఞులైన శిక్షకుల ద్వారా నాణ్యమైన సమాచారాన్ని అందచేయాలని సూచించారు.

మన టి.వి., 'స్థానిక పాలన' మాసపత్రిక ద్వారా అమలు జరుగుతున్న దూరవిద్యా విధానాన్ని గురించి తెలుసుకొని సంతృప్తిని వ్యక్తం చేసారు. ఇ-లెర్నింగ్ విధానం అమలుకై చేసున్న కృషిని అభినందించారు.



# వార్తల్లో 'అపార్డ్'




# గ్రామీణాభివృద్ధి, వికేంద్రీకృత ప్రణాళికీకరణపై సర్టిఫికెట్

ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, హైదరాబాదు వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'గ్రామీణాభివృద్ధి, వికేంద్రీకృత ప్రణాళికీకరణ' సర్టిఫికెట్ కోర్సు రెండవ బ్యాచ్ తరగతులు 7-11-2009న అపార్డు కమీషనర్ శ్రీ ఫణికుమార్



లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిస్, హైదరాబాద్ ఛైర్‌పర్సన్ శ్రీమతి లక్ష్మీ లింగం మాట్లాడుతూ,

గ్రామీణాభివృద్ధి రంగంలో మారుతున్న పరిస్థితులకనుగుణంగా, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అందజేస్తున్న సహాయాన్ని గ్రామీణ ప్రజలకు సక్రమంగా అందజేయటానికి అవసరమయ్యే ప్రణాళికలు రూపకల్పన చేయటానికి అవసరమయ్యే నిపుణులను తయారు చేయటం కోసం ఈ సర్టిఫికెట్ కోర్సును రూపొందించటం జరిగిందని తెలియజేసారు. ఈ సర్టిఫికెట్ కోర్సులో 4 డి.ఆర్.పి.లు, 5 ఓపెన్ విద్యార్థులు, 8 మంది ఎం.పి.డి.ఓ.లు, 3 ఇ.ఓ.ఆర్.డి.లు శిక్షణ పొందుతున్నారు. 15 వారాల పాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమాన్ని డిసెంబర్ వరకూ

మహారాష్ట్రలోని తుల్జాపూర్ 'టిస్' క్యాంపస్‌లో, డిసెంబర్ - ఫిబ్రవరి వరకూ అపార్డ్, హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.

టిస్ తుల్జాపూర్‌లో సర్టిఫికెట్ కోర్సు విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆహ్వాన కార్యక్రమంలో పాల్గొన్న ఉస్మానాబాదు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ శ్రీమతి గోదావరి కేంద్రె మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వికేంద్రీకృత ప్రణాళికలు ఎంతో ఉపయోగపడతాయని, అటు వంటి ప్రణాళికల రూపకల్పనలో శిక్షణ అందచేయటానికి ముందుకు వచ్చిన 'టిస్', అపార్డుల ప్రయత్నాలు అభినందనీయం అని అన్నారు.


అపార్డ్ తరపునుంచి డా. వి.ఎస్.ఎస్. ప్రసాద్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నుంచి డా. పి. నరేంద్ర బాబు ఈ కోర్సును సమన్వయిస్తున్నారు.


ఈ కోర్సులో ముఖ్యంగా గ్రామీణ వాతావరణం, మానవ వనరులు, ప్రకృతి వనరులు, వాటి అభివృద్ధికై అవకాశాలు, అమలులో ఇబ్బందులు, మానవ హక్కులు, రాజ్యాంగం కల్పించిన హక్కులు, సమానత్వం, సమన్యాయం, భాగస్వామ్య అభివృద్ధి ప్రణాళికలు, సూక్ష్మ ప్రణాళికల తయారీ, అమలుపై సమీక్షా విధానాలు మొదలైన వాటిపై శిక్షణ ఇస్తారు.

## క్రష్ ప్రారంభం

బ్లూమ్స్ క్రష్‌ని బాలల దినోత్సవ సందర్భంగా నవంబర్ 14 న అపార్డ్ కార్యాలయంలో ఎ.పి. స్టేట్ లెవెల్ జి.ఓ-ఎన్.జి.ఓ కొలాబరేషన్ కమిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్, శ్రీ టి. గోపాలరావు, ఐ.ఏ.ఎస్ (రిటైర్డ్) ప్రారంభించారు. శ్రీ గోపాలరావుగారు మాట్లాడుతూ క్రష్ ప్రారంభోత్సవం చాలా హర్షనీయం అని తెలిపారు. రాష్ట్ర స్థాయి శిక్షణా సంస్థలలో క్రష్ సేవలందించటం బహుశా అపార్డులోనే ప్రథమం అని పేర్కొన్నారు. క్రష్‌లు, బేబి కేర్ సెంటర్‌లు పిల్లల్లోని సృజనాత్మకతను, క్రమశిక్షణను పెంపొందించేలా దోహద పడుతున్నాయని అన్నారు.

శ్రీ తకియుద్దీన్, 'అపార్డ్' జాయింట్ డైరెక్టరు మాట్లాడుతూ, అపార్డ్‌లో గత పది సంవత్సరాల నుండి మహిళా అభివృద్ధి, మహిళా సాధికారితకు




ఎన్నో శిక్షణ కార్యక్రమాలను జరిగాయని, అయితే శిశువుల అభివృద్ధి కొరకు ముందు ముందు పలు శిక్షణా కార్యక్రమాలను రూపొందించాలన్న ఆలోచన ఉందన్న విషయాన్ని తెలిపారు.



సి.డబ్ల్యు.సి.డి సెంటర్ హెడ్, డా॥ ఇ.వి. స్వర్ణలత మాట్లాడుతూ, క్రష్ విశిష్టత, ఉపయోగాల గురించి వివరించారు. పిల్లలలో సృజనాత్మకత, మానసిక, శారీరక అభివృద్ధికి తోడ్పడే అంశాలను ఆటపాటల ద్వారా నేర్పడం, అలాగే క్రమశిక్షణ, సెల్ఫ్‌హెల్ప్ స్కిల్స్‌ని పెంపొందించడం చాలా అవసరమని తెలిపారు. అపార్డ్ యందు క్రష్ స్థాపించడానికి ప్రథమ ఉద్దేశ్యం సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి ముఖ్యంగా మహిళా సిబ్బందికి పిల్లల ఆలనలో సదుపాయం కల్పించడానికి వీలవుతుందని, రెండవది అపార్డ్‌లో జరిగే శిక్షణా కార్యక్రమాలలో పాల్గొనే మహిళలకు ఇది ఎంతో ఉపయోగపడడం ద్వారా వారి శిక్షణలో పాల్గొనే వారి సంఖ్య పెరుగుతుందని ఆశించారు.

క్రష్‌లో ఆరు నెలల నుంచి ఎనిమిది సంవత్సరాలలోపు పిల్లలని చేర్చుకుంటారు. అపార్డ్‌లో పనిచేస్తున్న సిబ్బంది పిల్లలు, చుట్టు ప్రక్కల వున్న ఇతర సంస్థలలో పనిచేస్తున్న సిబ్బంది పిల్లలని కూడా చేర్చుకుంటారు. క్రష్ అన్ని ప్రభుత్వ పని దినాలలో ప్రతిరోజూ 9 గం.ల నుంచి 5.30 నిమిషాల వరకు పనిచేస్తుంది. ♦


Printed & published by Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : Phani Kumar**



# గామీణ ˊథలు, వ న ˊథల పోట

న వ్రా వ్రేఈవి మిఈల్ల ˊథ న నం ˊథదే. అయిు్తే, ం ను ం ను వా దయిఈ్వ్ర్రు ే మంచి ˊథలు ˊయివయిప్తో ఈ యి. అందువల్ల మంచి ˊథ మిటం ˊటాల్బ ఋ్బ ˊ ఎ లన' వి ˊ్ర ంర్యింవింది.

న నందర్భేంగా ి గామీణ ˊథలు, వ న్వ ˊథలు అనే ంండు విబాగాల్ల పోట్బ ంఉూాన్ను ం. ి గామీణ నేపథ్యం ' ండ, ి గామీణ ప్ర వంటా్బ ి వా బింబించే ˊథలు ఒ ˊ విబాగంల ను, వ న్వ ˊథలను మరొ ˊ విబాగంల ను ఎరిగణనల నిఈను ోవటం యిగ్ర ఈది.

## ఎ ఘమ ంల వివంల ం

ంండు విబాగాలక విడవిడగా ంద ఎరొ న వాుమ ఈుంటాయి.

| | |
|---|---|
| ్ర మి గామీణ ˊథ | ం్ర 15,000 |
| ్ర మ వ న్వ ˊథ | ం్ర 15,000 |
| ది తీయి ్ర మి గామీణ ˊథ | ం్ర 10,000 |
| ది తీయి ్ర మ వ న్వ ˊథ | ం్ర 10,000 |
| ్ర తీయి ్ర మి గామీణ ˊథ | ం్ర 8,000 |
| ్ర తీమ ్ర మ వ న్వ ˊథ | ం్ర 8,000 |
| ిఎ విబాగంల మ డు ˊనో లఉన తివాుమ్త ంలు (ఒ ˊ ˊథ ) | ం్ర 5,000 |
| న దఈంఈ్రి ఎచుంం్రక ఎంవా ిఈ గామీణ, వ న్వ ˊథలక | ం్ర 2,000 |

### గామీణ, వ న ˊథల పోట సిథలు ఎంఎ ంద్రఈ (ఈఈు ఈది న చఈను గమ ంచ లి:

- ☆ ˊథలు ఉద ఎరొఈ చిఈ న వ క న వరి 1వ్తే దీ ల గా అందే విదంగా ఎంఎ లి.
- ☆ ఒ ˊరిఈ ఎ్బ ˊథలయిన ఎంఎవచుఈ ☆ ంండు విబాగాల పోటలల ను ఎ ల్గనవచుఈ
- ☆ ˊథ ం్ర ఈవా మీద ˊథ ఎఈ వ్ర ఈమే గిండ లి. ంబ్రఈ ఎఈ ˊథ న్రిఈ ఎరిచే వ మీ ప్రి ఈల వుంటఈ లు.
- ☆ ˊథ్బ డవి చే ం్ర ఈల A4 ఈజు ా్ర ల్ల 6 ఎజీలు మించఈడదు. ఈజుక మించిన ˊథలను ఎరిశీలించఈం న ద్వఎడదు.
- ☆ ఎజీ నిఒ ˊ ఎˊరీవ్ర ఈమే, దన ్ర అంర్థుయ్యే విదంగా, న్పషంగా ం యిఈలి.
- ☆ న వ ˊ అంశి ల్తో ఎ టు అ్బ అంశి లఈా ˊథలు ఎంఎవచుఈ అశ్లీల్తఈ అనబ్యూఈ క లమ్త లను ంచఈటఈంఉులు, ం ˊయిఈలు, వ్య న్తిఈద షణ, మ త్తిఈవం లఈండ ' ండే ˊథలు ఎంఎ లి.
- ☆ పోట నిుం ఎ ˊథలు్ర లుగు నంనరో నిుగ్గంగ్రా గిండ లి. అయివ్ర చుఈ న ˊథఈశి లు, విదేశీ నంనరీతీ ˊథల ి వా ఎలించఈడదు. అను ˊంఋ వ్ర ఈల్తో కూడన ˊథఈశి లక ద ంరిగా గిండ లి.
- ☆ ఎంఎ ˊ ్బా ˊథలఈా ఎటువంటన్రి ఈఈ్ర్రి ఈఈఈ లు గిండవు. ఎంఎ ˊ ్బా ఎ ˊథల ్రఈమ ˊథలను ి ఎ ఎంఎ ల్బ ోయిక నేఎ యి అందుక అవనంఋన న ంవులు అంటవిచిన ˊవల్లను కూడ ్రఈ ˊ ్రఈ చేయిఈలి.
- ☆ న వ్యయిఈర్తేఈల ˊమిట వ్ర ఈమే తివాుమా పొందే ˊథలను్బ ంర్యిన్నుది.
- ☆ ఎంఎ ఈ ˊథలు ఋ్బ ˊ ఎ లన' వి ˊల ి ఎచుఈ్రఈమవ్ర యి.
- ☆ ఎల్తి లను వి తివరి 2010 ఋ్బ ˊ ఎ లన' వి ˊల చఈఈవచుఈ


చియిన వ :

ఎడటర్, న ˊ ఎ లన'

ఎ.ఎం. ర్. అఎ ర్, ం జఈ దనగర్, ఈదం బాద-500 030.

రి ది ఎదేశ్, ండయిఈ

పోన: 040-24018656, ఎ్వ ్ : 040-24017005

E-mail: phanikumar@ap.gov.in



# చిన్నారి మురిపించిన
# చలన చి ో వం



Printed at: Caxton Offset Pvt. Ltd., Hyd.